www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 214 | బుధవారం | 24 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రక్తాక్షర నివేదన

- న్యాయం చేయాలంటూ ప్రధానికి, యుపి సిఎంకు రక్తంతో లేఖ రాసిన అత్యాచార బాధితురాలు
- న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరిక

10లో

యుపిలో దళిత యువతి సజీవ దహనం

- ఇంట్లోకి ప్రవేశించి 19 ఏళ్ల అంజును నిప్పంటించిన తండ్రి, కొడుకు
- ప్రతాప్‌గఢ్‌లో దారుణం

ప్రతాప్‌గఢ్ : ఉత్తరప్రదేశ్‌లో ప్రతాప్‌గఢ్‌లోని లాల్‌గంజ్ ప్రాంతంలో తండ్రీ కొడుకులిద్దరు 19 ఏళ్ల దళిత బాలికను సజీవ దహనం చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మిథైలాల్ అనే మహిళ కూతురు అంజు ఇంట్లో తరువాయి 6లో



హర్యానాలో అమానుషం

- కారు నుంచి బయటకు లాగి కుటుంబ సభ్యుల ముందే 22 ఏళ్ల యువతిపై అత్యాచారం
- గురుగావ్‌లో ఘటన, నలుగురు అరెస్టు

10లో

అలస్కాలో భూకంపం

11

- రిక్టర్‌పై 8.2గా నమోదు



ప్రసాద్ ఐమాక్స్ సీట్ల అమరికపై హైకోర్టు నోటీసులు

3లో

మార్కుల విద్యవల్లే అనర్థాలు

- ర్యాంకుల చదువులతోనే మాస్ కాపీయింగ్, విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి
- పట్టించుకోని తల్లిదండ్రులు
- కార్పొరేట్ సంస్థల్లో ఆత్మహత్యల పరంపర
- భ్రష్టు పడుతున్న విద్యా వ్యవస్థ
- క్రమశిక్షణ కొరవడి పిల్లలు దారి తప్పే ప్రమాదం
- హైకోర్టు డివిజన్ బెంచ్ ఆందోళన



మన తెలంగాణ/ హైదరాబాద్: ఎలాగైనా సరే మార్కులే కావాలనే పెద్దలు.. ర్యాంకులే ప్రధానంగా విద్యాసంస్థలు..ఫలితంగా మాస్ కాపీయింగ్.. వీటి దుష్పరిణామాల వల్ల విద్యావ్యవస్థ భ్రష్టు పడుతోందని రెండు వేర్వేరు కేసుల్లో హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్వత్తుతో పనిలేకుండా మార్కులు లేదా ర్యాంకులే ప్రధానమనే దుస్థితి కారణంగానే చూచిరాత పరీక్షలు పెరిగిపోతున్నాయని, ఇలాంటి పరిణామాల వల్లే పిల్లల్లో క్రమశిక్షణ కొరవడి దారితప్పే ప్రమాదం ఉందని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. మాస్‌కాపీయింగ్, పుస్తకాలు పెట్టి పరీక్షలు రాసే దుష్ట విధానాన్ని అడ్డుకునేందుకు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు బెంచ్ మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల చూచిరాత పరీక్షలే జరుగుతున్నాయని, వీటి వల్ల విద్యా ప్రమాణాలు దిగజారిపోతాయని పిటిషనర్ వాదన. పరీక్షలు ఒకదారికి రావాలంటే మండల లేదా జిల్లా స్థాయి విద్యాధికారులను బాధ్యులను చేయడమే సరైన విధానమవుతుందనే అభిప్రాయాన్ని బెంచ్ వ్యక్తం చేసింది. ఈ తరువాయి 6లో

ఉగ్ర, వాతావరణాలు

ప్రపంచానికి జంట సవాళ్లు : దావోస్ వేదికపై నుంచి ప్రధాని మోడీ హెచ్చరిక

భారత్‌లో సమ్మిళిత విధానాలే అనుసరిస్తున్నామని వెల్లడి



దావోస్: ఉగ్రవాదం, వాతావరణ మార్పులు ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం నాడు పేర్కొన్నారు. కొందరు చెప్పే 'మంచి', 'చెడ్డ' ఉగ్రవాదాలు రెండూ సమానంగా ప్రమాదకరమని హెచ్చరించారు. స్విట్జర్లాండ్ పర్వత సాణువులలోని విరామ కేంద్రం దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యు ఇఎఫ్) వార్షిక సమావేశం ఆరంభ సదస్సులో కీలక ప్రసంగం చేస్తూ మోడీ పైవిధంగా హెచ్చరించారు. టెర్రరిజం బెడదపట్ల భారత్ వైఖరి ప్రపంచ దేశాలకు బాగా తెలుసు కాబట్టి ఆ అంశంపై విస్తృతంగా మాట్లాడబోనని ఆయన అన్నారు. శాంతి, భద్రత, సుస్థిరతలు ప్రపంచంలో ప్రమాదంలో పడ్డాయని మోడీ చెప్పారు. సాంకేతిక విజ్ఞానం ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ నేటి యుగంలో సమాచారమే అసలైన సంపద అని అన్నారు. సమాచారాన్ని సేకరించి, నియంత్రించడం ఎవరు చేస్తారో వారిదే భవిష్యత్తులో ఆధిక్యత అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రవహిస్తున్న డేటా అటు మంచి తరువాయి 6లో



తెలంగాణ కుంభమేళా

పర్యాటక కేంద్రంగా మేడారాన్ని అభివృద్ధి పరుస్తాం

గిరిజన మ్యూజియంను ప్రారంభిస్తూ కడియం



మన తెలంగాణ/ వరంగల్ : తెలంగాణ కుంభమేళగా పిలువబడే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. మంగళవారం మేడారంలో దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన, పర్యాటక,సాంస్కృతికశాఖ మంత్రి అజ్మీర చందూలాల్, రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి ఉపముఖ్యమంత్రి రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సమ్మక్క సారలమ్మ గిరిజన మ్యూజియం, రూ.7.5 కోట్ల వ్యయంతో నిర్మించిన హరిత హోటల్, కోటి రూపాయల వ్యయంతో హ్యాపీ హౌజ్, కల్యాణ కట్టలను ప్రారంభించారు. అనంతరం ఆర్‌టిసి ఏర్పాట్లను పరిశీలించారు. మేడారంలోని ఐటిడిఎ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారానికి కోటి 25 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తరువాయి 6లో

బిజెపితో శివసేన కటీఫ్

10లో

- వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగాలని తీర్మానం

వివాహేతరం ఎఎస్‌పి, సిఐల సస్పెన్షన్

2

ఐక్యతా విందు

28న కాంగ్రెస్ నేతల సమావేశం

300 మంది ముఖ్యనేతలకు ఆహ్వానాలు

అందరినీ కలుపుకొని పోయేందుకు ఉత్తమ్ యత్నాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎన్నికలు దగ్గరపడుతుండడంతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల మధ్య ఐక్యత సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తామంతా ఒక్కటేనని ప్రజలకు చాటడంతో పాటు, కాంగ్రెస్ శ్రేణులకు విశ్వాసం కల్పించేందుకు చర్యలు జోరందుకున్నాయి. ఫిబ్రవరి మూడవ వారం నుండి నాయకులందరూ కలిసి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనికి సన్నాహకంగా తొలుత నాయకులను ఏకతాటిపై తీసుకువచ్చేందుకు అంతర్గతంగా తరువాయి 6లో



సిబిఐ కస్టడీకి లయోనియా రిసార్ట్స్ ఎండి చక్రవర్తి రాజు



మన తెలంగాణ/ హైదరాబాద్: నకిలీ భూ పత్రాలతో వివిధ బ్యాంకులను నమ్మించి రూ.650 కోట్ల మేరకు రుణం పొంది మోసగించిన లయోనియా రిసార్ట్స్ ఎండి చక్రవర్తిరాజుని మరింత లోతుగా విచారించేందుకు సిబిఐ అధికారులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. వివిధ బ్యాంకు యాజమాన్యాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చక్రవర్తిని బెంగుళూరు సిబిఐ అధికారులు ఈ నెల 17న అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో ఎవరెవరి హస్తం ఉందని, తీసుకున్న వందల కోట్ల రూపాయల రుణాలు ఎక్కడ దాచారు, ఆ సొమ్ముతో ఆస్తులు ఏమైనా ఖరీదు చేశాడా అనే విషయాలపై మరింత లోతుగా విచారించాలని వారు భావించి, నాంపల్లి సిబిఐ కోర్టులో కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా, పిటిషన్‌పై వాదోపవాదనల అనంతరం చక్రవర్తిని మూడు రోజుల కస్టడీకి ఇస్తూ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో చక్రవర్తిని కస్టడీలోకి తీసుకున్నారు. చక్రవర్తిరాజుకు శామీర్‌పేట్‌లో లియోనియా రిసార్ట్స్ పేరుతో కేవలం 30 ఎకరాల భూమి మాత్రమే ఉంటే వందల ఎకరాల భూమి ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకులను నమ్మించి సుమారు రూ. 650 కోట్ల రుణాలు పొందాడు. నకిలీ పత్రాలు సృష్టించడంలో మరెవరిదైన పాత్ర ఉందా, ఈ వ్యవహారంలో మరి కొందరిని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని సిబిఐ అధికారులు తెలిపారు.

ఫీజులు పెంచితే చర్యలు తప్పవు

ప్రైవేట్ స్కూళ్లకు విద్యాశాఖ హెచ్చరిక

మనతెలంగాణ/ హైదరాబాద్ : ప్రైవేట్ స్కూళ్లలో కచ్చితంగా పాత ఫీజులే కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఫీజులు పెంచవద్దని విద్యాశాఖ మరోసారి సర్క్యులర్ జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా ఫీజులు పెంచితే జరినామానా విధించడంతోపాటు గుర్తింపు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. 1983 ఎడ్యుకేషన్ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణాధికారం ప్రభుత్వానికి ఉందని విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ, ఐబి, కేంబ్రిడ్జి తదితర అఫిలియేషన్లు కలిగిన పాఠశాలల్లో జనవరి 2 నుంచి 12 వరకు ప్రవేశాల ప్రక్రియ నిర్వహించి, 12న ప్రవేశాలు ఖరారు చేయాలని నోటిఫికేషన్ జారీ చేశామని, జనవరి 4న పాత ఫీజులే కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశామని గుర్తుచేశారు.

27న నైతికత, మానవ విలువల పరీక్ష

మనతెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 27న నైతికత, మానవ విలువలు, 29న పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు తెలిపారు. www.admi.cgg.gov.in వెబ్‌సైట్‌లో కాలేజ్ లాగిన్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంచామని వారికి తెలియ జేశారు.

చెక్కుల ముద్రణకు కేంద్రం అనుమతి!



- **రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన బ్యాంకర్లు**

మన తెలంగాణ/ హైదరాబాద్ : పెట్టుబడి పథకం కింద ఎకరాకు రూ. 4 వేలు చెక్కుల రూపంలో ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అనుమతి కోరనుంది. ప్రభుత్వం తరపు నుంచి బ్యాంకుల సహకారంతో పెట్టుబడి పథకం అమలు చేస్తున్నందున కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ అనుమతులు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. రెవిన్యూ రికార్డుల ప్రక్షాళన తరువాత తేలిన భూముల ఖాతాల ఆధారంగా 71 లక్షల చెక్కులు పంపిణీ చేయాల్సి ఉంది. సాధారణంగా బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి మేరకు ఒకటి లేదా రెండు చెక్కు పుస్తకాలను ఇస్తారు. అయితే ప్రభుత్వం నుంచి ఒకేసారి 71 లక్షల చెక్కులు ఇవ్వాల్సి రావడంతో ప్రింటింగ్ తదితర విషయాలపై కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలని బ్యాంకర్లు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కేవలం మహారాష్ట్రలోని నాసిక్‌లో ఆర్‌బిఐ ఆధ్వర్యంలో చెక్కుల ప్రింటింగ్ మిషన్ ఉంది. పరిమితులకు అనుగుణంగా రోజువారీగా చెక్కుల ముద్రణ చేస్తారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే చెక్కుల్లో కొంత అదనపు సమాచారం కూడా ఉంటుండం, వ్యవసాయాధికారుల సంతకాలు కూడా డిజిటల్ కావడంతో నూతన సాఫ్ట్‌వేర్ ఆధారంగా ప్రింట్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ కేంద్రం నుంచి అనుమతి వస్తేనే ప్రక్రియ ప్రారంభం అవుతుందని బ్యాంకర్లు చెబుతున్నారు. చెక్కల ప్రింటింగ్ ఖర్చులు కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది.

పంట పండని భూమికి లేనట్లే !

రాష్ట్రంలో మొత్తం 1.42 కోట్ల వ్యవసాయ భూమి ఉన్నట్లు ఇటీవల చేపట్టిన రికార్డుల ప్రక్షాళనలో తేలింది. అయితే ఇందులోనే సాగుకు యోగ్యం కాని, పంటలు పండని భూములు కూడా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. సాగుకు పనికిరాని భూములకు పెట్టుబడి అవసరం లేదని మంత్రివర్గ ఉపసంఘం కూడా సిఫార్సు చేసింది. రాళ్లు, రప్పలు, గుట్టలు వంటి భూముల్లో పంటలు పండవని, ఆ భూములకు ఎకరాకు రూ. 4 వేలు ఇవ్వరాదని సిఎం కె. చంద్రశేఖర్‌రావు కూడా అధికారులతో పేర్కొన్నట్లు తెలిసింది. వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవిన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలు పండని భూములు గుర్తించాలని పేర్కొన్నట్లు సమాచారం. ఏయే భూములు పెట్టుబడి ఇచ్చేందుకు సరైనవి కాదో వాటిని ఎలా గుర్తించాలనే దానిపై త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనున్నారు. అయితే కొంత మంది రైతులు రాళ్లు ఉన్న భూముల్లో పండ్ల తోటలు సాగు చేసుకుంటామని మొత్తం భూములకు పెట్టుబడి ఇవ్వాలని కోరుతున్నారు.

యాసంగి పెట్టుబడికి వానాకాలం సాగు ఆధారం

రానున్న వానకాలం సీజన్‌కు ఎకరాకు రూ. 4 వేలు ఇచ్చిన తరువాత ప్రతి సర్వే నెంబర్ ఆధారంగా ఏయే గుంటలో ఏయే పంట వేసారో ఎఇఒలు వివరాలు సేకరించి, ట్యాబ్‌లలో నిక్షిప్తం చేయనున్నారు. తద్వారా యాసంగిలో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగవుతాయో, రైతులు ఏయే సర్వే నెంబర్‌లలో పంటలు వేసే అవకాశం ముందే అంచనా వేయనున్నారు. అందుకనుగుణంగా పెట్టుబడి సొమ్మును యాసంగిలో అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత 5 సంవత్సరాలలో అధిక విస్తీర్ణం ఎంత నమోదైందో కూడా వ్యవసాయ శాఖ వివరాలు సేకరిస్తోంది.

మిషన్ భగీరథతో విప్లవాత్మక మార్పు

ప్రతి ఒక్కరికి రోజుకు 100లీటర్ల మంచినీరు: సిఎస్

మన తెలంగాణ / హైదరాబాద్ : మిషన్ భగీరథతో సామాజిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పు వస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి.సింగ్ అన్నారు. ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్ కార్యాలయంలో మిషన్ భగీరథలో ప్రజల భాగస్వామ్యంపై మంగళవారం నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో మిషన్ భగీరథను సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు. తెలంగాణ రెండు నదుల మధ్య ఉన్నా తాగునీటి కొరత ఉందని, భౌగోళిక స్వరూపంతో పాటు ఇతర అంశాలు కూడా ఇందుకు కారణమని అన్నారు. లక్షలాదిమందికి తాగునీరు అందడం లేదని, ఈ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వం మిషన్ భగీరథను ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి రోజుకు వంద లీటర్ల మంచినీరు లభిస్తుందన్నారు. భగీరథ పనులు తుది దశకు చేరుకున్నాయని, 19ఇంటెక్‌వెల్స్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. పైప్‌లైన్ల నిర్మాణాలు 91శాతం పూర్తయిందని తెలిపారు. పది రోజుల్లో మిగతా పైప్‌లైన్ల నిర్మాణం పూర్తవుతుందన్నారు. 50 నీటి శుద్ధి కేంద్రాలకు గాను 46కేంద్రాల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. అనంతరం రాష్ట్రంలో దశల వారీగా 24,225 గ్రామాలకు పూర్తిగా నీటిని అందిస్తామని చెప్పారు. మార్చి 15నాటికి రాష్ట్రంలోని చివరి గ్రామానికి నీళ్లు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచబ్యాంకు ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్ జెవిఆర్ మూర్తి, ప్రైస్‌వాటర్ యాక్షన్ నెట్ వర్క్ సౌత్ ఏషియా రీజనల్ కోఆర్డినేటర్ స్నేహలత, ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాములునాయక్ తదితరులున్నారు.

మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

- **ఉప రాష్ట్రపతి వెంకయ్య**



మన తెలంగాణ/ హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తీసుకున్న అతిపెద్ద సంస్కరణ వస్తు సేవల పన్ను(జిఎస్‌టి) అని, దీని ద్వారా పన్నుల చెల్లింపులు పెరుగుతాయని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రానున్న పదిహేను సంవత్సరాల్లో ప్రపంచం లో మూడవ పెద్ద ఆర్థిక శక్తిగా భారత్ అవతరించబోతున్నదన్నారు. హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ విద్యాసంస్థలో ''ఫైనాన్స్, టాక్సేషన్, మా ర్కెటింగ్ రంగాలలో సమకాలీన సవాళ్లు'' అనే అంశంపై రెండు రోజుల పాటు జరగనున్న జాతీ య సదస్సును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మా ట్లాడుతూ 90వ దశకంలో వచ్చిన సరళీకరణ వల్ల నే మన దేశం త్వరితగతిన ఆర్థికశక్తిగా ఆవిర్భవించిందన్నారు. 1991వ సంవత్సరంలో 225 బిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఉన్న భారత్ ఇప్పుడు రెండు ట్రిలియన్ డాలర్ల శక్తిగా ఎదిగిందన్నారు. పి.వి. నరసిం హరావు ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణలను వాజ్‌పేయి ప్రభుత్వం, ప్రస్తుత మో డీ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆయన వివరించారు. రానున్న కాలంలో పెరుగుతున్న మధ్యతరగతి జనాభా దేశ ఆర్థిక రంగాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. దేశ జనాభా లో 65 శాతం ఉన్న 35 సంవత్సరాల వారికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అసవరం ఉన్నదని, వారికి తగిన నైపుణ్యాలను అందించాలని చెప్పారు. 2018లో భారత వృద్ధి రేటు 7.3 శాతంగా ఉంటుందని ప్రపంచ బ్యాంక్ అంతర్జాతీయ ద్రవ్యనిధిఅంచనా వేసిందని, బ్యాంకుల వద్దకు చేరిన రూ. 2.11 లక్షల కోట్ల రుణ లభ్యత పెరిగి, ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మ హమూద్ అలీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉప కులపతి రామచంద్రం, యుజిసి సభ్యులు గోపాల్ రెడ్డి, కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల అధ్యక్షులు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం : బిజెపి



మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపిలోని అన్ని విభాగాలు పోరాటం చేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ఆచారి అన్నారు. ప్రభు త్వ ప్రజావ్యతిరేక విధానాన్ని ఎండగట్టాలన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా రాష్ట్ర కమిటీ ఫిబ్రవరి 2న చేపడుతున్న ''మహిళా యుద్ధ భేరి'' పోస్టర్‌ను మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల లలితతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ షీ బృందాలు కేవలం నామమాత్రమేనని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. అనంతరం ఆకుల విజయ మాట్లాడుతూ టిఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల పట్ల చిన్న చూపు చూస్తోందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ హామీని ప్రభుత్వం విస్మరించిందని, డ్వాక్రా మహిళలను టిఆర్‌ఎస్ కార్యకర్తలుగా వాడుకుం టున్నారని ఆరోపించారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళాభవన్‌లో మహిళా యుద్ధభేరిని నిర్వహించనున్నామని తెలిపారు. మహిళల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

26న భారతమాత మహాహారతి: కిషన్ రెడ్డి



మన తెలంగాణ/ హైదరాబాద్: దేశభక్తితో రాజకీయాలకు అతీతంగా''భారతమాత మహాహారతి'' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బిజెఎల్‌పి నేత జి.కిషన్ రెడ్డి అన్నారు. భారత మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరగనున్న ''భారతమాత మహాహారతి'' ఏర్పాట్లను కిషన్ రెడ్డి నేతృత్వంలోని బిజెపి బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు చింతల రాంచంద్రారెడ్డి, ఎన్‌వివిఎస్ ఎస్.ప్రభాకర్, ఎంఎల్‌సి ఎన్.రాంచంద్రరావు, భారత మాత ఫౌండేషన్ వైస్ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఈ మహా హారతిలో స్వామిపరిపూర్ణనంద స్వామి పాల్గొంటారని, రెండు వేల మంది అమ్మాయిలు భారతమాత లాగా తయారుకానున్నట్టు వివరించారు. పూ జ, సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్. రామచంద్రారావు మాట్లాడుతూ మహాహారతికి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు.

ఎఎస్‌పి, సిఐల సస్పెన్షన్





మన తెలంగాణ/ హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖలో విధులు నిర్వహిస్తున్న అదనపు ఎస్‌పి సునీతారెడ్డి, కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్ ఎ.మల్లిఖార్జున్‌రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధాన్ని ఎఎస్‌పి భర్త సురేందర్‌రెడ్డి ఆదివారం అర్ధరాత్రి బయటపెట్టడం పోలీసు శాఖలో కలకలం రేపింది. సిఐ మల్లిఖార్జున్‌రెడ్డిపై మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో ఐపిసి 447, 497, 506 సెక్షన్‌ల కింద కేసు నమోదు అయింది. సునీతారెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డిల అనైతిక వ్యవహారంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఉదంతంపై విచారించిన మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్ ఎఎస్‌పి సునీతారెడ్డి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం డిజిపికి నివేదిక ఇచ్చారు. మరోవైపు ఎఎస్‌పి భర్త సురేందర్‌రెడ్డి కూడా తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిజిపి మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా రిద్దరిపై సస్పెన్షన్ వేటు వేశారు. పోలీసులు మల్లిఖార్జున్‌రెడ్డిని అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

పోలీసు శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు: హోంమంత్రి

పోలీసు శాఖలో విధులను నిర్వహిస్తూ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు చేపడతామని రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అవినీతి నిరోధక శాఖలో అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న డి. సునీత, కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న వై.మల్లిఖార్జున్ రెడ్డి వ్యవహారం శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఉన్నందున సస్పెండ్ చేశామన్నారు.

మహిళా శిశు సంక్షేమశాఖకు పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ బాధ్యత

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో ఇకపై జరిగే వివాహాలన్నీ తప్పని సరిగా రిజిస్ట్రేషన్ కానున్నాయి. గ్రామాలు మొదలుకొని పట్టణాల వరకూ జరిగే పెళ్లిళ్లన్నింటినీ కూడా విధిగా నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు మహిళా శిశు సంక్షేమ శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ రిజిస్ట్రేషన్ యాప్‌ను అభివృద్ధి చేసి నమోదు ప్రక్రియను ప్రారంభించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖకు తక్షణంగా రూ. కోటిన్నర నిధులను ప్రభుత్వం కేటాయించింది. వివాహాల నమోదు ప్రక్రియకు రాష్ట్ర స్థాయిలో మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌ను, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు బాధ్యులుగా ఉంటారని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామ పంచాయతీ ప్రాంగణంలోనూ, వీధి కూడళ్లలోనూ పెళ్ళి రిజిస్ట్రేషన్ నమోదు గురించి కరపత్రాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించనుంది.

ఎకో టూరిజానికి పెద్దపీట

మంత్రి జోగు రామన్న

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎకో టూరిజంకు రాష్ట్రంలో పెద్ద పీట వేయనున్నట్లు అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. సచివాలయంలో మంగళవారం మంత్రి ఆయన ఛాంబర్‌లో అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డిసి) కార్యక్రమాలను చైర్మన్ బండ నరేందర్ రెడ్డితో కలిసి సమీక్షించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎకో టూరిజంను ప్రోత్సహించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎకో టూరిజం అభివృద్ధికి అనువైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజంలో భాగంగా నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌తో నేరెడిగొమ్మ మండలం పెద్ద మునగాల గ్రామంలో రూ. 2 కోట్లతో, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామంలో రూ. 2 కోట్ల వ్యయంతో కొత్త ప్రాజెక్టులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యూకలిప్టస్ అమ్మకాల ద్వారా ఎఫ్‌డిసికి రూ.123 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. వెదురు ఆదాయం ఉమ్మడి రాష్ట్రంలో రూ. 5 కోట్లు కాగా, స్వరాష్ట్రంలో ఈ ఏడాది రూ.13 కోట్లుగా ఉందన్నారు.

పరేడ్‌గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవం

మన తెలంగాణ/హైదరాబాద్: భారత గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఈనెల 26న ఉదయం 9:15గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఆవిష్కరిస్తారు. అనంతరం జరిగే పరేడ్‌లో గవర్నర్ వివిధ శాఖల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారని ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటలో తెలియజేసింది.

జయకేతనం ఎగిరేసేందుకు సిద్ధంకండి

తెలంగాణలోని అన్ని స్థానాల నుండి పోటీచేస్తాం: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్





మన తెలంగాణ/ కరీంనగర్ ప్రతినిధి : రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ తెలంగాణలోని అన్ని స్థానాల నుండి పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. చలోరే చలోరే చల్ నినాదంతో తన రాజకీయ ప్రస్థానాన్ని జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం నుండి సోమవారం ప్రారంభించిన పవన్‌కల్యాణ్ మంగళవారం స్థానిక రేకుర్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల నాయకుల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ విజయకేతనం ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని, సైనికుల్లా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి పాటుపడాలని పవన్‌కల్యాణ్ సూచించారు. తాను 2009 సంవత్సరం నుంచి రాజకీయాల్లో ఉన్నానని ప్రస్తుతం కరీంనగర్ నుండే పూర్తిస్థాయి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించానని పేర్కొన్నారు. జనసేన పార్టీలో యువతకు పెద్దపీట వేస్తున్నామని, మార్చి 14వ తేదీ లోపు జనసేన పార్టీ పూర్తిస్థాయి ప్రణాళికను ప్రకటిస్తామని తెలిపారు. జనసేన పార్టీ ఆవిర్భావం రోజున పార్టీ ప్రణాళికను ప్రకటించడంతో పాటు సిద్ధాంతాలను వివరిస్తామని, ఈ సిద్ధాంతాలను ప్రజల చెంతకు తీసుకుపోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కుల, మతాలకు అతీతమైన పార్టీగా జనసేనకు గుర్తింపు తీసుకువచ్చి అవినీతి, అక్రమాలపై పోరాటం చేస్తామని ప్రకటించారు. తనకు ఎవరితోనూ వ్యక్తిగతమైన శత్రుత్వం లేదంటూ తనను ద్వేషించే వారిని పట్టించుకోనని, ప్రేమించే వారి గురించి మాత్రమే ఆలోచించి వారి కోసం ప్రాణమైనా ఇస్తానని పేర్కొన్నారు. బిసి. ఎస్.సి, ఎస్టీ, మైనార్టీ కులాలకు సామాజిక న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. అణగారిన వర్గాలకు తాను అండగా ఉంటానని పేర్కొంటూ జనసేన పార్టీ మతాలకు అతీతంగా ప్రజల అభివృద్ధికే పెద్దపీట వేస్తుందన్నారు. తెలంగాణలో దళితులకు అండగా ఉంటామన్నారు. ప్రాంతీయతను గౌరవిస్తూ ఆడపడుచులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తనపై చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. వారు నోటికి వచ్చినట్లు వ్యాఖ్యానిస్తే ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. తన సోదరుడు సైతం కాంగ్రెస్ పార్టీలో ఉన్నాడన్న విషయాన్ని తాను మరిచిపోలేదని చిరంజీవిని ఉద్దేశించి పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డల సమస్యల పరిష్కారం కోసం రోడ్డు మీదకు వచ్చి పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

Dwaraka



పవన్ కల్యాణ్‌కు అనుమతెలా ఇచ్చారు?

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో పర్యటించేందుకు, సభలు పెట్టుకునేందుకు కోదండరామ్, మందకృష్ణకు లేని అనుమతులు పవన్ కళ్యాణ్‌కు ఎలా ఇచ్చారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో మాజీ ఎంపి వి.హనుమంతరావు, సిఎల్‌పి ఉపనేత టి.జీవన్‌రెడ్డిలు మాట్లాడారు. తెలంగాణ కోసం జైళ్ల పాలైన వాళ్ళను ఇప్పుడు సభలు పెట్టుకోనివ్వడం లేదు కాని వ్యతిరేకించిన వారికి మాత్రం అనుమతులు ఇస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కెసిఆర్‌ను పవన్ కళ్యాణ్ తాట తీస్తానన్నారని, ఇప్పుడు అలాంటి సిఎం లేడంటూ పొగుడుతున్నాడని ఎద్దేవా చేస్తున్నారు. తెలంగాణలో ప్రజలు బాగున్నారని, పాలన బాగుందని పవన్ అన్నప్పుడు ఇక పర్యటించడం ఎందుకని అన్నారు. తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకున్న వారిని పరామర్శిస్తానంటే కోదండరామ్‌కు, ఎస్‌సి వర్గీకరణ కోసం మంద కృష్ణ దీక్షకు అనుమతులు ఉండవని జీవన్‌రెడ్డి అన్నారు. అజ్ఞాతవాసి సినిమాకు ఐదు షోలు అనుమతిస్తే కెసిఆర్ స్మార్ట్ సిఎం అయ్యారని, అందుకే కెసిఆర్‌కు పవన్ భజన చేస్తున్నాడని అన్నారు. అంతా బాగుంటే జనసేనను టిఆర్‌ఎస్‌లో విలీనం చేసుకోవాలని పవన్‌కళ్యాణ్‌కు జీవన్‌రెడ్డి సూచించారు.

సీట్ల పెంపు ఖాయం!

• రాష్ట్రానికి సంకేతమిచ్చిన కేంద్రం! • డీలిమిటేషన్ చర్చలు షురూ



మన తెలంగాణ / హైదరాబాద్ : పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జరగాల్సిన శాసనసభ స్థానాల పెంపు దాదాపు ఖాయమైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టడానికి కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వశాఖ, న్యాయ మంత్రిత్వశాఖలు క్యాబినెట్ నోట్‌ను తయారు చేసి సిద్ధంగా ఉంచుకున్నాయి. సీట్ల సంఖ్యను పెంచాలనేది రాజకీయ అంశం కాబట్టి ప్రధాని నుంచి సానుకూల నిర్ణయం లభించింది. ఇక కేంద్ర మంత్రివర్గంలో చర్చించి ఆమోదం తెలపడమే తరువాయి. బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో పెట్టనుంది. పునర్ వ్యవస్థీకరణ చట్టానికి మాత్రమే సవరణ చేసే బిల్లుగా ఉంటుందా లేక రాజ్యాంగ సవరణ బిల్లుగా ఉంటుందా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. లోక్‌సభలో బిజెపికి స్పష్టమైన మెజారిటీ ఉన్నందున రాజ్యసభలో ఆమోదం ఆసక్తికరంగా మారింది. పార్లమెంటులో బిల్లు చర్చకు వచ్చినపుడు తమ వైఖరి వెల్లడిస్తామని కాంగ్రెస్ బైటకు చెప్తున్నా వ్యతిరేకించే అవకాశం లేకపోలేదు.

టిఆర్‌ఎస్ కసరత్తు : అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్రం నుంచి వచ్చిన సంకేతంతో ముఖ్యమంత్రి కెసిఆర్ గత మూడు రోజులుగా తన ఫామ్‌హౌస్‌లో కొత్త నియోజకవర్గాల కూర్పుపై సీనియర్ నేతలతో చర్చిస్తున్నట్లు తెలిసింది. ప్రతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెరగనున్నందువల్ల రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనంగా 34 కొత్తగా చేరనున్నాయి. అయితే కొత్తగా ఉనికిలోకి రానున్న ఈ నియోజకవర్గాల కూర్పు ఎలా ఉండాలి, అందులోకి ఏయే మండలాలు వెళ్తాయి, సామాజికవర్గాల వారీగానూ, ఇతర అంశాలవారీగానూ అధికార పార్టీకి బలం గా ఉండే మండలాలేంటి, బలహీనత లేంటి, డిలిమిటేషన్ నిబంధనల ప్రకారం చూస్తే మండలాల కూర్పు ఏ విధంగా ఉండే అవకాశం ఉంది... ఇలా అనేక అంశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. కొత్తగా ఏర్పడే శాసనసభ నియోజకవర్గాలు పార్టీకి లాభం కలిగే తీరులో ఉండాలని టిఆర్‌ఎస్ భావిస్తోంది. ప్రస్తుతం ఒక్కో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో సగటున ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కొత్తగా వచ్చే అసెంబ్లీ సీట్లతో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఐదు శాసనసభ స్థానాలే ఉంటాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కొన్ని మండలాలను కొత్త సీట్లలోకి బదిలీ చేయాల్సి ఉంటుం ది. ఈ బదిలీ వల్ల మొత్తం 119 శాసనసభ స్థానాల భౌగోళిక హద్దులు మారుతాయి. కొత్త నియోజకవర్గాలు వస్తుండడంతో ఇతర పార్టీల నుంచి వలస వచ్చినవారికి, టిఆర్‌ఎస్‌లోనే ఉండి టికెట్ ఆశిస్తున్నవారికి కొత్త ఆశలు చిగురిస్తాయి. వివిధ పార్టీల నుంచి వలసవచ్చిన 25 మందికి, టికెట్ ఆశిస్తున్న టిఆర్‌ఎస్ ఆశావహులకు, పోటీ చేసి ఓడిపోయినవారికి ఏ నియోజకవర్గంలో అవకాశాలు ఇవ్వాలో, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యేలలో విజయావకాశాలకు అనుగుణంగా కెసిఆర్ చర్చిస్తున్నట్లు తెలిసింది. కొత్తగా పెరుగుతున్న నియోజకవర్గాలు అంతిమంగా పార్టీకి ఉపయోగపడేలా ఉండేందుకు చేపట్టాల్సిన వ్యూహంపై లోతుగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త అసెంబ్లీ నియోజకవర్గాల కూర్పుతో పార్లమెంటు నియోజకవర్గాల్లో టిఆర్‌ఎస్ గెలుపు ఓటములపై పడే ప్రభావం గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. ఇదే సమయంలో ఎంపీ కేశవరావు నివాసంలో మజ్లిస్ పార్టీ ప్రతినిధులు, టిఆర్‌ఎస్ మైనారిటీ సెల్ విభాగం ప్రతినిధులతో మంగళవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. నగరంలో ఉన్న మూడు పార్లమెంటు నియోజకవర్గాలలో ఆరు అసెంబ్లీ స్థానాలు ఉనికిలోకి వస్తున్నందువల్ల మండలాల బదిలీతో రెండు పార్టీలకు వచ్చే లాభనష్టాలపై చర్చ జరిగినట్లు తెలిసింది.

టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలపైనా చర్యలు

ఆప్ తరహాలో 9 మందిపై వేటేయండి

రాష్ట్రపతి, ఇసికి రేవంత్ ఫిర్యాదు



మన తెలంగాణ / హైదరాబాద్: ఆమ్ ఆద్మీ పార్టీ ఎంఎల్‌ఎల తరహాలోనే లాభదాయక పోస్టుల్లో ఉన్న తొమ్మిది మంది టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలను అనర్హులుగా ప్రకటించాలని కాంగ్రెస్ నేత ఎ.రేవంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్రపతి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు లేఖ పంపారు.రాష్ట్రానికి సంబంధించిన 6 మంది ఎమ్మెల్యేలను గతంలో పార్లమెంటు కార్యదర్శులుగా నియమితులయ్యారని, వారిలో ఎమ్మెల్యే డి.వినయ్ భాస్కర్, జలగం వెంకట్రావు, వి.శ్రీనివాస్‌గౌడ్, జి.కిశోర్ కుమార్, వి.సతీష్ కుమార్, కోవాలక్ష్మి ఉన్నారని తెలిపారు. తెలిపారు. ఈ నియామకాలను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిందని వివరించారు. 2014 డిసెంబర్ నుంచి కోర్టు ఉత్తర్వులు జారీ చేసే దాకా కూడా వారు ఆ పదవుల్లో కొనసాగారని చెప్పారు. ఈ వ్యవహారంలో తీర్పు ఇచ్చినప్పుడే ఇకపై తమకు తెలియకుండా ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన నియామకాలను చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందన్నారు. అయితే ఈ వ్యవహారం తర్వాత కూడా తెలంగాణా ప్రభుత్వం కొత్త విధానంలో మరో ముగ్గురు ఎమ్మెల్యేలను కేబినెట్ ఇచ్చి, కొత్త పదవుల్లో నియమించిందని వెల్లడించారు. ఎంఎల్‌ఏ ఈర్వుల బాలకిషన్‌ను తెలంగాణా సాంస కృతిక సారథిగా, ఎంఎల్‌ఏ సోమారపు సత్యనారాయణను ఆర్‌టిసి ఛైర్మెన్ గా, ఎంఎల్‌ఏ వి.ప్రశాంత్ రెడ్డిని మిషన్ కాకతీయ వైస్ చైర్మన్‌గాను నియమించారని తెలిపారు. ఈ పదవుల్లో ఉన్న వీరు క్యాబినెట్ హోదాతో లభించే అన్ని సౌకర్యాలను, లాభాలను పొందుతున్నారని,లాభదాయక పదవులు నిబంధన కింద వీరు ముగ్గురు ఎంఎల్‌ఏ పదవుల్లో కొనసాగేందుకు వీళ్ళేదన్నారు.

ఎకరా వరికి రూ.34వేలు!

- **పప్పు పంటలకు రుణ పరిమితిని కూడా పెంచాలి**
- **ఎస్‌ఎల్‌టిసికి నివేదించిన వ్యవసాయ శాఖ**

మన తెలంగాణ/హైదరాబాద్: వరి పంటకు ఎకరాకు రూ. 32–34 వేలు రుణం ఇవ్వాలని బ్యాంకులను రాష్ట్ర వ్యవసాయ శాఖ కోరింది. ఈ మేరకు వచ్చే వ్యవసాయ సీజన్‌కు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ కొలబద్ధ) నిర్ణయించాలని రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ(ఎస్‌ఎల్‌టిసి)కి వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపింది. 2018–19వానకాలం,యాసంగిసీజన్‌లకు సంబంధించి బ్యాంకులు ఇవ్వాల్సిన ఏకీకృత రుణ పరిమితి పెంపుపై పంటల సాగు ఖర్చుల ఆధారంగా నివేదించింది. ఎకరా సాగు ఖర్చుల ఆధారంగా లెక్కలు తీసిన అధికారులు అంత మొత్తానికి 10 నుంచి 20 శాతం అధికంగా రుణం ఇవ్వాలని పేర్కొన్నారు.2017–18 సాగు ఖర్చుల ప్రకారం ఎకరా వరికి రూ. 28, 066 అవుతోంది. ఇందుకు అనుగుణంగా రానున్న సీజన్‌లకు వరికి ఎకరాకు రూ. 32–34 వేల మధ్య రుణం ఇవ్వాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 29 వేల నుంచి రూ. 31 వేల మధ్య ఉంది. సాగు నీటి వనరులు లేని ప్రాంతాల్లో మొక్కజొన్న పంటకురూ.18 నుంచి రూ. 20 వేల మధ్య రుణ పరిమితి నిర్ణయించాలని కోరింది. ప్రస్తుతం రూ. 16–18 వేల మధ్య ఉంది. యాసంగిలో మొక్కజొన్న అధికంగా సాగు చేస్తారని, ప్రస్తుతం వచ్చిన నూతన వంగడాలతో దిగుబడి కూడా పెరిగిందని, రుణం కూడా అధికంగా ఇస్తే రైతులకు ఎక్కువగా సాగు చేస్తారని వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఆహార ధాన్యా లు, ఉద్యాన, నూనెగింజలు తదితర మొత్తం 81 పంటలకు ఎస్‌ఎల్‌టిసి స్కేల్ ఆఫ్ ఫైనా న్స్ ఖరారు చేయనుంది. పప్పు ధాన్యాల పంటల సాగు ఏడాదికేడాది పడిపోతుందని వ్యవసాయ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంకుల్లో పంట రుణం తక్కువగా ఉండటమే ఇందుకు కారణంగా పేర్కొంది. పప్పుదినుసుల పంటలకు రుణ పరిమితి పెంచితే సాగు కూడా పెరుగుతుందని భావిస్తోంది. కందులకు రూ. 15–18 వేల మధ్య రుణం ఇవ్వాలని నివేదించింది. మిగ తా పెసర, మినుములు ఇతరత్రా వాటికి రూ. 12–16 వేల మధ్య ఉండాలని ప్రతిపాదించింది. ఇక సాగునీటి వనరులున్న చోట పత్తికి రూ. 34వేల నుంచి రూ. 35 వేలు ఇవ్వాలని ప్రతిపాదించారు. రుణ పరిమితి పెరిగితే పంటల బీమా ప్రీమియం కూడా భారం కానుంది. పంట రుణంలో 2 శాతం ప్రీమియం కింద మినహాయించుకుని మిగతా రుణం ఇస్తారు. పరిమితి పెరిగితే ప్రీమియం కూడా పెరుగుతుందని, దానిని దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి "మన తెలంగాణ"కు చెప్పారు.



ప్రసాద్ ఐమాక్స్‌కు హైకోర్టు నోటీసులు

మన తెలంగాణ/హైదరాబాద్: రాజధానిలోని ప్రసాద్ మల్టీప్లెక్స్ థియేటర్‌లో సీట్ల ఏర్పాటు అశాస్త్రీయంగా ఉన్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రేక్షకులు బయటకు వెళ్లే పరిస్థితి లేదనే కేసులో తెలంగాణ సర్కార్‌లోని పలువురు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సికింద్రాబాద్‌కు చెందిన విజయ్‌గోపాల్ అనే వ్యక్తి హైకోర్టుకు రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. మంగళవారం హై కోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. లార్జ్ స్క్రీన్ థియేటర్‌లో పద్నాలు వరసల్లో 630 సీట్లు ఉంటే వాటి మధ్య నుంచి బయటకు వచ్చే ఆస్కారమే లేకుండా సీట్లు ఉంటాయని పిటిషనర్ వాద న. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టుకు లేఖ రాయాల్సివచ్చిందన్నారు. దీనిని మంగళవారం విచారించిన బెంచ్.. ప్రతివాదులైన తెలంగాణ సీఎస్, మున్సిపల్, హోం, రెవె న్యూ శాఖల అదికారులు, డీజీపీ, జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, థియేటర్ యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసింది. తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

'మాక్ డ్రిల్' విషాదం

- **ఇద్దరు ఆక్టోపస్ పోలీసుల పరిస్థితి విషమం**
- **ఐదుగురికి తీవ్ర గాయాలు**



మన తెలంగాణ/హైదరాబాద్: ఆక్టోపస్ విభాగం నిర్వహించిన 'మాక్‌డ్రిల్' విషాదంగా మారింది. ఐదుగురు గాయపడగా ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మాక్‌డ్రిల్‌లో భాగంగా హైదరాబాద్ శివార్లలో ఓ ప్రముఖుడిని ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తం కావడం, ఉగ్రవాదులను పట్టుకునేందుకు అక్టోపస్ పోలీసులు రంగంలోకి దిగడం, ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా మినీబస్సులో పారిపోతున్న ఉగ్రవాదులను అక్టోపస్ పోలీసులు ఛేజింగ్ చేయడం... ఈ ఇతివృత్తంతో సాగిస రిహార్సల్స్ ప్రణాళికకు భిన్నమైన ఫలితాలను ఇచ్చింది. సుమారు ఆరు కిలోమీటర్లు దూరం వెళ్లాక అక్టోపస్ పోలీసులు ప్రయాణిస్తున్న జీపు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం 11 గంటలకు ఆదిభట్ల ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో అక్టోపస్ అధికారులు నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో విషాదం చోటుచేసుకుంది. ఉగ్రవాదులు దాడులకు పాల్పడినా, ప్రముఖులను కిడ్నాప్ చేసినా ఎలా తిప్పికొట్టాలనే అంశంమై అక్టోపస్ పోలీసులు ఔటర్‌రింగ్ రోడ్డులో నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో జరిగిన విషాదంలో పోలీసులు లక్‌పతి, సురేష్, రాహుల్, భవానీ సింగ్, చెన్న కేశవరెడ్డి, శేఖర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని ఎల్‌బినగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఉద్యమకారులు వద్దా?: చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రావొద్దనుకున్న జనసేన నేత పవన్ కల్యాణ్ ఇప్పుడు సిఎం కెసిఆర్‌కు ఆప్త మిత్రుడయ్యాడని, తెలంగాణ కోసం పోరాడిన పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు శత్రువులయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో 'యూనియన్ 2018 డైరీ'ని చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డితో పాటు యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పవన్ కల్యాణ్ యాత్రకు తెలంగాణ సర్కార్ అనుమతిచ్చి గతంలో నిరుద్యోగ సమస్యలపై ఉద్యమించిన తెలంగాణ జెఎసి ఛైర్మన్‌ను ముప్పుతిప్పలు పెట్టిన తీరు దారుణమన్నారు.

జీవిత కాలానికి ఒకే పాస్‌బుక్

- **ఈ నెలాఖరుకు టెండర్ల ఖరారు**
- **ఫిబ్రవరి చివరికల్లా ముద్రణ పూర్తి**

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆధునాతన పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీపై రెవిన్యూ శాఖ వరుస సమీక్షలు చేస్తూ ఉంది. రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో టెండర్ కమిటీ రెండు రోజుల పాటు 'ప్రీ బిడ్డింగ్' సమావేశాన్ని నిర్వహించి ఇటీవల జారీ చేసిన డాక్యుమెంట్‌కు స్వల్ప మార్పులు చేయాలని నిర్ణయించింది. ముద్రణా సమయాన్ని కుదించడం, జిల్లా అధికారులకే చేరవేయడం అనే మార్పులపై ఈ సమావేశం స్పష్టతకు వచ్చింది. తొలుత ముద్రణా బాధ్యతలు తీసుకున్న సంస్థే స్పీడ్ పోస్టు ద్వారా లబ్ధిదారులకు చేరవేసే అంశాన్ని, ముద్రణకు నిర్దేశించిన గడువును తగ్గించే అంశాన్ని సవరించాలని నిర్ణయించింది. ముద్రణకు ఆసక్తి చూపిన ఇరవై సంస్థలు దాఖలు చేసిన బిడ్‌లను పరిశీలించిన ఈ కమిటీ ఐదారు రోజుల్లో టెండర్‌ను ఖరారు చేయనుంది. ఈ నెల 29వ తేదీకల్లా టెండర్‌ను ఖరారు చేసి ఫిబ్రవరి చివరికల్లా ముద్రణను పూర్తిచేయాలని నిబంధన విధించనుంది. తొలుత ముద్రణకు 90 రోజులు పడుతుందని భావించినా ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నెల రోజుల్లోనే పూర్తిచేసే విధంగా టెండర్ డాక్యుమెంట్‌లోనే స్పష్టం చేయనున్నట్లు తెలిసింది. లబ్దిదారునికి జీవితకాలమంతా ఒకే పాస్‌బుక్ ఉంటుందని, ఒకవేళ మార్పులు చేర్పులతో అందులోని పదహారు పేజీలూ నిండిపోతే దానికి కొనసాగింపుగా 'కంటిన్యూయేషన్ పాస్‌బుక్' జారీ అయ్యేలా టెండర్ డాక్యుమెంట్‌లో మార్పులు జరుగుతున్నాయి. పట్టాదారుకు పాస్‌బుక్‌ను జారీ చేసిన తర్వాత మొత్తం జీవితకాలానికి ఇదే ఉంటుందని, దానికి కొనసాగింపుగా అవే వివరాలతో మరో పాస్‌బుక్ వస్తుందని అధికారి ఒకరు వివరించారు. ప్రస్తుతం బ్యాంకు ఖాతాలకు వర్తిస్తున్న విధానమే దీనికి కూడా వర్తిస్తుందని తెలిపారు. బ్యాంకు పాస్‌బుక్‌లోని పేజీలన్నీ నిండిపోతే మరొకటి ఇచ్చినట్లుగానే పట్టాదారు పాస్‌బుక్‌కు కూడా ఇలాంటి విధానమే ఉంటుందని ఉదహరించారు. తొలుత ముద్రణకు 90 రోజుల సమయం పడుతుందని భావించినా, ప్రింటింగ్ రంగంలో వచ్చిన టెక్నాలజీ మార్పులను పరిగణనలోకి తీసుకుని నెల రోజుల్లోనే ముద్రించాలని టెండర్ సంస్థకు స్పష్టం చేయనున్నామని తెలిపారు. టెండర్లను ఖరారు చేసిన వెంటనే ముద్రణా పనులు ప్రారంభమవుతాయని, ప్రభుత్వం భావిస్తున్నట్లుగానే మార్చి 10వ తేదీకల్లా గ్రామాలకు పాస్‌బుక్‌లు చేరుతాయని వివరించారు. జిల్లా కేంద్రాలకు మార్చి తొలి వారంలోనే పాస్‌బుక్‌లను చేర్చే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, అందుకు తగినట్లుగానే గ్రామాలవారీగా రెవిన్యూ సిబ్బందికి పంపిణీ బాధ్యతలను అప్పగించనున్నామని తెలిపారు. లబ్ధిదారులందరికీ పాస్‌బుక్‌లను ముద్రించి పంపిణీ చేయడానికి నెల రోజుల సమయం సరిపోతుందని, ఆందోళన పడాల్సిన అవసరమే లేదని ఆ అధికారి వ్యాఖ్యానించారు. పాస్‌బుక్‌లోని భద్రతా ఫీచర్లు యధావిధిగా ఉంటాయని తెలిపారు. ప్రస్తుతానికి సాంకేతిక అంశాలపైనే ప్రీబిడ్డింగ్ సమావేశంలో చర్చ జరిగిందని, శుక్రవారంకల్లా ఆర్థిక సంబంధ అంశాలను కూడా చర్చించి ఈ నెలాఖరుకల్లా టెండర్ సంస్థను ఖరారు చేస్తామని తెలిపారు. దానికి అనుగుణంగానే 72 లక్షల కొత్త పాస్‌బుక్‌ల ముద్రణకు ఎంత ఖర్చవుతుందనేదానిపై స్పష్టత వస్తుందని వివరించారు.

కాంగ్రెస్ వచ్చాక ఉద్యోగులకు కార్పొరేట్ వైద్యం : ఉత్తమ్



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రభుత్వోద్యోగుల హెల్త్ కార్డులు పని చేయకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతి ఉద్యోగికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తామని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) రద్దు అయ్యేంత వరకు ఉద్యోగులు నిర్వహించే పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. గాంధీభవన్‌లో తెలంగాణ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్(టిఎస్‌టిఎఫ్) డైరీని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ విద్యారంగాన్ని కెసిఆర్ సర్వనాశనం చేశారన్నారు. కెజి టు పిజి ఉచిత విద్య హామీ ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ సర్కార్ విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. మూడున్నరేళ్ళలో ఒక్క డిఎస్‌సి కూడా వేయని అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. తెలంగాణ రావడంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా కెసిఆర్ మరిచిపోయారని, పండిట్ పోస్టల అప్ గ్రేడ్‌ను ప్రభుత్వం వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలను నింపకుండా జాప్యం చేస్తుండడంతో యువత నిరాశలో కూరుకుపోతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తామన్నారు.

భూసేకరణపై ఎన్ని నోటీసులు జారీ చేశారు? : ప్రశ్నించిన హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: భూసేకరణ వివరాలు అందజేయడంలో అశ్రద్ధ వహిస్తే భూసేకరణ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాల్సివస్తుందని తెలుగు రాష్ట్రాలను హైకోర్టు హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం వివరాలు పూర్తి ఇవ్వకపోడంపై మండిపడింది. ఏపీ ప్రభుత్వం వివరాలే ఇవ్వకపోడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. వివిధ ప్రాజెక్టులు, ఇతర అవసరాల కోసం ఎన్ని భూసేకరణ నోటీసులు జారీ చేశారో .. వాటిలో ఎన్ని కొత్త భూసేకరణ చట్టం కింద ఉన్నాయో.. ఎన్ని భూసేకరణ ఉత్తర్వులు అమలు చేశారో, ఇంకా ఎన్నింటిని అమలు చేయాలో తెలియజేయాలని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ/ఏపీ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. భూసేకరణపై కోర్టులు ఇస్తున్న ఉత్తర్వుల్ని కలెక్టర్లు సకాలంలో అమలు చేయకపోవడంతో పలువురు రైతులు అప్పీల్ దాఖలు చేయడంతో కోర్టుల్లో కేసుల పెరిగిపోతున్నాయని, కేసుల పెండింగ్, రైతులకు పరిహారం అందడంలో జాప్యం కూడా అవుతోందని పేర్కొంటూ మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.వెంకటకృష్ణయ్య రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా స్వీకరించి మంగళవారం విచారణ జరిపింది. తెలంగాణ సర్కార్ వివరాలు సాదాసీదాగా ఉన్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. ఆ వివరాల ప్రకారం రైతులకు రూ.500 కోట్ల వరకు చెల్లించాల్సివుందని, భూసేకరణ కొనసాగించడం ఎంత వరకు సబబని బెంచ్ ప్రశ్నించింది. ఏపీ సర్కార్ వివరాలేమీ లేకుండా వాయిదా కోరడం పరాకాష్ట అని బెంచ్ మండిపడింది. విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

పెరుగుతున్న ఐఎఎస్‌ల సంఖ్య

మన తెలంగాణ/హైదరాబాద్:రాష్ట్ర ప్రభుత్వానికి ఐఏఎస్ అధికారుల సంఖ్య పెరుగుతూ ఉంది. డిప్యూటీ కలెక్టర్లుగా ఉన్న పదిమంది రాష్ట్ర సర్వీసు అధికారులకు ఇటీవలనే ఐఏఎస్ పదోన్నతి లభించగా తొందరలోనే మరో పదిమందికి ఇదే తరహా పదోన్నతి లభించనుంది. ఇక డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానం ద్వారా రాష్ట్రానికి 11 మంది కేటాయింపు జరిగింది. ఈ విధంగా మొత్తం 31 మంది ఐఏఎస్ అధికారులు అదనంగా రాష్ట్రానికి లభించనున్నారు. తొలి జాబితాలోని పదిమందికీ ఐఏఎస్ పదోన్నతి కల్పిస్తూ డివోపిటి (సిబ్బంది శిక్షణా వ్యవహారాల విభాగం) సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేయగా, రెండవ విడతలో అర్హులైన సీనియర్ అధికారులకు ఐఏఎస్ పదోన్నతి లభించడం కోసం జాబితాను తయారుచేసే పనిలో రాష్ట్ర సిసిఎల్‌ఏ అధికారులు నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజుల్లో జాబితాను ఖరారు చేసి యుపిఎస్సికి పంపిస్తామని సాధారణ పరిపాలన శాఖ అధికారులు వ్యాఖ్యానించారు. రెండవ జాబితాలోని పదిమందిలో ఎనిమిది మంది రెవిన్యూ విభాగానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు రెవిన్యూయేతర అధికారులు.

మోత్కుపల్లిపై చర్యలు : రమణ

మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపిని టిఆర్‌ఎస్‌లో కలిపేయాలని అని మాట్లాడిన మోత్కుపల్లి నర్సింహులు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ అన్నారు. లేదంటే ఈ సంఘటనపై జాతీయ పార్టీకి నివేదిక పంపి, సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం నాలుగో బ్యాచ్ శిక్షణ తరగతులను రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఉండకూడదని టిఆర్‌ఎస్ ఎన్నో కుట్రలు చేస్తుందన్నారు.టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ టిఆర్‌ఎస్‌ది గడీల పాలన, దొరల పాలన అని మొన్నటి వరకు విమర్శించిన మోత్కుపల్లి ఇప్పుడు అదే పార్టీలో విలీనం చేయమని అనడం సమంజమా అని ప్రశ్నించారు. సూర్య చంద్రులు ఉన్నంత వరకు టిడిపి ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎపి మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఎన్‌టిఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు.



నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన చిత్రపటానికి టిఎఫ్‌టియు అధ్యక్షులు, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ క్రాంతిమంచ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కాచం సత్య నారాయణ గుప్త పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిఎఫ్‌టియు నాయకులు ఎం.డి ఖలీల్, నంగునూరి రమేష్, కందేరామ్ నరేష్, కంది అనంత్‌రెడ్డి, సముద్రాల నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

Dwaraka



“నిజం ఒక ఆయుధం. దానిని ఉపయోగించాల్సిన సమయంలో తడబడితే మనల్నే వధిస్తుంది.
– సుభాష్ చంద్రబోస్”

‘మీరు 1 శాతం – మేము 99 శాతం’

సంపాదకీయం

ఈనినాదం కొద్ది సంవత్సరాల క్రితం అత్యంత సంపన్నదేశమైన అమెరికాలో మార్మోగింది. నిరసన ప్రదర్శకులు నెలలల తరబడి వాల్ స్ట్రీట్ వీధుల్ని దిగ్బంధించారు. అమెరికాలో పెరిగిన ఆర్థిక అసమానతలను ఆ ఆందోళన ప్రపంచం దృష్టికి తెచ్చింది. ఇప్పుడు భారత్‌లో ఆర్థిక అసమానతలు ఆ దిశలో ఉన్నట్లు ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశంలో భారతదేశ ఆర్థిక సంస్కరణల గమనాన్ని, ఫలితాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందుంచి, పెట్టుబడులకు తమదేశం ఎంతటి స్వర్గధామమో వివరించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సిద్ధమవుతుండగా, ఒకరోజు ముందు ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదలైంది. ప్రతిఏటా ప్రపంచ ఆర్థిక ఫోరం సమారోహానికి(దావోస్)ముందు ఈ నివేదిక విడుదలవుతుంది. ప్రపంచ దేశాల్లో ఆర్థిక పోకడలపై తమ సర్వే ఫలితాలను అది పొందుపరుస్తుంది. అది అక్కడ చర్చలకు ప్రాతిపదిక కూడా. భారతదేశంలో 2017లో సృష్టించబడిన సంపదలో 73 శాతం 125కోట్ల భారతీయుల్లోని 1శాతం సొంతమైంది. కాగా పేదరికంలో ఉన్న 67 కోట్ల భారతీయుల ఆదాయం కేవలం 1శాతమే పెరిగింది. 1శాతం సంపన్నుల పెరిగిన సంపద రూ.20,913లక్షల కోట్లు. ఇది భారత ప్రభుత్వ గత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో సమానం అని ఆ నివేదిక పేర్కొన్నది. ఇది ప్రపంచంలోనే అతి ఎక్కువ అసమానత.

మన దేశంలో ఆర్థిక అసమానతలు ఆదినుంచీ ఉన్నవే. కాని 1990వ దశకంలో నయా ఉదార ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తదుపరి ఆ అసమానత వృద్ధి వేగవంతమైంది. జిడిపి వృద్ధి గురించి ప్రభుత్వాలు గొప్పలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతుండగా, ఆ వృద్ధి ఫలితం కార్పొరేట్‌ల పరమైంది.1991–92లో ఫోర్బ్స్ బిలియనీర్ల వార్షిక జాబితాలో భారతీయులు లేరు. ఇప్పుడు 100మందికి పైగా ఉన్నారు. ‘‘ఈ సంవత్సరం (2017) బిలియనీర్ల సంఖ్య ప్రతి రెండు రోజులకు ఒకరు చొప్పున పెరిగింది. బిలియనీర్ల సంపద 2010 నుంచి ఏటా 13శాతం చొప్పున పెరుగుతున్నది. కాని సామాన్య కార్మికుల వేతనంలో పెరుగుదల సాంవత్సరిక సగటు 2 శాతం మాత్రమే’’ అని నివేదిక పేర్కొన్నది. క్రితం సంవత్సర సర్వే ప్రకారం, దేశ సంపదలో 58శాతం అతి సంపన్నుల చేతిలోకి వెళ్లింది. అది ప్రపంచ సగటు 50శాతం కన్నా ఎక్కువ. కాగా 2017లో అది 73 శాతాన్ని చేరుకుంది. ఇదే ప్రపంచవ్యాప్త పరిస్థితి అని మనం సమాధానపడాల్సిందే. గత సంవత్సరం ప్రపంచ దేశాల్లో ఉత్పత్తి అయిన సంపదలో 82శాతం 1శాతం మంది మహా కోటీశ్వరులకు దక్కింది. కాగా పేదరికంలో ఉన్న 370కోట్లమంది ఆదాయం ఏ మాత్రం పెరగలేదు.

సమ్మిళిత వృద్ధి గూర్చి రెండు దశాబ్దాల పైబడి పాలకులు ఊదరగొడుతున్నారు. అయినా ప్రాదుర్భావ ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం స్థానం 62 అని ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సూచిక వెల్లడించింది. అంతకుముందు సంవత్సరంలోని 60శాతం నుంచి దిగజారింది. ఇందులో చైనా స్థానం 26 కాగా మన ఇరుగుపొరుగు దేశాల స్థానం – పాకిస్థాన్ 52 , శ్రీలంక 40, బంగ్లాదేశ్ 34, నేపాల్ 22. ‘‘జీవన ప్రమాణాలు, పర్యావరణ మనుగడ, మరింత రుణభారం నుంచి భావితరాల రక్షణ’’ అనే మూడు అంశాలు ఈ నివేదికకు ప్రాతిపదిక. మొత్తం 103 దేశాల ఆర్థిక వ్యవస్థలను అది సమీక్షించింది.

వచ్చే సంవత్సరం, ఆ పై సంవత్సరాల్లో భారత జిడిపి వృద్ధిరేటు 7శాతం పైగా ఉంటుందని ఐఎంఎఫ్, మరికొన్ని రేటింగ్ సంస్థలు వ్యక్తం చేస్తున్న అంచనాలను ప్రచారానికి వాడుకుంటూ, మోడీ ప్రభుత్వం ఎన్నో గొప్ప విజయాలు సాధించామని ప్రచారం చేసుకుంటోంది. కాని సంపద పునఃపంపిణీలో అది ఘోరంగా విఫలమైనట్లు ఈ నివేదికలు తెలియచేస్తున్నాయి. ఆర్థిక సాఫలత్యకు కొలబద్దగా జిడిపిపై ఆధారపడే నమూనా స్వల్పకాలికతను, అసమానతను పెంచుతుందన్న ఆర్థికఫోరం నివేదిక, సమ్మిళిత వృద్ధి, అభివృద్ధి కొరకు కొత్త నమూనాకు అత్యవసరంగా మరలాలని సూచించింది. స్థూల స్కోర్ తక్కువగా ఉన్నా వేగంగా పురోభివృద్ధి చెందుతున్న 10 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా పేర్కొన్నది. కాబట్టి మోడీ ప్రభుత్వం, ఆయన ఆర్థిక సలహాదారులు అభివృద్ధి పంథా గూర్చి పునరాలోచిస్తారా?

ట్రంప్‌పై శ్రామిక ప్రతిఘటన!

చూపు

అమెరికాలో ఈ ఏడాది జరగనున్న ఎన్నికల్లో విజేతలుగా నిలవాలని కార్మిక ఉద్యమ సంస్థలు నిర్ణయించుకున్నాయి. హూస్టన్‌లో గత వారం జరిపిన సమావేశంలో ఈ నిశ్చయం బలంగా వ్యక్తమయింది. ఎఎఫ్ఎల్ – సిఐఒ(స్వేచ్ఛకోసం ఉద్యమిస్తున్న మహిళల వేదిక) మార్టిన్ లూథర్ కింగ్ పేరిట జరిగిన మహా సభ అది. ట్రంప్ పాలనా యంత్రాంగం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయడం కోసం మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వ అన్ని స్థాయిలలో ఎన్నికలు గెలవాలని కార్మిక సంఘాల నేతలు 2018 సంవత్సరానికి వ్యూహాలు పన్నుతున్నారు. ఇది ఎన్నికల ఏడాది కావడంతో వారు అనేక సమావేశాలు జరుపుతున్నారు. ఈ నెల 14న జరిగిన ఒక సదస్సులో ఎన్నికల ద్వారా భర్తీ అయ్యే అధికార హోదాల్లోకి ప్రవేశించాల్సిందిగా మహిళలను కార్మిక నేతలు కోరారు. అలా ఎన్నికవడానికి మౌలిక సూత్రాలను సయితం సూచించారు. ఎన్నికల ప్రచారాలకు, సదస్సుల నిర్వహణకు వ్యూహాలను రచించడంలో మరో బృందం మునిగిపోయింది.

రానున్న ఎన్నికలలో మహిళలు విరివిగా పాల్గొనాలని ఇద్దరు ప్రముఖ మహిళా కార్మిక నేతలు పిలుపునిచ్చారు. థెరెసా మస్కెడా అనే మహిళ సియాటెల్ సిటీ కౌన్సిల్ సీటుకు ప్రతినిధిగా ఉన్నారు. మరో మహిళ కాలిఫోర్నియా స్టేట్ సెనేట్ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. చాలా కాలంగా తమకు ప్రాతినిథ్యం లేకుండా ఉందని, ఎన్నికల్లో పోటీ చేయక తమకు ఇప్పుడు గత్యంతరం లేదని వాషింగ్టన్ స్టేట్ కార్మిక సమాఖ్య మాజీ రాజకీయ డైరెక్టర్ కూడా అయిన మాస్కెడా అన్నారు. రియల్ ఎస్టేట్ మొగుల్ ట్రంప్ అధ్యక్ష భవనాన్ని ఆక్రమించినప్పటి నుంచి కార్మిక నేతలు, మహిళా నాయకులు, మైనారిటీలు హక్కులు కోల్పోతుండడంతో వాటి రక్షణ కోసం బాహాటంగా బయటకు వస్తున్నారు. ట్రంప్‌తోపాటు ఆయన రిపబ్లికన్ సహచరుల నుంచి కూడా తమ హక్కులకు భంగం కలుగుతున్నట్లు వారు భావిస్తున్నారు. రాజకీయ వాదులను తమ గుప్పెట్లో ఉంచుకునే ఒక్క శాతం కార్పొరేట్ సంస్థల నుంచి కూడా ప్రమాదం ఉన్నట్లు వారు ఆందోళన చెందుతున్నారు.

వాషింగ్టన్‌లో ట్రంప్ అధ్యక్ష పదవీ స్వీకారం రోజున మహిళల భారీ యాత్ర జరిగినప్పటి నుంచి ఎన్నికల్లో పోటీకి సానుకూలత వ్యక్త చేస్తూ 26,000మంది మహిళల నుంచి తమకు కాల్స్ వచ్చినట్లు మహిళా కార్మిక నేతలు తెలిపారు. వారిలో 2400మందికి తాము శిక్షణ ఇచ్చామని కూడా వారు తెలిపారు. కార్మిక మహిళలు కూడా ఎన్నికలలో పోటీకి ముందుకు వస్తున్నారని తెలిపారు. వాషింగ్టన్ రాష్ట్రంలో 30 మంది మహిళలు ఎఎఫ్ఎల్ – సిఐఒ రాజకీయ ప్రచార శిక్షణను పొందారు. గత ఎన్నికల్లో 12 మంది గెలుపొందారు. వారిలో సగం మంది మైనారిటీలు. రాజకీయ చర్చలలో పురుష ప్రతినిధులు మహిళల వాణిని అణగద్రొక్కే సాంప్రదాయాన్ని తరిమి వేయాలని సమావేశాల్లో వక్తలు పిలుపునిస్తున్నారు. ఆ ఆనవాయితీలను మహిళలు అధిగమించాలంటే రాజకీయ చర్చల్లోకి తమ అంశాలను తీసుకు రావాలని, కార్యాచరణకు పట్టుపట్టాలని హక్కుల కార్యకర్తలు పిలుపునిస్తున్నారు. మహిళలకు వేతనాలతో కూడిన కుటుంబ సెలవులు, బిడ్డల పెంపకం సెలవులు, సమాన పనికి సమాన వేతనం వంటి హక్కుల కోసం పోరాడాలని సియాటెల్ సిటీ కౌన్సిల్ ప్రతినిధి మస్కెడా మహిళా బృందాలకు సూచిస్తున్నారు. మహిళలు పైన పేర్కొన్న తమ డిమాండ్లతో వీధులకెక్కారు. విమానాశ్రయాల వద్ద ప్రదర్శనలు జరిపారు.



వేలాదిమంది మహిళలు ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసన గళం విప్పారు. ముఖ్యంగా ట్రంప్ ‘ట్రావెల్ బ్యాన్’ ను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రదర్శనలు జరిపారు. ఇతర మహిళా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చర్యలపట్ల కూడా తమ నిరసనను ప్రదర్శించారు.ఉద్యమంలోకి నియామకాల రిక్రూట్‌మెంట్లు, కార్యక్రమాల నిర్వహణ, వ్యూహ రచనపై విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

కార్మిక శక్తిగా ఎదగడానికి సంఘాలను ఏర్పరిచే దిశగా శిక్షణ అందిస్తున్నట్లు కూడా మస్కెడా తెలిపారు. అధికార హోదాలకు పోటీ చేయడమే సరియైన ప్రతిఘటన అని ఆమె పేర్కొన్నారు. సియాటెల్ నగరంలో ‘స్థానిక కార్మిక హక్కుల ఆర్డినెన్స్‌ను మస్కెడా ప్రతిపాదించారు. తర్వాత ఆర్డినెన్స్ స్థానే బిల్లును కూడా ఆమె రూపొందించారు. సమాజంపై సంపన్నుల పట్టుకు వ్యతిరేకంగా ఆమె పోరాటం సాగిస్తున్నారు. వారిని ఎన్నికల్లో మట్టికరిపించి కింది స్థాయి నుంచి మెరుగైన సమాజాన్ని నిర్మించడమే డ్యూరజో అనే మరో మహిళా కార్మిక నేత లక్ష్యం. ఆమె ‘ఎల్.ఎ ఫెడ్’ సారథ్యాన్ని చేపట్టినప్పుడు దాని సభ్యులు చాలా మంది, ముఖ్యంగా డెమొక్రాట్లు, పట్టించుకోలేదు.

ఆ సమాఖ్య సభ్యులు చాలా మంది వలస వచ్చిన వారని, పేదలు కాబట్టి ఏమీ సాధించలేరని చాలామంది సభ్యులు పెదిమ విరిచారు. వారికి ఓటు హక్కు కూడా లేదని ఎగతాళి చేశారు. అందుకే వారి ఓటుహక్కు కోసం ఆ సమాఖ్య పోరాడవలసి వచ్చింది. అయితే ఆక్షేపాలను అధిగమించి సమాఖ్య సమస్యలపై అవగాహనను పెంచింది. గంటకు 15 డాలర్ల వేతనం కోసం పోరాడింది. ‘అమెరికా సర్వసమానత్వ సూత్రంపై నెలకొల్పబడింది. 2018లో కూడా మహిళలు, ఎల్‌జిబిటిలు, మైనారిటీల హక్కుల అణచివేత సాగుతోంది’ అని హూస్టన్ డిస్ట్రిక్ట్ అటార్నీ కిమ్ ఓగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమె కిందటి ఎన్నికల్లో చాలాకాలంగా పదవిలో ఉన్న రిపబ్లికన్‌సభ్యుని ఓడించి ఆ పదవికి ఎన్నికయ్యారు. కార్మికులకు ముఖ్యమైన అంశాల గురించి రాష్ట్ర స్థాయిలో విస్తృతంగా సమావేశాలు జరుపుతూ అవగాహన కల్పిస్తున్నామని ఆమె చెప్పారు. సమాన న్యాయం కోసం అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో ఇటీవల మహిళలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు.

విలువలు కాపాడుకుంటూ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా సమాన పనికి సమాన వేతనం డిమాండ్‌పై ఉమ్మడిగా సంప్రదింపులు జరిపే హక్కు కోసం తాము పోరాడుతున్నామని తెలిపారు. తమ హక్కుల సాధన కోసం అధికార హోదాల్లోకి ప్రవేశించాలని అమెరికా కార్మిక లోకం, మహిళా లోకం కోరుకుంటూ అందుకు ఉద్యమ స్ఫూర్తిని పెంచుకోవడం వినూత్న పోకడను సూచిస్తోంది. ఇంతవరకు అమెరికా సమాజంలో హక్కుల కోసం ప్రభుత్వంపై ప్రతిఘటన చర్యలు అంతంత మాత్రంగా ఉండేవి. తక్కిన ప్రజాస్వామ్య దేశాల్లో ఉన్నంతగా ఉద్యమ స్ఫూర్తి అమెరికా సమాజంలో లేదు. ఇటీవల అనేక నిరసన ఉద్యమాలు తలెత్తినా గమ్యం చేరకముందే చల్లారిపోయాయి. అయితే ట్రంప్ పుణ్యమా అని అమెరికా సమాజంలో హక్కుల పోరాట స్ఫూర్తి వివిధ వర్గాల్లో పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామం.

✻ మార్క్ గ్రుయెన్‌బెర్గ్

రైతు పోరాటాలు, ఉపశమనాలు



బి.నర్సన్
9440128169

కడుపునిండా జొన్న అంబలి తాగి, పెరట్లో పెరిగిన పొగాకు చుట్ట దమ్ము లాగుతూ నేనెవడికి మోతాదు అన్నట్లు వ్యవసాయం పనుల్లో నిమగ్నమై బతికే రైతు మెడకు ఉరితాడు, చేతికి పురుగులమందు డబ్బా రావడంలో స్వయంకృతం లేనేలేదు. అధిగ దిగుబడులు, వాణిజ్యపంటలు అంటూ రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాలవైపు వారిని మళ్ళించింది ప్రభుత్వ స్వార్థపు ఆలోచనలే.

రైతును సుడిగుండంలోకి నెట్టి కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు అన్ని ప్రభుత్వాలు నటిస్తున్నాయి. ఎన్నికలొచ్చినప్పుడల్లా, రాబోయే ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొని రైతుల ఓట్లను లాగేసుకోడానికి పథకాల పాశాల్ని విసురుతున్నాయి. సుమారు 40ఏళ్ళ నుండి రైతు రుణాల మాఫీ, వడ్డీ రాయితీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా ఎన్ని మలాములు పూసినా రైతుకు పట్టిన చీడ వదలడం లేదు.

గత కొన్నేళ్ళు వర్షాలు సరిగా లేక రైతు పడుతున్న కష్టాలను ప్రకృతిపైకి నెట్టిన పాలకులు ఈ సంవత్సరం పండిన పంటకు గిట్టుబాటు ధరను అందించలేకపోయారు. పంటలు పండక పోవడమే తమ నష్టాలకు కారణమనుకున్న రైతుకు పండిన పంటకు లాభదాయకధర రాకపోవడంతో కొత్త గండం ఎదురైంది. ఇంతకాలం ప్రభుత్వాల ముందు దేహీ అని ఎదురు చూసి రైతులు పోయినేడు ఎన్నో ఆందోళనలను చేపట్టారు. రైతు కుటుంబాలకు చెందిన చదువుకున్న యువత ఉద్యోగాలు దొరకక వ్యవసాయం వైపు దృష్టి పెట్టారు. తమ పెద్దల తీరు కాకుండా వారు సంఘటితమై సమస్యల సాధనకోసం రోడ్లెక్కుతున్నారు. పోయినేడు వివిధ రాష్ట్రాల్లో ఎగిసిపడిన రైతుల ఆందోళనల్లో పాల్గొన్న వారిలో అధికులు 40ఏళ్లలోపు వాళ్లే. 2017లో చాలా ప్రభుత్వాలు రైతు ఆందోళనలు ఎదుర్కొన్నాయి. రాష్ట్రప్రభుత్వాల మెడలు వంచి తమ కష్టాలకు కొంతైనా పరిష్కారాలను సాధించుకున్నారనవచ్చు. నామమాత్రంగా ఉన్న రైతు సంఘాలు ఇప్పుడు ఉద్యమాలకు సారథ్యం వహిస్తున్నాయి. మద్దతు ధరల కోసం రైతులు ఉద్యమించడంతో ప్రభుత్వాల వద్ద సమాధానం లేకుండా పోయింది. రైతుకు వినియోగదారునికి మధ్యనున్న దళారీ వ్యవస్థను నియంత్రించే శక్తి వచ్చే దాకా ప్రభుత్వాలకు తిప్పలు తప్పవు. పడిపోయిన ధరలకు నిరసనగా పోయిన సంవత్సరం టమాటాలు, ఉల్లిగడ్డలు, బంగాళదుంపలు, పాలు రోడ్లపై పారబోసి రైతులు దుఃఖభరిత నిరసనను తెలిపారు. ఈ సమస్యనుండి రైతులు బయటపడే మార్గాల్ని మాత్రం ప్రభుత్వాలు వెతకడం లేదు. రుణమాఫీలు, వడ్డీ రాయితీలు, పంటబీమా లాంటి పథకాలు ఈ రుగ్మతకు మందేయలేవు. పాత పథకాలను పక్కనపెట్టి ప్రకటిత కనీస మద్దతు ధరతో ప్రతిగింజను ప్రభుత్వాలు కొనుగోలు చేయడమే పరిష్కారమనవచ్చు. కేంద్రం, రాష్ట్రం ఈ బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టివేసుకోకుండా రైతులను ఆదుకోవాలి.

ఏప్రిల్ 2017 ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నెలకుపైగా వినూత్న నిరసనలు తెలిపిన తమిళ రైతుల సమస్య మాధ్యమాల్లో చాలా ప్రచారం పొందింది గాని కేంద్రం ఉత్తుత్తి హామీలకే పరిమితమైంది. మద్రాసు హైకోర్టు చొరవ తీసుకుని కో ఆపరేటివ్ బ్యాంకుల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయమని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీని వల్ల రాష్ట్రంలోని 20లక్షల మంది రైతులకు మేలు జరిగింది.

ఎన్నికల హామీగా ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రకటించిన రైతురుణ మాఫీ అక్కడి రైతులకు కొంత ఉపశమనాన్ని ఇచ్చింది. రూ.36,000కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం మోయక తప్పలేదు. ఈ హామీ భారతీయ జనతాపార్టీ ఏలుతున్న రాష్ట్రాల్లో కొంత ముసలాన్ని పుట్టించింది.

జనవరి 2017లో పంజాబు రైతులు గిట్టుబాటు ధర దక్కక ఆలుగడ్డలను రోడ్లపై పోశారు. దోబా ప్రాంతంలోని రైతులు కర్తార్‌పూర్ రహదారిపై 15వాహనాల్లో 500 క్వింటాళ్ల బంగాళదుంపలను దొర్లించారు. జలంధర్–అమృతసర్ మధ్యనున్న జాతీయ రహదారి ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు వీరి కష్టాలను కొంత ఒడ్డెక్కించాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి అమరేందర్‌సింగ్ అప్పుల మాఫీని ప్రకటించారు. అయితే ఇక్కడ కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మాదిరే విడతలవారీ చెల్లింపుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. రైతుల చిట్టా సేకరణ, అప్పుల వివరాలు, అధికారుల పరిశీలన పేరిట తీవ్ర జాప్యం జరిగి ఈ ఏడు జనవరిలో రూ.170కోట్లు విడుదల అయ్యాయి. రాష్ట్రంలో 5.63లక్షల రైతులుంటే ఈ తొలి విడతలో 683 కో ఆపరేటివ్ సొసైటీల్లోని 46,000 మంది రైతులకు లబ్ది జరిగింది.

జూన్ 2017లో మహారాష్ట్ర రైతులు గిట్టుబాటు ధర కోసం, కరువు, నీటి ఎద్దడి నివారణకోసం ఆందోళన చేపట్టారు. ముంబయికి పళ్లు, కూరగాయలు, పాలు అందకుండా నాగపూర్ ప్రాంతంలో రైతులు వాటిని రోడ్లపై పారవేశారు. ఆ దెబ్బకు దిగివచ్చిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రైతుల ఆగ్రహంపై పథకాల నీళ్లు చల్లక తప్పలేదు. బ్యాంకులనుండి లక్షన్నర దాకా అప్పు తీసుకున్న 89లక్షలమంది రైతులకు రూ. 34020కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని ఆయన ప్రకటించారు.

కర్నాటకలో 30జిల్లాలలోని 20జిల్లాల్లో 2017లో తగిన వర్షపాతం లేక వ్యవసాయం దెబ్బతిన్నది. రాష్ట్ర బిజెపి నాయకుల ఒత్తిడిని తట్టుకోలేని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య యాభైవేల వంతున కో ఆపరేటివ్ బ్యాంకు అప్పును మాఫీ చేశారు. దీనిద్వారా రాష్ట్రంలోని 22లక్షలమంది రైతుల రుణం రూ.8165కోట్లు సర్కారుపై పడింది.

రాజస్థాన్‌లో పోయిన సెప్టెంబర్‌లో 13రోజులపాటు రైతుల ఆందోళన కొనసాగింది. బికనీర్, శ్రీ గంగానగర్ ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించింది. ప్రభుత్వం దిగి వచ్చి రూ.20,000కోట్ల రైతు అప్పును రద్దు చేసింది. అరవై ఏళ్ళు పైబడిన వ్యవసాయదారులకు నెలకు రూ.2000/– ఫించను ఇచ్చే ఆలోచన కూడా ఉందని ఆ ప్రభుత్వం ప్రకటించింది.

గత ఏడాది జూన్‌లో మధ్యప్రదేశ్‌లో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మాల్వా, నిమాడ్ ప్రాంతంలోని 15 జిల్లాల్లో రైతులు ఇందులో పాల్గొన్నారు. జూన్ 6న మందసౌర్‌లో జరిగిన పోలీసు కాల్పుల్లో అయిదుగురు రైతులు మరణించారు. సమృద్ధిగా వచ్చిన ఉల్లి పంటకు తగిన ధర రాకపోవడమే ఈ ఆందోళనకు కారణం. కిలోకు రూపాయినుండి రెండు రూపాయల ధర ఇవ్వడానికి వ్యాపారులు సిద్ధపడడంతో ఉల్లి సంచులను రోడ్లపై కుమ్మరించారు. చివరకు ప్రభుత్వం కిలో రూ.8/–లకు సేకరించేందుకు ముందుకొచ్చింది. రైతుల మరణాలతో పెచ్చరిల్లిన హింసను కట్టడి చేయడానికి ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భోపాల్‌లో జూన్ 11న నిరాహారదీక్ష చేపట్టారు. అల్లర్లు తగ్గుమొగం పట్టడంతో కేంద్రప్రభుత్వం హామీ మేరకు తాను దీక్ష విరమిస్తున్నానని శివరాజ్ ప్రకటించారు.

అక్టోబర్ 2017లో మధ్యప్రదేశ్ ప్రకటించిన భవంతర్ భుగ్‌తాన్ యోజనను కొత్త పథకంగా పరిగణించాలి. మద్దతు ధరకు మార్కెట్ ధరకున్న వ్యత్యాసపు సొమ్మును ప్రభుత్వం రైతులకు పరిహారంగా చెల్లించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మార్కెట్ ధరకు దినుసును అమ్మినట్లు రశీదును చూయిస్తే మద్దతు ధరకు సమానంగా మిగిలిన సొమ్ము రైతుకు అందుతుంది. ఈ సదుపాయం కోసం రైతులు తమ వివరాలతో పేర్లను ప్రభుత్వ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. దీనికి ఆన్‌లైన్ సదుపాయం కూడా ఉంది. మధ్యప్రదేశ్‌లో గత ఖరీఫ్‌లో కందులు, మినుములు విరివిగా పండాయి. అయితే మార్కెట్ ధర 2016 కన్నా సగం పడిపోయింది. ఈ కొత్త పథకం రైతులను ఆదుకుంది అనవచ్చు. అక్టోబర్‌లో మొదలైన ఈ యోజన ద్వారా ఇప్పటి వరకు 16లక్షలమంది రైతులకు రూ.64కోట్ల లబ్ది జరిగింది.

తెలంగాణ ప్రభుత్వం మే 2018 నుండి ఎకరానికి పంటకు రూ.400 ఇవ్వడానికి సిద్ధమౌతున్నది. పంట తీయకున్నా భూమి ఉన్న రైతుకు ఆ ఆర్థిక సహాయం అందించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు వార్తల్లో వచ్చింది. ఆర్థికంగా స్వయం సమృద్ధి ఉన్న రైతులు ఈ ప్రయోజనాన్ని త్యాగం చేయాలని పిలుపు నియ్యాలనే ఆలోచన కూడా ప్రభుత్వం వద్ద ఉంది. ఈ చెల్లింపులు చెక్కుల ద్వారా సాగాలని మెజారిటీ రైతులు కోరుతున్నారని ఈ మధ్య ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని 55 లక్షల మంది రైతులు ఆ పెట్టుబడి సహాయాన్ని పొందుతున్నా కౌలు రైతుల ఊసు ఇంతవరకూ లేదు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యత్యాసం చెల్లింపులో పంటతీసిన రైతుయే లబ్ది పొందుతాడు. వ్యాపారి వద్ద పంట దిగుబడిని అమ్మినవాడే వ్యవసాయదారుడుగా గుర్తింపు పొందుతాడు. బ్యాంకు రుణాలు తీసుకొని పంట తీయకున్నా ప్రభుత్వ రైతు రుణమాఫీలో లబ్ది దొరుకు తున్నది. కౌలు రైతుకు ఏ ప్రభుత్వ సహాయం అందేమార్గం ఇంతవరకూ లేదు. భవంతర్ భుగతాన్ యోజన ఈ విషయంలో కొంత శాస్త్రీయత కలిగి ఉంది.

అయితే దేశవ్యాప్తంగా రైతులుగాని, రైతు నాయకులుగాని ముక్తకంఠంతో డా॥స్వామినాథన్ సిఫారసులను అమలు చేయమని కోరుతున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోడీ దీనిపై హామీ ఇచ్చారు. రైతు పెట్టుబడిపై 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని డా॥స్వామినాథన్ నివేదికలో ఉంది. భూ యజమానికి కాకుండా పంట తీసిన రైతుకు ఈ ధర లభిస్తే చాలావరకు సమస్య తీరుతుంది.

శాశ్వత పరిష్కారం లేకుండా కేవలం ఓట్ల కోసం పథకాలు రచిస్తే ముందుముందు మరిన్ని రైతు ఆందోళనలను ఎదుర్కోక తప్పదు.


ఎడిటర్‌కు లేఖ

రాచకొండ వారోత్సవాలు నిర్వహించాలి

హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో సంస్థాన్ నారాయణ పురం మండలంలో ఉన్న రాచకొండ గుట్టలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. చరిత్ర పుటల్లోకి తొంగిచూస్తే రాచకొండకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. యాంత్రిక జీవనానికి, కాలుష్యానికి దూరంగా విశ్రాంతిగా గడపాలనుకునే వారికి చక్కటి విడిది రాచకొండ. చుట్టూ ఉన్న గుట్టల మధ్య నుంచి ప్రయాణిస్తే ఎదురుగా ఇక్కడి ప్రకృతి సౌందర్యం ఆహ్లాదం కలిగిస్తుంది. కొండలపై నుంచి జాలువారే చిన్నచిన్న జలపాతాలు, సెలయేర్లు, కోనేర్లు కనువిందు చేస్తాయి. హరితవర్ణాన్ని కప్పుకున్న కొండలు, పక్షులు కిలకిలరాగాలు, వన్యప్రాణుల అరుపులు ఆనంద డోలికల్లో ముంచెత్తుతాయి. గత చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన రాచకొండ కోట ముఖద్వారం స్వాగతం పలుకుతుంది. గత చరిత్రలోకి మనల్ని లాక్కెల్తుంది. బలిష్టమైన బండరాళ్లతో శత్రుదుర్భేద్యంగా నిర్మించిన ప్రాకారాలు ఆనాటి రక్షణ వ్యవస్థను మనకళ్ల ముందుంచుతాయి. 600 అడుగుల ఎత్తయిన ఆ కొండపైన రాచకొండ నేలిన రేచర్ల పద్మనాయక ప్రభువులు కొలువుదీరే వారట. ఆ కొండ చుట్టు దుర్భేధ్యమైన, బలిష్టమైన ప్రాకారం మధ్యమధ్యన ఎత్తయిన బురుజులు వాటిపై పేల్చడానికి సిద్ధంగా ఉన్న ఫిరంగుల అమరికలు కన్పిస్తాయి. ఆరు సింహద్వారాలు దాటితే కొండపైకి చేరవచ్చు. ఈ కొండపైనే మండపాలు, రాజప్రాసాదాలు, తటాకాలు, జలాశయాలు కన్పిస్తాయి. రెండు పెద్ద బండరాళ్ల చీలిక మధ్య సంకెళ్లబావి ఉంది. అందులో అన్ని కాలాల్లో నీళ్లు ఉండడం విశేషం. కాకతీయ రాజ్యపతనానంతరం రేచర్ల పద్మనాయకుల పాలన రాచకొండ కేంద్రంగా సుమారు 110ఏళ్లు కొనసాగింది. వారు 1361 లో ఆమనగల్లు నుంచి రాజధానిని రాచకొండకు మార్చారు. నేటి తెలంగాణ అంతటికీ తమ రాజ్యాన్ని విస్తరించారు. రేచర్ల పద్మనాయకుల వంశీయులైన ఆనపోత నాయుడు 1361 నుంచి 1384 వరకు రాచకొండను పాలించాడు. అతని కాలంలోనే ఈ దుర్గాన్ని శత్రువుకు అలవికాని విధంగా నిర్మించాడు. కొంతకాలం తర్వాత బహుమని సుల్తానుల దాడికి రాచకొండ రాజ్యం పతనమైంది. నేటికి ఆనాటి రాచరిక అవశేషాలు, విధ్వంసపు చిహ్నాలు రాచకొండను దర్శించే పర్యాటకులను కనువిందు చేస్తాయి. రాచకొండ ప్రాంతాన్ని గత ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మన ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా తానే రాచకొండ ప్రాంతాన్ని సందర్శించి కనుమరుగవుతున్న రాచకొండ చరిత్రకు పూర్వవైభవం తీసుకురావాలని సంకల్పించారు.

రాచకొండ పోలీసు ప్రాంతాన్ని నిత్యం ప్రజలందరు స్మరించుకునే విధంగా భారతదేశంలోనే అత్యంత పెద్ద కమిషనరేట్‌ను ఏర్పాటు చేసి దానికి రాచకొండ కమిషనరేట్‌గా నామకరణం చేశారు కెసిఆర్. అంతరించి పోతుందని అనుకుంటున్న సందర్భంలో ప్రపంచ దేశాలకు తెలిసే విధంగా కృషి చేస్తున్నారు. దీనికి తోడు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీసుల సేవలు అభినందనీయం. తెలంగాణ రాష్ట్రంలోని రాచకొండ కమిషనరేట్ కమిషనర్‌కి అమెరికాలాంటి గొప్ప దేశాలు హీరో అవార్డును ప్రదానం చేయడం ద్వారా రాచకొండ పేరు మారుమోగుతుంది. అయితే రాచకొండ చరిత్రను ఇప్పటి విద్యార్థులకు, యువతకు రాష్ట్ర ప్రజలందరికీ తెలియచేసేందుకు ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కృషితో ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2017లో 3లక్షల రూపాయలతో ‘రాచకొడ వారోత్సవాలు’ వారం రోజులపాటు నిర్వహించారు. స్థానిక ‘రాచప్ప’ స్వచ్ఛంధ సంస్థ పూర్తిగా సహకరించింది. రాచకొండ ప్రాంత విశిష్టతను, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, 150పై చిలుకు దేవాలయాలు, నిత్యం వందల సంఖ్యలో భక్తులు దర్శించుకునే శివాలయం, ప్రతి ఏటా శివరాత్రికి జరిగే గాలిసాబ్ ఉర్స్ ఉత్సవాలు, ఇలా రాచకొండ ప్రాంత చరిత్రను తెలియచేసేందుకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ‘అక్టోబర్–నవంబర్ మాసంలో చెట్లు, గుట్టలు పచ్చగా ఉండే సందర్భంలో 1కోటి రూపాయలతో ‘రాచకొండ వారోత్సవాలను’ పది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించాలి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానికులను భాగస్వామ్యం చేస్తూ అధికారికంగా ‘కమిటీని వేసి’ రాచకొండ వారోత్సవాలు నిర్వహించాలని, ఈ ప్రాంత గిరిజనుల, సంస్థాన్ నారాయణ పురం మండల ప్రకృతి ప్రియుల కోరిక.

– గుండమల్ల సతీష్‌కుమార్ , 9493155522



బలిష్టమైన బండరాళ్లతో శత్రుదుర్భేద్యంగా నిర్మించిన ప్రాకారాలు ఆనాటి రక్షణ వ్యవస్థను మనకళ్ల ముందుంచుతాయి. 600 అడుగుల ఎత్తయిన ఆ కొండపైన రాచకొండ నేలిన రేచర్ల పద్మనాయక ప్రభువులు కొలువుదీరే వారట. ఆ కొండ చుట్టు దుర్భేధ్యమైన, బలిష్టమైన ప్రాకారం మధ్యమధ్యన ఎత్తయిన బురుజులు వాటిపై పేల్చడానికి సిద్ధంగా ఉన్న ఫిరంగుల అమరికలు కన్పిస్తాయి. ఆరు సింహద్వారాలు దాటితే కొండపైకి చేరవచ్చు.

మన తెలంగాణ
పల్స్
5
హైదరాబాద్
బుధవారం
24 జనవరి, 2018
www.manatelangana.news



నిర్లక్ష్యం పడగనీడలో శతాబ్దాల తరబడి పీడిస్తున్న క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే ప్రాణాంతకం కాదని పరిశోధకులు చెబుతున్నారు. మానవ తప్పిదంతో విశృంఖలంగా విస్తరిస్తున్న టి.బి (ట్యూబర్క్యులోలసిస్) ప్రపంచదేశాలకు సవాళ్లను విసురుతుంది. ఐరోపాలో 7వేల సంవత్సరాల క్రితమే ఈ వ్యాధి ఉన్నట్లు స్టెగెడ్ విశ్వవిద్యాలయం తేల్చింది.



ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్న టి.బిని అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిరంతరం శ్రమిస్తున్నా ప్రజల్లో అవగాహన లోపంతో వ్యాధి వ్యాపిస్తోంది. ప్రభుత్వ పరంగా చికిత్స ఉన్నప్పటికీ ప్రైవేటురంగంలో రోగ నిర్ధారణ పరీక్షల

క్షయ ఏ అవయవానికైనా వ్యాపించవచ్చు..!

కేంద్రాలు లేకపోవడంతో ప్రజలకు నిర్ధారణ సంపూర్ణంగా అందుబాటులోకి రాలేకపోయింది. అయితే దక్షిణ భారతదేశంలో తొలిసారిగా స్వాతంత్ర్యానికి పూర్వం 1936లో డాక్టర్ ఐరావతం హైదరాబాద్‌లో క్లినికల్ ల్యాబరేటరీని స్థాపించి ప్రజలకు సేవాభావంతో రోగనిర్ధారణ పరీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆయన కుమారుడు ఐరావతం చంద్రశేఖర్, ఆ తర్వాత డాక్టర్ చిత్రచంద్రశేఖర్ ఐరావతం ప్రయోగశాలను నిర్వహిస్తున్నారు. బషీర్‌బాగ్‌లోని ఐడిబిఐ బ్యాంకు పై అంతస్తులో క్లినిక్ ల్యాబరేటరీని ఏర్పాటు చేశారు. దక్షిణభారతదేశంలో తొలి ల్యాబరేటరీగా గుర్తింపు పొందిన దీన్ని డాక్టర్ చిత్ర చంద్రశేఖర్ అంకితభావంతో నిర్వహిస్తూ అనేక మందికి టి.బి అడ్వాన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అనేక సంస్థల నుంచి బంగారు పతకాలు సాధించిన చిత్ర సుప్రసిద్ధ ఐప్యాక్యుట్ సంస్థ సభ్యురాలు. ఈ సంస్థ అమెరికా మాజీ అధ్యక్షుడు క్లింటన్ ఫౌండేషన్ సౌజన్యంతో సేవలందిస్తుండటం గమనార్హం. ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం అందించిన డాక్టర్ ఐరావతం ల్యాబరేటరీని నిర్వహిస్తున్న చిత్ర చంద్రశేఖర్‌తో పల్స్ ముఖాముఖి..



టి.బి పరీక్ష ప్రయోగశాలను నిర్వహించాలనే ఆలోచన ఎలా వచ్చింది?

మా తాత,ఆ తర్వాత మా నాన్న టి.బి క్లినికల్ ల్యాబరేటరీని నిర్వహించారు. ఆ స్ఫూర్తి తో ప్రజలకు వైద్యసేవలందించాలనే ఆలోచన నాలో బలంగా పెనవేసుకుపోయింది. ప్రజలను అప్రమత్తం చేసి రోగనిర్ధారణ ముందుగానే చేస్తే సమస్యకు పరిష్కారం సులువు అవుతుంది.ప్రధానంగా టి.బి పట్ల అంతర్జాతీయంగా అనేక కార్యక్రమాలు జరుగుతున్నా ఇంకా ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన పెరగలేదు. అందుకే జనటిక్స్‌లో పిహెచ్‌డి చేసి టి.బి పై పూర్తి స్థాయి పరిశోధనకు ఎన్.టి.ఐ లో ప్రత్యేకశిక్షణ తీసుకున్నాను. అనంతరం జాతీయ టి.బి. కంట్రోల్ ప్రోగ్రామ్స్‌లో డాట్స్ ల్యాబ్ లో విధులు నిర్వహించాను. బషీరాబాగ్ లోని 102 మహవీర్ హౌజ్ పై అంతస్తులో డాక్టర్ ఐరావతమ్స్ ల్యాబరోటరీని నేను మా అన్నయ్య నిర్వహిస్తున్నాం.

డాక్టర్ ఐరావతమ్స్ ల్యాబరేటరీల్లో ఎలాంటి పరీక్షలు నిర్ధారిస్తారు?

టి.బి. కి సంబంధించిన ప్రతి వైద్య పరీక్షను ఆధునిక శాస్త్ర పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన యంత్రాలతో నిర్వహిస్తున్నాం. జీన్ ఎక్స్‌ఫర్ట్ , లైన్ ప్రోమ్ అస్సై, కఫంతో పాటు అనేకరకాల పరీక్షలు చేస్తున్నాం. అయితే గతంలో మాదిరిగా వారాలపాటు వైద్యపరీక్ష ఫలితాల కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదు. రోజులు, గంటల్లో ఫలితాలు వెల్లడయ్యే శాస్త్రీయ వైద్యపరిజ్ఞానం మా ల్యాబరేటరీకి ఉంది.

క్షయను అంటువ్యాధిగా నిర్ధారించవచ్చా?

టి.బి. కచ్చితంగా అంటువ్యాధే. పరీక్షలు చేసుకునేంత వరకు కొన్ని సందర్భాల్లో ఈ వ్యాధి బహిర్గతం కాదు. కానీ రోగలక్షణాలు ఉంటాయి. జబ్బు ఉన్నవారు దగ్గినా, తుమ్మినా, పూసినా, గాలి ద్వారా వ్యాపిస్తుంది. క్షయ వ్యాధిలో అనేక రకాలు ఉన్నాయి. ఊపిరితిత్తులకు సంబంధించిన ఈ వ్యాధి శరీరంలో ఏ భాగానికైనా వేగంగా వ్యాపించవచ్చు. మైక్రో బాక్టీరియా తో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. క్లోమం, థైరాయిడ్ గ్రంథి తో పాటు శరీర భాగాలకు విస్తరిస్తుంది.

క్షయవ్యాధి రావడానికి కారణాలు?

నిర్లక్ష్యం, ఆర్థిక అసమానతలు ఈ వ్యాధి రావడానికి కారణాలుగా భావించవచ్చు, ప్రధానంగా మురికివాడల్లో గాలి,వెలుతురు సరిగ్గా లేని ప్రాంతాల్లో వ్యాధి త్వరితగతిన ప్రబలుతుంది. అలాగే ఎండ ఎరుగని వారిలో డి విటమిన్ లోపించడం వ్యాధి లక్షణాల్లో ఒక భాగమే.

టి.బి. చికిత్స అందుబాటులో ఉందా?

ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందుబాటులో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించిన మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉంటాయి. అలాగే ప్రైవేటు రంగంలో చికిత్స అందుబాటులో ఉంది. మొదటిసారిగా వ్యాధివ్యాపిస్తే క్రమం తప్పకుండా ఆరునెలలు మందులు వాడితే పూర్తిగా తగ్గుతుంది. రెండవసారి అటాక్ అయితే తొమ్మిది నెలలు చికిత్స తీసుకోవాలి. ఇదిలా ఉండగా ప్రపంచవ్యాప్తంగా టి.బి. నివారణ చర్యలు వేగవంతంగా జరగడంతో ఫలితాలు వస్తున్నాయి. అయితే ప్రజలు ఎవరికి వారు పరిశుభ్రత కోసం శ్రమించడంతో పాటు గాలి,వెలుతురు ఉన్నప్రాంతాల్లో జనావాసాలు ఏర్పాటు చేసుకోవడంతో ఎప్పటికప్పుడు రోగనిర్ధారణ చర్యలు తీసుకోవల్సిన అవశ్యకత ఉంది.

వి.భూమేశ్వర్

జాతరలో భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎక్కువ జన సమూహం ఉన్న ప్రాంతాల్లో స్నానాలకు వెళ్లేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవచ్చును. జన సమూహాలలో దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండుట వల్ల కొందరికి ముక్కు నుండి నీరు కారడం, ముక్కు బిగుసుకొనిపోయి శ్వాస ఆడక పోవడం, తుమ్ములు రావటం, దగ్గుతో పాటు ఆయాసం రావటం, ఛాతి బరువుగా అనిపించటం, కళ్ళు ఎర్రబడి నీరు కారడం, ఒంటిపై దద్దుర్లు, చర్మం పొడిగా మంటగా అనిపిస్తుంది. అలాగే కలుషిత నీరును తాగుట వల్ల వాంతులు, విరేచనాలు అవుతుంటాయి.



జాగ్రత్తలు....

* నీటిలో ఎక్కువగా ''ఈకోలీ'' బ్యాక్టీరియా ఉంటుంది. వాంతులు విరేచనాలు అయ్యే అవకాశం ఉంటుంది. అలాగే నీటిలో ఎక్కువ సేపు గడపటం వల్ల దగ్గు, జలుబు , జ్వరం, గొంతునొప్పి లాంటివి వస్తాయి. అందువల్ల నీటిలో భక్తులు ఎక్కువ సేపు ఉండకుండా చూసుకోవాలి.
* తడిసిన బట్టలు ఎక్కువ సేపు ఒంటి మీద ఉండటం వల్ల చర్మవ్యాధులు వస్తాయి. స్నానం అనంతరం తడిసిన బట్టలను వెంటనే మార్చుకోవాలి.
* జాతరలో స్నానాలకు వెళ్లిన వారు దుమ్ము, ధూళి వల్ల ఆయాస పడుతున్నప్పుడు రోగి వెల్లకిలా పడుకోకుండా, తల ఎత్తులో పెట్టుకొని కూర్చున్న స్థితిలో ఉంచాలి.
* ఆయాసం తీవ్రంగా ఉన్నప్పుడు రోగిని త్వరగా దగ్గర్లోని ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకెళ్ళాలి.
* కలుషిత నీరు, ఆహార పదార్థాల వల్ల వాంతులు, విరేచనాలు అవుతున్నప్పుడు రోగికి వెంటనే ద్రవ పదార్థాలు ఇవ్వాలి.
* కొబ్బరి నీరు, మంచినీరు, మజ్జిగ మొదలైనవి ప్రారంభం నుంచి ఇవ్వాలి. డీహైడ్రేషన్ నివారణకు కాచి చల్లార్చిన ఒక గ్లాసు నీటిలో రెండు స్పూన్ల పంచదార, చిటికెడు ఉప్పు కలిపి ఇవ్వాలి. లేదా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఇవ్వాలి.
* నోటితో ఏమీ తీసుకోలేని స్థితిలో ఇంట్రావీనస్ ద్వారా సెలైన్‌ను డాక్టర్ల సమక్షంలో ఇవ్వవలసి ఉటుంది. రోగిని త్వరగా దగ్గరలోని ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకెళ్లాలి.
* కలుషిత నీటిని తీసుకోకుండ, తాగునీరు అని రాయబడిన ట్యాంకులలో నీరును మాత్రమే తాగాలి.

జాతరకు వెల్లే ముందు హోమియో మందు ఆర్సినికం ఆల్బం 30ను ఉదయం, సాయంత్రం ఒక డోసు చొప్పున వేసుకుంటే చాలావరకు ముక్కు నుండి నీరు కారడం, దగ్గు, కళ్ల నుండి నీరు కారడం, ఒంటిపై దద్దుర్లు, చర్మం పొడిగా మంటగా అనిపించటం, దురద రావటం, విపరీతమైన నీరసం వంటి సమస్యలు తగ్గుతాయి. జాతర స్నానాలకు వెళ్లివచ్చిన తరువాత దగ్గు, జలుబు జ్వరం, గొంతునొప్పి, విరేచనాలు వంటి సమస్యలుంటే నిర్లక్ష్యం చేయకుండ వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.



డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
హోమియోఫిజీషియన్, హన్మకొండ

టేకులపల్లి ఎన్‌కౌంటర్ బూటకమే! : విశ్వనాథ్




మన తెలంగాణ/హైదరాబాద్: శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్ హత్యలను తెలంగాణ సమాజమంతా ఒక్కటిగా నిలబడి ఖండించినా పెడచెవిన పెట్టిన ప్రభుత్వం టేకులపల్లిలో తొమ్మిది మందిని ఒకేసారి కాల్చి చంపిందని, కెసిఆర్ నియంతృత్వ పాలనకు ఇవి నిదర్శనమని సిపిఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్ మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టేకులపల్లి బూటకపు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరి పించాలని డిమాండ్ చేశారు. రాజన్న, బొమ్మని నర్సింహ తదితరులపై మోపి న అక్రమ కేసులను ఎత్తేసి, రాజన్నకు వైద్యసహాయం అందించాలని డిమాండ్ చేశారు. సీమాంధ్ర కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెడ్తూ కెసిఆర్ దోపిడీ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఆర్‌ఎంపి డా. ఓం ప్రకాశ్ యాదవ్‌ను గత నెల 13న ముత్యాలమ్మ అంగడిలో అరెస్టు చేసి రాత్రికి రాత్రే తొమ్మిది మంది కార్యకర్తలను కోవర్టు ఆపరేషన్‌లో పట్టుకుని తెల్లవారే సరికల్లా కాల్చి చంపి శవాలను ట్రాక్టర్‌లో తీసుకుపోయి మేళ్లమడుగు దగ్గర పడేశారని ఆరో పించారు. జనశక్తి నాయకుడు బొమ్మని నర్సింహను ఈ నెల 9న మలక్‌పేటలోని యశోధ ఆసుపత్రి వద్ద అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. 'విప్లవకారుల ఐక్యత–గోదావరిలోయ ఏకత' అనే అంశాలకు కట్టుబడ్డ జనశక్తి అన్ని విప్లవ సంస్థలతోనూ నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరుపుతుందని తెలిపారు.

హింసకు వ్యతిరేకంగా 'శతకోటి చిన్నారుల గళం'

మన తెలంగాణ/హైదరాబాద్: దేశంలో చిన్నారులపై జరుగుతున్న లైంగింక దాడులకు నిరసనగా శతకోటి పిల్లల గళాన్ని వినిపించనున్నట్లు పలు స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల ప్రతినిధులు తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు యాక్షన్ ఎడ్, ఆమన్ వేదిక, భూమిక, గ్రామీణ, షాహిన్, రెయిన్‌బో ఫౌండేషన్‌లతో పాటు మరిన్ని సంస్థలు, సంఘాలు పేర్కొన్నాయి. సభలు, సమావేశాలతో పాటు ప్రదర్శనల ద్వారా పిల్లలపై హింసను అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నాదే తమ అభిమతమని పేర్కొన్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థల ప్రతినిధులు విడుదల చేశారు. బుధవారం నుంచి 21రోజుల పాటు చిన్నారులపై జరిగే హింసకు వ్యతిరేకంగా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు, సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఆధునిక సమాజంలోనూ పిల్లలను అమ్మడం, చంపడం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు చెప్పేది తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులూ వినాలన్నారు.

ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక





మన తెలంగాణ/ హైదరాబాద్: అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్ధినేని కరుణ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మారుపాక అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని మఖ్దూంభవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై రామన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నికున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పంజాల శ్రీనివాస్ (కరీంనగర్ జిల్లా), నెర్లకంటి శ్రీకాంత్ (హైదరాబాద్), పొసిరి గిరి శ్యామల (రాష్ట్ర కేంద్రం), తోట విజయ్ (మహబూబాబాద్), సహాయ కార్యదర్శులుగా కొత్తపల్లి చిరంజీవి, కనుకుంట్ల శంకర్ (సిద్ధిపేట), పొసిరిగిరి సురేశ్ (మహబూబ్‌నగర్), వెంకటేశ్వర్లు (నల్లగొండ)తో పా టు 36మంది కార్యవర్గ సభ్యులు, 67మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మార్చి 24న ఓటర్ల తుది జాబితా

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితాలో సవరణల కోసం అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో పేర్లను తొలగించారంటూ ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో రాష్ట్రంలోని 86 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికల సంఘం జాబితాలో సవరణకు నడుం బిగించడం విశేషం. ఇప్పటివరకు ఓటర్ల జాబితాలో సవరణలు పూర్తయ్యి తుది జాబితా విడుదల చేసిన 36 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇది ఉండదని స్పష్టం చేసింది. ముసాయిదా జాబితాపై ఓటర్లు వారి అభ్యంతరాలను ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఎన్నికల సంఘానికి పంపించవచ్చునని పేర్కొనింది. ఈ సంవత్సరం జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లను నమోదు చేసుకోవాలనుకుంటే దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధికారులు ఆ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపెయిన్‌లను నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను మార్చి 5వ తేదీ వరకు పరిష్కరించనున్నట్లు తెలిపారు. కొత్త ఓటర్ల వివరాలు, అభ్యంతరాలను పరిశీలించి మార్చి 15వ తేదీలోగా పూర్తి చేసి 22వ తేదీన తుది జాబితాను రూపొందిస్తామని, మార్చి 24వ తేదీన తుది జాబితాను విడుదల చేయనున్నట్లు ఎన్నికల ప్రధాన అధికారి అనూ ప్‌సింగ్ తెలిపారు.

జైలు నుంచి మందకృష్ణ విడుదల



మన తెలంగాణ/ హైదరాబాద్: ఎస్‌సి వర్గీకరణపై తమ సంస్థ ఉద్యమం ఆగదని ఎంఆర్‌పిఎస్ నేత మందకృష్ణ మాదిగ మరోసారి ప్రకటించారు. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. అనుమతి లేకుండా దీక్ష చేసినందుకు మందకృష్ణ మాదిగను ఈ నెల 3వ తేదీన చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేయడంతో రాత్రి 9 గంటలకు చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా జైలు వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎం ఆర్‌పిఎస్ కార్యకర్త భారతి మృతి చెందిన రోజునే అసెంబ్లీలో కెసిఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని చెప్పారని, ఇచ్చిన మాటను నెరవేర్చాలనే అడిగితే తప్పేంటని ప్రశ్నించారు. కెసిఆర్ అహంకారం, నియంతృ త్వ పోకడలు ఎప్పటికీ చెల్లుబాటు కావని, అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిస్తే ఉద్యమాలు ఆగుతాయని కలలు కంటున్నారన్నారు. చట్టం, న్యాయవ్యవస్థపై తమకు గౌరవం ఉందన్నారు. ఈ నెల 25 లేదా 27వ తేదీన అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి ఎస్‌సి వర్గీకరణపై తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. కేంద్రం వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టే విధంగా ఒత్తిడి తీసుకువస్తామన్నారు. తెలంగాణలో ఉన్న 15 మంది దళిత ఎమ్మెల్యేల కు తగిన గౌరవం లభించడంలేదని, మంత్రి వర్గంలో దళిత మంత్రే లేరన్నారు. ఆత్మగౌరవంతో దళిత ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జాతీయ అనుబంధ ఎంఆర్‌పిఎస్ సంఘాలతో సమావేశమై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. దళితులకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై ఆందోళనలు: బిజెపి

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రజా సమస్యలపై ఆందోళన కార్యక్రమాలను, సభలు, సమావేశాలను నిర్వహించేందుకు కమలనాథులు సన్నద్ధమయ్యారు. దీనికి సంబంధించిన కార్యాచరణను బిజెపి ప్రకటించింది. ఇటీవల రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన జాతీయ నేతలు ప్రజా ఆందోళనల ద్వారానే పార్టీ బలపడే అవకాశాలు ఉన్నాయని సూచించిన నేపథ్యంలో దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్ధమైంది.

ఇదీ కార్యాచరణ: హైదరాబాద్‌లో ఈ నెల 29న ధూంధాం, 30న సత్తుపల్లిలో దళిత్ ఆదాలత్, వైరాలో బిసి సంఘం సదస్సు, ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో మహిళా యుద్ధభేరి, ఫిబ్రవరి4 హైదరాబాద్‌లో దళిత్ ఆదాలత్ , 8వ తేదీన కరీంనగర్‌లో రైతు పోరు సభ, 9న ఆదిలాబాద్‌లో బహిరంగసభ, 10న ఇబ్రహీంపట్నం, పటాన్‌చెర్ లో బిసి సంఘం సదస్సు, 11న వరంగల్‌లో రైతుపోరుసభ, 21న దేవరకద్ర బిసి సంగ్రామ సదస్సు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

మహా జాతరకు 4200 బస్సులు



- హైదరాబాద్ నుంచి ఎసి సర్వీసులు
- హైదరాబాద్, వరంగల్ నుంచి హెలికాప్టర్ సేవలు
- భక్తుల కోసం ప్రత్యేక యాప్
- రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

మన తెలంగాణ/వరంగల్: మేడారం సమ్మక్కసారలమ్మ జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర. వన దేవతలను దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం 4200 ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మేడారంలో డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, గిరిజన, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి చందులాల్ తో కలసి ఆర్‌టిసి బస్ సెంటర్‌లో క్యూరేలింగ్, ప్రత్యేక యాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. సమ్మక్కసారలమ్మ జాతరను పండుగగా గుర్తించాలని కేంద్రాన్ని కోరినప్పటికీ గుర్తించలేదన్నారు. ఈ ఏడాది జాతరకు కోటి 20లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. అందుకే జాతరకు 4200 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్ నుంచి ఎసి బస్సులను నడుపుతున్నామన్నారు. గత జాతరలో 3755 బస్సులు నడిపితే 14 లక్షల 82 వేల మంది ప్రయాణించారని చెప్పారు. ఈసారి బస్సులను రాష్ట్రంలోని 23 ప్రాంతాల నుంచి నడుపుతున్నామని, జాతర కోసం 11వేల మంది సిబ్బంది పనిచేస్తారన్నారు. ఆర్‌టిసి పాయింట్‌లో 36 సిసి కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీల కంటే అదనంగా 1.5చార్జ్ వసూలు చేస్తామన్నారు. మేడారంలో 50.93 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్టాండ్ ప్రయాణికులకు తాగునీరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ రీజియన్ నుంచి 531, ఖమ్మం రీజియన్ నుంచి 375, ఆదిలాబాద్ 304, వరంగల్ నుంచి 2150 బస్సులు, వరంగల్‌లోని ఇతర ప్రాంతాల నుంచి 205 బస్సులు, రంగారెడ్డి రీజియన్ నుంచి 80 బస్సులను నడుపుతున్నామని మహేందర్‌రెడ్డి తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ, మేడారం ట్రస్టు బోర్టు చైర్మన్ కాక లింగయ్య, వరంగల్ మేయర్ నన్నపునేని నరందర్, ఆర్‌టిసి ఎండి రమణారావు, కలెక్టర్ కర్ణన్, వరంగల్ సిపి సుధీర్‌బాబు, ఎస్‌పి భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఖ్యాతి



- ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి కెటిఆర్ ప్రసంగం
- అంబానీ, చంద్రబాబు, లోకేష్‌తో భేటీ
- రాష్ట్రంలో పెట్టుబడులకు పలు సంస్థలకు ఆహ్వానం

మన తెలంగాణ/హైదరాబాద్: వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సుల్లో పాల్గొనాల్సిందిగా తెలంగాణ రాష్ట్రానికి ఆహ్వానం వస్తున్నప్పటికీ మూడున్నరేళ్ళ తర్వాత తొలిసారిగా దావోస్ సదస్సుకు హాజరైనట్లు రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో తొలి రోజు ప్రారంభోత్సవ ప్లీనరీ సమావేశంలో ప్రసంగించారు. దేశ ప్రధాని మోడీతో పాటు ఎపి సిఎం చంద్రబాబు నాయుడు , ఆ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, ఎంపి గల్లా జయదేవ్‌తో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ, బహుళజాతి సంస్థల కంపెనీల సిఈవోలు, చైర్మన్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్లీనరీ సమావేశంలో కెటిఆర్ ప్రసంగిస్తూ ఈ సదస్సు ద్వారా తెలంగాణ ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలోని వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు అవకాశం లభించిందన్నారు. అనంతరం పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. థాయిలాండ్ దేశానికి ఇందోరమా వెంచర్స్ అనే జౌళి పరిశ్రమ చైర్మన్ అలోక్ లోహియాతో భేటీ అయ్యారు. తెలంగాణలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను వివరించారు. పరిశీలిస్తామని గ్రూపు చైర్మన్ వ్యాఖ్యానించారు. వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 25న కేంద్ర మంత్రి సురేష్ ప్రభు పాల్గొననున్న ప్యానెల్ డిస్కషన్‌లో 'ప్రామోటింగ్ డిజైన్ ఇన్ ఇండియా' అన్న అంశంపై కెటిఆర్ ప్రసంగించనున్నా రు.

మెట్రో రెండో దశకు డిపిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్ మార్గాల్లో కాలుష్య రహిత ఎలక్ట్రిక్ వాహనాల అనుసంధాన పక్రియను త్వరలోనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ అంశంపై సచివాలయంలో మంగళవారం ఎస్.పి.సింగ్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణ శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, జిహెచ్‌ఎంసి కమిషనర్ బి.జనార్దన్ రెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషనర్ టి. చిరంజీవులు, హైదరాబాద్ కలెక్టర్ యోగితారాణా, మేడ్చల్ కలెక్టర్ డా. ఎం.వి.రెడ్డి, టిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ ఎ. పురుషోత్తంనాయక్, ఎల్‌అండ్‌టి ఎంఆర్‌హెచ్‌ఎల్ సిఇ, ఎండి కెవిబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు గమ్యస్థానానికి వీలుగా మెట్రో రైల్ స్టేషన్ల వారీగా రైళ్ల సమయాలు, అందుకు అనుగుణంగా ఆర్‌టిసి బస్సు సర్వీసుల సమాచారాన్ని అధ్యయనం చేసి నివేదికను అందించాలన్నారు. మెట్రో రైలు రెండవ దశ డిపిఆర్ ను రూపకల్పనలో జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, హైదరాబాద్, రంగారెడ్డి సంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, ఎల్‌అండ్‌టి హెచ్ ఎంఆర్, జిఎంఆర్ అధికారులు సమన్వయంతో కార్యాచరణను రూపొందించాలని సూచించారు.

ఐక్యతా విందు

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే ఈ నెల 28న కాంగ్రెస్ సీనియర్ నాయకుల విందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టిపిసిసి కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి నివాసం ఇందుకు వేదిక కానుంది. ఈ విందుకు ఆహ్వానించేందుకు 300 మందితో కూడిన జాబితాను ఇప్పటికే రూపొందించారు. టిపిసిసి నాయత్వంతో పాటు, ముఖ్య నాయకులు, పిసిసి మాజీ అధ్యక్షులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, రాష్ట్ర,కేంద్ర మాజీ మంత్రులు, మాజీ ఎంఎల్‌ఏలు, మాజీ ఎంఎల్‌సిలు, మాజీ ఎంపిలు, ఎఐసిసిలో వివిధ పదవుల్లో ఉన్న, గతంలో ఉన్న నాయకులను విందుకు ఆహ్వానించాలని నిర్ణయించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారల ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఆర్.సి.కుంటియాతో పాటు, ఎఐసిసి నుండి ముఖ్య నాయకులను కూడా ఆహ్వానించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. నాయకుల మధ్య సహృద్భావ వాతావరణం నెలకొల్పేందుకు తొలి మెట్టుగా ఈ విందు సమావేశం ఉండనుందని కాంగ్రెస్‌లో ఉన్నత స్థాయి నాయకులు చెబుతున్నారు. నాయకుల అహం, ఆధిపత్య సమస్యలను పక్కన బెట్టి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంతో పాటు, ఎక్కువ ఎంపి స్థానాలను గెలిపించుకోవాలనే లక్ష్యంతో పనిచేయాలనేది ఈ సమావేశ ముఖ్య ఉద్దేశ్యం.

తెలంగాణ ఇచ్చినప్పటికీ సిఎం పదవి కోసం నాయకుల మధ్య పోటీ, అనైక్యత కారణంగానే కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఆ తరువాత కూడా నాయకులు ఎవరికివారే అనే రీతిలో వ్యవహరించారు. సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత టిపిసిసి పదవి కోసం పలువురు నాయకులు పోటీ పడ్డారు. వారిలో కోమటిరెడ్డి బ్రదర్స్, డి.కె.అరుణతో పాటు సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి, టిపిసిసి మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు. అయితే, అధిష్టానం రాష్ట్రాల పిసిసి అధ్యక్షులతో పాటు టిపిసిసి ఛీఫ్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే కొనసాగించేందుకు మొగ్గు చూపింది. దీంతో పాటు ఏడాదిలో ఎన్నికలు రానుండడంతో ఆయన నేతృత్వంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు వెళ్ళనుందని సంకేతాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో పిసిసి అధ్యక్ష పదవికోసం పోటీ పడినవారు, ఇతర సీనియర్ నాయకులు కాస్త ముభావంగా ఉన్నారు. తాము ఐక్యం కాకుండా రాజకీయ వ్యూహాల్లో దిట్ట అని పేరున్న సిఎం కెసిఆర్‌ను ఓడించలేమనే భావన ఉన్నప్పటికీ, అందుకు ఉత్తమే చొరవ చూపాలనే భావన అందరిలో నెలకొంది. నాయకులతో ఉన్న గ్యాప్‌ను తొలగించేందుకు ఉత్తమ్ సన్నిహితులు చొరవ చేసి ఈ విందు సమావేశానికి పూనుకున్నారు. దీనికి రాష్ట్ర పార్టీలో ముఖ్యులని భావించే ప్రతి ఒక్కరిని విడిచిపెట్టకుండా ఆహ్వానాలు పంపిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులతో ఉత్తమ్ తన మనసు విప్పి మాట్లాడుతారని, విబేధాల పరిష్కారానికి చొరవచూపుతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. దీని తరువాత కూడా వ్యక్తిగతంగా నాయకులను కలవడంతో పాటు, వారి అభిప్రాయాలు స్వీకరించడం, వారితో ఏ అంశాల్లో విబేధాలు ఉన్నాయో, వాటిని పరిష్కరించే ఫార్ములాను ప్రతిపాదించడం చేస్తారని వారు పేర్కొంటున్నారు.

తెలంగాణ కుంభమేళా

(మొదటిపేజీ తరువాయి)

తగినట్లుగా 80 కోట్ల రూపాయల వ్యయంతో శ్వాశ్వత ప్రాతిపదికన భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రానున్న రోజులలో 365 రోజుల పర్యాటకులు వచ్చే విధంగా మేడారాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తున్నామని అందులో భాగంగానే గిరిజన మ్యూజియం, హరితహోటల్స్, హ్యాపీనెస్ హౌజ్‌లను ఒకేచోట ఏర్పాటు చేశామన్నారు.

జాతీయ పండుగగా గుర్తింపు కోసం ప్రయత్నం: మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామని, రాష్ట్ర ఎంపిలతో కలసి ఉప రాష్ట్ర పతి వెంకయ్యానాయుడు, కేంద్ర గిరిజనశాఖ మంత్రికి వినతి పత్రాన్ని ఇచ్చినట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు.

ఫిబ్రవరి 2న సిఎం రాక: రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఫిబ్రవరి 2నమేడారం వస్తున్నట్లు రాష్ట్ర గిరిజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీర చందూలాల్ తెలిపారు. అదే విధంగా దేశ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, గవర్నర్ నరిసింహన్‌లు కూడా వస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ, మహబూబాబాద్ ఎంపి అజ్మీరా సీతారాంనాయక్, వరంగల్ నగర మేయర్ నన్నపునేని నరేందర్, మేడారం ట్రస్టు బోర్టు చైర్మన్ కాక లింగయ్య, జయశంకర్ జిల్లా ఇంచార్జి కలెక్టర్ కర్ణన్, జాయింట్ కలెక్టర్ డి.అమయ్‌కుమార్, ములుగు సబ్ కలెక్టర్ గౌతమ్, వరంగల్ పోలీసు కమిషనర్ జి. సుధీర్‌బాబు, జయశంకర్ భూపాలపల్లి ఎస్‌సి భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర, వాతావరణాలు

(మొదటిపేజీ తరువాయి)





అవకాశాలను కల్పిస్తూనే సవాళ్లను కూడా విసురుతోందని చెప్పారు. సాంకేతిక విజ్ఞానంతో వచ్చే మార్పులు ప్రజల ఆలోచనలో, పనితీరులో అంతర్జాతీయ కూటములలో, రాజకీయాలలో,ఆర్థిక వ్యవస్థలలో గొప్ప పరివర్తన తెస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక ఫోరం 1997లో ఉన్న తీరుకు, ఇప్పుడు 2018లో తీరుకు మధ్య తేడాను వివరించారు. 1997లో దావోస్‌కు భారత ప్రధానికిగా దేవెగౌడ వచ్చారని అప్పుడు తమ జిడిపి 400 బిలియన్ డాలర్లపై కొద్దిగా ఎక్కువగా ఉండేదని ఇప్పుడు అది ఆరు రెట్లు పెరిగిందని తెలిపారు. నెట్‌వర్క్ ఆధారిత సమాజాన్ని నిర్మించడానికి ఫోరం చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. అప్పట్లో యూరో ఉండేది కాదని, చాలా కొద్ది మందికే ఒసామా బిన్ లాడెన్ గురించి తెలుసని ఇప్పుడు అలా కాదనీ చెబుతూ ఇప్పుడు నెట్‌వర్క్ పాత్ర పెరిగిందని చెప్పారు. పూర్వం ట్వీటింగ్ పక్షులే చేసేవని, ఇప్పుడు మనమంతా చేస్తున్నామని అన్నారు. దెబ్బతిన్న ప్రపంచంలో అందరం పాలుపంచుకొనే విధానాలు సృష్టించాలన్న డబ్ల్యుఇఎఫ్ ఈ ఏడాది థీమ్ గురించి మాట్లాడుతూ భారత దేశపు 'వసుధైక కుటుంబకం' సూత్రాన్ని మోడీ ప్రస్తావించారు. ఈ సూత్రం ప్రస్తుత ప్రపంచంలో మరింత సందర్భోచితమని చెప్పారు. ఎందుకంటే ప్రపంచం ఒక కుటుంబం అని ఆ ఆర్యోక్తి వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. మానవుల ఐక్యతనే తాము ఎల్లప్పుడూ నమ్మామని, విభజన కాదని చెప్పారు. వాతావరణంలో కొన్ని విస్పోటన శక్తులు ఉన్నాయని హెచ్చరించారు. అవి ప్రపంచ శాంతికి, సుస్థిరతకు భంగకరమన్నారు. అందుకే మానవులంతా ఐక్యంగా నిలబడాలని ఉద్బోధించారు. అదే సమయంలో ఆ అడ్డంకులపట్ల ఆత్మ శోధన అవసరమన్నారు. వాటి ఉనికిని మనమే ప్రోత్సహిస్తున్నామని గుర్తుచేశారు. వివిధ సావకాశాలను మానవులు తమ అవసరాలకు వినియోగించుకోవడం ముఖ్యం కాబట్టి ట్రస్టీల వ్యవస్థ సూత్రాన్ని గాంధీ ప్రవచించారని చెప్పారు. మనిషి అత్యాశతో దేనినైనా సొంతానికి వాడడాన్ని గాంధీ వ్యతిరేకించారని గుర్తు చేశారు. తన ప్రభుత్వం దేశాభివృద్ధికి చేపట్టిన పలు పథకాలను మోడీ వివరించారు. అవన్నీ సమాజంలో అందరినీ కలుపుకుపోయేందుకు ఉద్దేశించినవని వివరించారు. కేంద్రంలో 30 ఏళ్ల తర్వాత ఒక పార్టీకి సంపూర్ణ మెజారిటీని భారతీయులు కట్టబెట్టారని, ఇది 2014లో జరిగిన అద్భుతమని వివరించారు. ఏదో ఒక వర్గం కాకుండా ప్రతి ఒక్కరి అభివృద్ధికి తమ ప్రభుత్వం పాటుపడుతున్నట్లు వివరించారు.

మార్కుల విద్యవల్లే అనర్థాలు

(మొదటిపేజీ తరువాయి)

సారి టెన్త్ పరీక్షలు నిర్వహించే 1500 కేంద్రాల్లోని 405 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల్ని పెడతామని తెలంగాణ ప్రభుత్వ లాయర్ సంజీవ్‌కుమార్ చెప్పారు. ఎపిలో కూడా సిసి కెమెరాల్ని దశలవారీగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ లాయర్ చెప్పారు. వాదనల అనంతరం పిటిషనర్ లాయర్ కల్పించుకుని సిసికెమెరాలు ఉన్నా ఏర్పాటు చేయడం లేదని, ఉన్న కెమెరాల్ని పరీక్షల సమయంలో పక్కకు పెట్టేస్తున్నారని ఆరోపించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై పూర్తి వివరాలు అందజేయాలని రెండు ప్రభుత్వాలను బెంచ్ ఆదేశిస్తూ విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

ప్రజాహిత వ్యాజ్యం విచారణలో తీవ్ర వ్యాఖ్యలు: ప్రైవేటు విద్యా సంస్థల్లో, ఐఐటీల్లో విద్యార్థులు తీవ్ర ఒత్తిళ్ల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇందుకు కారణమైన కార్పొరేట్ కాలేజీలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతూ లోక్‌సత్తా ఉద్యమ సొసైటీ ప్రకాశం జిల్లా కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయేల్ రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి ఇదే డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన విద్యార్థులపై ర్యాంకుల కోసం తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారని, దాని ఫలితంగానే పలు కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని ఈ కేసులో ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిలో తల్లిదండ్రుల పాపం కూడా ఉందని, 90 శాతం మార్కులు రావాలనే ఏకైక లక్ష్యంగా పిల్లలు ఏమతున్నారో కూడా చూడకుండా ఒత్తిడిని పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చింది. సాక్షాత్తు ఏపీలో ఒక మంత్రికి చెందినదే కార్పొరేట్ కాలేజీ అని, కాలేజీలకుహాస్టల్స్‌కు అనుమతులు లేకుండా నడుపుతున్నారని పిటిషనర్ వాదన. ఆత్మహత్యలకు పాల్పడిన కాలేజీలపై విచారణ జరిపి నివేదికలు ఇవ్వలేదని, ఆత్మహత్య ఘటనల తర్వాత కన్న తల్లిదండ్రుల్ని కూడా మృతదేహాల దగ్గరకు వెళ్లనీయనంత కాఠిన్యంగా యజామాన్యాలు వ్యవహిస్తున్నాయని, ఆయా కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన హైకోర్టును కోరారు. ఈ కేసులో ప్రతివాదులైన నారాయణ, శ్రీచైతన్య కార్పొరేట్ కాలేజీలకు, ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్య, హోం శాఖల ప్రధాన కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు, స్విమ్స్, నిమ్స్ డైరెక్టర్లకు బెంచ్ నోటీసులు జారీ చేసింది. విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

యువతి సజీవ దహనం

(మొదటిపేజీ తరువాయి)

ఒంటరిగా ఉన్న సమయంలో తండ్రీ కొడుకులు ప్రవేశించి ఆమెపై కిరోసిన్ పోసి ని ప్పంటించినట్లు వారు పేర్కొన్నారు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు బాలికను వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, అయితే ఇంత వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు చెప్పారు.

రెవెన్యూశాఖ పనిలో వ్యవసాయాధికారులు

మన తెలంగాణ/హైదరాబాద్: భూ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశ్యం రైతు పంటకు పెట్టుబడి పథకాన్ని అమలు చేయడమేనని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థసారధి తెలిపారు. రెవెన్యూ శాఖ ఇచ్చే భూముల సమాచారాన్ని అనుసరించే రైతులకు పాస్‌పుస్తకాలు, సాగుకు పెట్టుబడి సహా కార పథకం అమలు, ఇతన పథకాల అమలుకైనా భూములకు సంబంధించిన సమాచారం చాలా కీలకమన్నారు. పెట్టుబడి పథకం అమలుపై జిల్లా జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, జిల్లా వ్యవసాయ అధికారులతో జరిగిన మంగళవారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే ఈ నెల 31వ తేదీలోపు 2016–17 వానకాలం, యాసంగికి చెందిన పరిహారం నిధులు రైతులకు అందజేయాలని పార్థసారధి బీమా కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు.

మన తెలంగాణ
7 | హైదరాబాద్ | బుధవారం | 24, జనవరి 2018
www.manatelangana.news



తెలంగాణ గురుకుల విద్యావిధానం దేశానికే ఆదర్శం

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ గురుకుల విద్యా విధానం దేశానికే ఆదర్శమని పంజాబ్ రాష్ట్రానికి చెందిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల ప్రతినిధి బృందం ప్రశంసించింది. రిపు దమన్ సింగ్ నేతృత్వంలోని పంజాబ్ ప్రతినిధి బృందం మంగళవారం గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గౌలిదొడ్డి ఐఐటి అకాడమీలను సందర్శించింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో విద్యతో పాటు విభిన్న కార్యకలాపాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసింది. గురుకులాల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ముఖ్యమంత్రి దూరదృష్టిని బృందం సభ్యులు కొనియాడారు. తెలంగాణ గురుకుల విద్యా మోడల్ను పంజాబ్ ప్రభుత్వం అనుసరిస్తుందని దమన్ సింగ్ అన్నారు. బృందం సభ్యులు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎస్సి డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ కరుణాకర్‌ల ను కలిశారు. ఎస్‌సిల అభివృద్ధి శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను వారు పంజాబ్ ప్రతినిధి బృందానికి వివరించారు. కెజి టు పిజి మిషన్‌లో భాగంగా 2020 నాటికి గురుకుల పాఠశాలల్లో 8 లక్షల మంది పేద విద్యార్థులు చదువుకుంటారని ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ వివరించారు. గురుకుల విద్యాలయాలకు భవిష్యత్తులో రూ.15 వేల కోట్లకు పైగా వెచ్చించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఉద్యమంలా పొలం కుంటల అభివృద్ధి

▶▶ మంత్రి టి.హరీశ్‌రావు



మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట నియోజకవర్గంలో పొలం కుంటల అభివృద్ధిని ఉద్యమంలా చేపడతామని, ఇందుకు బాలవికాస ముందుకు రావడం అభినందనీయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్లలో బాలవికాస ఆధ్వర్యంలో పొలం కుంటల తవ్వకం కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెసిఆర్ ఆదర్శ గ్రామమైన రామునిపట్ల గ్రామ వాగు ఏడాదిలో వంద రోజులు మత్తడి దుంకుతుందన్నారు. వర్షపు నీటిని కాపాడి భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా బాల వికాస సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా వుందన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా బాలవికాస పనిచేయడం బావుందన్నారు.ఇప్పటికే సిద్దిపేట నియోజకవర్గం పరిధిలో తిమ్మాయిపల్లి, ఇబ్రహీంపూర్, రామునిపట్లలో 40వరకు పొలం కుంటల తవ్వకం చేపట్టామని, త్వరలోనే గుర్రాలగొందిలో 40 పొలం కుంటల పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించే రంగనాయక సాగర్ కుడి, ఎడమ కాలువల ద్వారా 775 ఎకరాలకు సాగునీరు అందనున్నదని ఈ సందర్భంగా వివరించారు. సేంద్రియ ఎరువులతో పంటలు పండించే రైతులకు సిద్దిపేట రైతు బజార్‌లో స్టాల్ పెట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలవికాస వ్యవస్థాపకురాలు బాలక్కతోపాటు పలువురు పాల్గొన్నారు.

102 సర్వీసులు ప్రారంభం: సిద్దిపేట మార్కెట్ యార్డులో మంగళవారం 102 సర్వీసులను మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రసవం తరువాత ఇంటికి చేర్చేందుకు వీటిని ఉపయోగించవచ్చన్నారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు యాభై వరకు 108 బైక్ అంబులెన్స్‌లు ప్రారంభించామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 102 సర్వీసుల్లో జిపిఎస్ టెక్నాలజీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, డిఎంహెచ్‌వొ అమర్‌సింగ్, డాక్టర్ కాశీనాథ్, చైర్మన్ రాజనర్సులు పాల్గొన్నారు.

పాఠశాల నూతన భవనం ప్రారంభించిన మంత్రి : సిద్దిపేట పట్టణంలోని పారుపల్లి ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని మంత్రి టి.హరీశ్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో పారుపల్లి పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.నాసర్‌పురా హనుమాన్ దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు.

ఓటమి భయంతోనే పరోక్ష ఎన్నికలకు సిద్ధమవుతున్న కెసిఆర్

కరీంనగర్ మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్



మన తెలంగాణ/కోహెడ : పంచాయతీ ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించేందుకు సిఎం కెసిఆర్ సిద్ధమవుతున్న తీరును చూస్తుంటే టిఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని భావించాల్సి వస్తుందని కరీంనగర్ మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో పంచాయతీ ఎన్నికలను ప్రత్యక్షంగా నిర్వహించాలని కోరుతూ హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో పొన్నం మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ప్రభుత్వ వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడం కోసం గ్రామాల్లో పరోక్ష ఎన్నికల కోసం చట్టసవరణ చేయాలనుకోవడం సరికాదన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను మార్చుతూ పరోక్ష పద్ధతిలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న టిఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. మండల అధ్యక్షులు కర్ర రవీందర్, సర్పంచ్ భీంరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎసిబి వలలో ఆర్మూర్ ఆర్‌డిఒ

మన తెలంగాణ /ఆర్మూర్ టౌన్ (నిజామాబాద్ జిల్లా) : ఆర్మూర్ ఆర్‌డిఒ బాలే శ్రీనివాస్ మంజీరా మినరల్ వాటర్ ప్లాంట్ యాజమాని బదం రాజ్ కుమార్ వద్ద 40 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా మంగళవారం కరీంనగర్ ఎసిబి అధికారులు వల పన్ని పట్టుకున్నారు. ఆర్మూర్ ఆర్‌డిఒ బాలే శ్రీనివాస్ గత కొన్ని రోజులుగా వాటర్ ప్లాంట్ యాజమాని బదం రాజ్‌కుమార్‌ను లంచం కోసం వేధిస్తున్నాడని చరవాణి ద్వారా ఎసిబి అధికారులకు సమాచారం అందించగా ఎసిబి డిజి పూర్ణచందర్ రావు ఆదేశాల మేరకు ఆర్మూర్ చేరుకొని ప్లాంట్ యాజమాని 40 వేల రూపాయలు తీసుకుని ఆర్‌డిఒ నివాసానికి వెళ్ళి అందజేస్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆర్‌డిఒను కరీంనగర్ ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని ఎసిబి అధికారులు తెలిపారు. రాయకల్ మండలం అలీపూర్ గ్రామానికి చెందిన ఆర్‌డిఒ బాలె శ్రీనివాస్‌కు జగిత్యాలలో 4 అపార్ట్‌మెంట్లు, హైదరాబాద్, బొల్లారంలో రెండు ప్లాట్లు ఉన్నాయని, శ్రీనివాస్ అత్తగారింట్లో సోదాలు నిర్వహిస్తామని తెలిపారు.

భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

మన తెలంగాణ/బెజ్జూర్ : కుమ్రం భీం జిల్లా బెజ్జూర్ మండలంలోని ఇప్పలగూడ గ్రామంలో మంగళవారం తగురం రాజుబాయి (60)ను భర్త తగురం లస్మయ్య గొడ్డలితో నరికి చంపిన ఘటన చోటుచేసుకుంది. సిఐ మోహన్, ఎస్సై శివప్రసాద్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. తగురం లస్మయ్య మద్యానికి బానిసై ప్రతి రోజూ డబ్బుల కోసం భార్యను వేధించేవాడని, మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో సోమవారం రాత్రి భార్య రాజుబాయిని గొడ్డలి నరికి చంపినట్లు తెలిపారు. నిందితుడు లస్మయ్య పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కొడుకు తగురం ఇస్తారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/తుర్కపల్లి : అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లగొండ జిల్లా తుర్కపల్లి మండలం మోతిరామ్ తండాలో మంగళవారం చోటు చేసుకుంది. మోతిరామ్ తండాకు చెందిన భానోజు సంతోష్ (30) వ్యవసా యానికి చేసిన అప్పులు తీరకపోవడంతో మనోవేదనతో వ్యవసాయ బావి వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

యాదాద్రి హుండీ ఆదాయం రూ.1.03 కోట్లు

మన తెలంగాణ/యాదాద్రి : శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం స్వామి వారి హుండి లెక్కింపు మంగళవారం కొండపైన ఆలయ ఆవరణలో జరిగింది. రూ. 1కోటి 3లక్షల 74వేల 767 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధి కారి ఎన్.గీత తెలిపారు. బంగారం 0.39 గ్రాములు, వెండి 1కిలోల 970గ్రాములు కానుకల రూపంలో వచ్చినట్లు తెలిపారు. కాగా, స్వామివారి ఆలయం నిత్యరాబడిలో భాగం గా మంగళవారం 7 లక్షల 07 వేల 374 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మహిళ ఉద్యోగిని చేతివాటం : రిమాండ్‌కు తరలింపు

ఆలయ హుండీ లెక్కింపులో మహిళ ఉద్యోగి హుండీ డబ్బులను తస్కరించి దొరికిపోయింది. ఎసిపి శ్రీనివాసచార్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం కొండపైన స్వామి వారి ఆలయ హుండీ లెక్కింపులో పాల్గొన్న దేవస్థాన ఉద్యోగి జూనియర్ అసిస్టెంట్ కందాల సరోజ లెక్కింపులో చేతి వాటాన్ని ప్రదర్శించి డబ్బుతో సహా వాష్‌రూంకు వెళ్తానని నమ్మించి వెళ్ళడంతో మహిళ హోంగార్డు సరోజనుతనిఖీ చేయగా ఆమె వద్ద 27,280 రూపాయలు దొరికినట్లు తెలిపారు. ఆలయ ఈఓ గీత చేసిన ఫిర్యాదు మేరకు సరోజను రిమాండ్‌కు పంపినట్లు ఎసిపి తెలిపారు.

రైతాంగ సమస్యలపై పోరాటాలు

తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొ. కోదండరాం



మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి, త్వరలోనే పోరాటాలు చేపట్టేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొదించనున్నామని తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రైతు, నిరుద్యోగ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కనీసం పెట్టుబడులు కూడా వెళ్లలేని పరిస్థితుల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం ఎంత మాత్రం స్పందించడం లేదన్నారు. తెలంగాణలోని పాత 10 జిల్లాల్లో వ్యవసాయ రంగం, నిరుద్యోగంపై అధ్యయనం చేసి వచ్చే నెల 4న హైదరాబాద్‌లో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి, ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సదస్సులో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురిజాల రవీందర్‌రావు, టిజెఎసి జిల్లా చైర్మన్ బాబన్న, జిల్లా కన్వీనర్ పోడేటి సంజీవ్, వైస్ చైర్మన్‌లు సుధాకర్ పాల్గొన్నారు.

పిల్లల్లో ప్రతిభను వెలికితీస్తేనే నిజమైన టీచర్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేవారే నిజమైన ఉపాధ్యాయులు అని ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎంఎల్‌సి చుక్కా రామయ్య అన్నారు. ఎవరిలో ఏ ప్రతిభ దాగివుందో గుర్తించి, ప్రోత్సహించాలని సూచించారు. చుక్కా లక్ష్మీ భాయ్ (సిఎల్‌బి) అవార్డ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఒయులోని రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో జరిగిన 8వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చదువుకు, పేదరికానికి సంబంధం ఉందని తాను ఐఐటి కోచింగ్ కోసం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేక తిరుగుబాటు చేసి రాజు అనే విద్యార్థి ద్వారా తెలిసిందన్నారు. పేదరికం వల్ల పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన ఆ విద్యార్థిని తన ఇంట్లోనే ఉంచుకున్నానని, ప్రస్తుతం ఆయనే గ్రామాలలో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు సిఎల్‌బి పేరిట ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. సిఎల్‌బి నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన 54 మంది విద్యార్థులకు విద్యావేత్త సర్టిఫికెట్, మెమెంటో, నగదు బహుమతులు ప్రదానం చేశారు. సిఎల్‌బి అవార్డ్స్ కౌన్సిల్ కన్వీనర్ జూలూరి గౌరీశంకర్, ప్రొఫెసర్ కేదారీశ్వర్, ఇందిరాప్రియదర్శిని అవార్డు గ్రహీత నరేష్ చంద్ర భారత్, సిఎల్‌బి అడ్వయిజరీ కమిటీ చైర్మన్ ఎం.జానకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండగడప గ్రామస్తుల రాస్తారోకో

మోత్కూరు నగర పంచాయతీలో కొండగడపను విలీనం చేయవద్దని డిమాండ్



మోత్కూరు- తిరుమలగిరి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న కొండగడప గ్రామస్తులు

మన తెలంగాణ/మోత్కూరు : మోత్కూరు నగర పంచాయతీలో కొండగడప గ్రామ పంచాయతీని విలీనం చేయవద్దని డిమాండ్ చేస్తూ మంగళవారం కొండగడప గ్రామస్తులు మోత్కూరు తిరుమలగిరి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మోత్కూరు నగర పంచాయతీలో తమ గ్రామాన్ని విలీనం చేయాలనే ఆలోచనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నగర పంచాయతీ వద్దు గ్రామ పంచాయతీ ముద్దు అంటూ నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఎంపిడిఓ హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. గ్రామస్తులు ఎంపిటిసి ఎర్రబెల్లి పద్మనర్సయ్య, మాజి ఎంపిటిసిలు లెంకల వేణు, పి.యాదగిరి,మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి యాదయ్య, సిపిఐ గ్రామ కార్యదర్శి తొంట తిరుపయ్య, నాయకులు జి.రాం మోహనాచారి పాల్గొన్నారు. కాగా, గ్రామస్తులు ఎంపిడిఓ కె.వెంకటనర్సయ్య, జిల్లా పంచాయతీ అధికారి భిక్షంలకు వినతి పత్రాలను అందజేశారు.

కాల్వ నీళ్ల కోసం బిజెపి కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



మనతెలంగాణ / పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాకు కాల్వ నీళ్లను అందించి పంటలను కాపాడాలని మంగళవారం బిజెపి తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించనున్నారనే సమాచారంతో జిల్లాలోని పెద్దపల్లి,సుల్తానాబాద్,గోదావరిఖని,ధర్మారం తదితర ప్రాంతాలలో బిజెపి నాయకులను,ముఖ్య కార్యకర్తలను ఎక్కడి కక్కడే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణా రెడ్డిని దర్మారం మండలం కమ్మరిఖాన్ పేటలోని అరెస్ట్ చేసి దర్మారం పోలీస్ స్టేషన్‌కు తరలించగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసిపేట లింగయ్యను గోదావరి ఖనిలో అరెస్ట్ చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మీస అర్జున్ రావు,కర్ర సంజీవరెడ్డి, పిన్నింటి రాజు,పల్లె సదానందం తదితర ముఖ్య నాయకులను సోమవారం ఉదయం పెద్దపల్లిలో అరెస్ట్ చేశారు. పోలీసుల కళ్లుగప్పి ఉదయం 11 గంటలనుండి మధ్యాహ్నం 1 గంట వరకు విడతల వారీగా పలువురు బిజెపి శ్రేణులు కలెక్టరేట్ లోకి చొచ్చుకొని రావడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా పెనుగులాట జరిగింది. పోలీసులు బలవంతంగా వారిని వాహనాల్లో ఎక్కించి పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, కాల్వ నీళ్లకోసం రైతులు ఆందోళనలను ఉదృతం చేయనున్నారనే ముందస్తు సమాచారంతో ఈ నెల 23 నుండి వారం రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలో 144 సెక్షన్ విధించారు.



28న బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

మన తెలంగాణ / హైదరాబాధ్/ ముషీరాబాద్ : బిసి ఉద్యోగాలకు ప్రమో షన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బిసిల పై విధించిన క్రీమీలేయర్‌ను పూర్తిగా ఎత్తి వేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిర ప్రియదర్శిని ఆడిటోరియంలో బిసి ఉద్యోగాల రాష్ట్ర మమాసభను నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బిసి ఉద్యోగాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇ.నిరంజన్, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం హైదరాబాద్ దోమలగూడ బిసి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర బిసి ఉద్యోగాల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఇ.నిరంజన్ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి నారాయణ పలు తీర్మానాలను ప్రవేశ పెట్టారు. ప్రత్యేక ఆహ్వానితులుగా బిసి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్‌లు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించి ప్రమోషన్లలో రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో బిసి ఉద్యోగ సంఘాల రాష్ట్ర నేతలు ఎం.చంద్ర శేఖర్ గౌడ్, హెచ్.రేవంత్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీ: ఇద్దరు మృతి

12మందికి తీవ్ర గాయాలు

మన తెలంగాణ/తాండూరు రూరల్: కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కర్నాటక రాష్ట్రం చించోళి తాలుకా రుస్తుంపూర్ గ్రామానికి చెందిన పూజారి కుటుంబీకులు వికారాబాద్ జిల్లా, తాండూరు మండలం చింతామణిపట్నం గ్రామానికి ఓ శుభకార్యంలో పాల్గొనడానికి ఆటోలో వస్తుండగా అల్లాపూర్ సమీపంలో తాండూరు నుండి చించోళి వెళ్తున్న లారీ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న రమణ (50), నాగమ్మ (60)లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 12 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తాండూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

'జానా' కోటలో కారెక్కుతున్న కాంగ్రెస్ శ్రేణులు




మంత్రి సమక్షంలో టిఆర్‌ఎస్‌లో చేరిన నిడమనూరు ఎంపిపి

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది నాగార్జున సాగర్ నియోజకవర్గంలో కారెక్కే కాంగ్రెస్ శ్రేణులు సంఖ్య పెరుగుతూ వస్తోంది. మంగళవారం నిడమనూరు కాంగ్రెస్ ఎంపిపి దాసరి నర్సింహ్మ పలువురు సర్పంచ్‌లు తెలంగాణ భవన్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టిఆర్‌ఎస్‌లో చేరడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల స్థాయి నేతల వలసల సంఖ్య పెరిగినట్లయింది. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాజకీయ రంగప్రవేశం చేసిన కుందూరు జానారెడ్డి 7 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాదించారు. టిడిపి నుండి జానారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి మారినా విజయం ఆయననే వరిస్తూ వచ్చింది. 1994—99 తప్ప 1983 నుంచి ఇప్పటివరకు నాడు చలకుర్తి, నేడు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తూ వచ్చారు. జానా ఆత్మగా పేరుగాంచిన నలమోతు భాస్కర్ రావుకు మిర్యాలగూడ కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ ఇప్పించి ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో జానా కృషి చేసినా గెలిచిన తరువాత రాజకీయ గురువు జానాను వదిలి టిఆర్‌ఎస్ గూటికి చేరడంతో సాగర్ నియోజకవర్గ శ్రేణులు నివ్వెరపోయాయి. జానా ప్రభపై ఇది తీవ్ర ప్రభావం చూపింది. ఇదే సమయంలో సాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకత్వంపై టిఆర్‌ఎస్ దృష్టి సారించింది. నియోజకవర్గంలోని ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్పిటిసిలు ఇతర ప్రజా ప్రతినిధులను ఆకర్ష్ పథకంలో భాగంగా టిఆర్‌ఎస్‌లో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో త్రిపురారం, పెద్దవూర, హాలియా, గుర్రంపోడు ఎంపిపిలతో పాటు గుర్రంపోడు, త్రిపురారం, జడ్పిటిసిలు కూడా టీఆర్‌ఎస్‌లో చేరారు. నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన ఎర్రబెల్లి ఎంపిటిసి ఉప ఎన్నికలో టిఆర్‌ఎస్ అభ్యర్థి 563 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. మంగళవారం నిడమనూరు ఎంపీపీ, పెద్దవూర మండలం కొత్తలూరు సర్పంచ్ వద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, సిరసనగండ్ల సర్పంచ్ పవన్ కుమార్, నెల్లికల్లు మాజీ సర్పంచ్ జఠావత్ పంతులునాయక్‌లు మంత్రి సమక్షంలో టిఆర్‌ఎస్‌లో చేరడంతో రానున్న కాలంలో జానారెడ్డి రాజకీయ ఆధిపత్యానికి గండి పడుతుందా.. అనే విషయంపై జోరుగా చర్చ సాగుతోంది. కాగా గతంలో సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేసి కాసు బ్రహ్మానందరెడ్డి రికార్డును తిరగరాసిన జానారెడ్డి ఇక తన వారసత్వాన్ని రాజకీయ రంగ ప్రవేశం చేయిస్తారన్న ఊహాగానాలు నియోజకవర్గంలో ఊపందుకున్నాయి. జానా స్థానంలో లేదా మరో నియోజకవర్గం నుండి జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గం నుండి పార్టీ నుండి ఒక్కొక్కరుగా కారెక్కుతున్నప్పటికీ జానారెడ్డి ప్రేక్షకపాత్ర వహించారు. ఆయన అంతరంగంలో ఏముందో బయటకు చెప్పకపోవడంతో జానా కావాలనే మౌనం పాటిస్తున్నారా.. దాని వెనుక మరేదైనా మర్మం ఉందా అనేది రాజకీయ పరిశీలకులు చర్చించుకుంటున్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



మన తెలంగాణ/అంతర్గాం: పేదల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతూ వారి అభివృద్ధికి సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రామగుండం పట్టణంలో రూ.23 కోట్లతో నిర్మించిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని మంగళవారం ఆయన ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బాల్క సుమన్‌తో కలిసి ప్రారంభించారు. అక్కడ స్థానిక ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపి బాల్క సుమన్, స్థానిక ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన, జడ్పీచైర్మన్ తుల ఉమా, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ కొంకటి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేద్దాం

▶▶ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి లక్ష్మారెడ్డి



మన తెలంగాణ/బాలానగర్ : కాంగ్రెస్ నాయకులు అడ్డుపడడంతోనే నేటికీ తెలంగాణ రాష్ట్రం వెనుకపడిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఇప్పటికైనా రాష్టంలో కాంగ్రెస్ పార్టీని ఓడించి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడాలని అన్నారు. మంగళవారం నిర్వహించిన టిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటైతే తెలంగాణ రాష్ట్రం చీకటిగా మారుతుందని అప్పటి సిఎం కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పారని, కానీ ప్రస్తుతం 24 గంటల విద్యుత్‌ను ప్రజలకు అందిస్తున్న రాష్ట్రాన్ని చూసి కాంగ్రెస్ నాయకులు ఏం సమాధానం చెబుతారన్నారు. 70 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన ఆంధ్రపార్టీలు గిరిజనులను, తండాలను పట్టించుకోలేదన్నారు. రానున్న రోజు ల్లో తండాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు.పాలమూరు ఎత్తిపోతలతో పూర్వ వైభవం తేనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ఎంపిపి భాగ్యమ్మ, జడ్‌పిటిసి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మన తెలంగాణ
8
హైదరాబాద్
బుధవారం
24 జనవరి 2018
wraw.manatelangana.news

నాకు స్వతంత్ర భావాలు ఎక్కువ



''మొదటి నుంచి నాకు సినిమాల్లోకి వచ్చే ఉద్దేశం అస్సలు లేదు. అనుకోకుండా వచ్చాను. చిన్నతనం నుంచి మంచి సైకియాట్రిస్ట్‌ను కావాలన్నది నా కోరిక. అనుకోకుండా ఇలా హీరోయిన్ అయ్యాను''అని అంటోంది గాయని, నటి ఆండ్రియా. ''ప్రస్తుతం నాకు సంగీతం, నటన రెండూ ఇష్టమే. ఏదో ఒకటి చెప్పమంటే మాత్రం చాలా కష్టం. సంగీతాన్ని చిన్నతనం నుంచే నేర్చుకోవడం ప్రారంభించాను. నాటకాల్లో కూడా నటించాను. నాటకాల్లో నటించాలంటే చాలా సమయం కేటాయించాలి. రిహార్సల్స్ చాలా అవసరం. ఇప్పుడు అవన్నీ చేయడం కుదరడం లేదు. ప్రేమ, పెళ్లికి ప్రస్తుతం దూరం. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరకలేదు. అలాంటి వ్యక్తి కోసం వెతుకుతున్నాను. నాకు స్వతంత్ర భావాలు ఎక్కువ. నా భర్త అయినా సరే నా అవసరాలకు అతన్ని డబ్బు అడగడం నాకు ఇష్టం ఉండదు. నాకు సరిపడా సంపాదించిన తర్వాత పెళ్లి గురించి ఆలోచిస్తాను. అది ప్రేమ పెళ్లా లేదా పెద్దలు కుదిర్చిన పెళ్లా అనేది ఇప్పుడే చెప్పలేను''అని పేర్కొంది ఆండ్రియా.

నాకు రికార్డులు ముఖ్యం కాదు...
ఇండస్ట్రీ బాగుండాలి : బాలకృష్ణ



'జై సింహా' సక్సెస్‌మీట్‌లో బాలకృష్ణ, కె.ఎస్.రవికుమార్, సి.కళ్యాణ్‌తో డిస్ట్రిబ్యూటర్లు

నందమూరి బాలకృష్ణ హీరోగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'జై సింహా'. ఈ చిత్రం సంక్రాంతికి విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన సక్సెస్‌మీట్‌లో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ''జై సింహా చిత్రం 50 కోట్ల క్లబ్‌లో చేరడం సంతోషంగా ఉంది. నేను చెన్నైలో ఉన్నప్పుడు సినిమా కొన్నవాళ్ల మధ్య ఫంక్షన్స్ ఎక్కువగా జరిగేవి. అలాంటి సందర్భం ఈరోజు కనపడుతోంది. ఈరోజుల్లో నిర్మాతల పరిస్థితి తెలిసిందే. కానీ నేను భిన్నంగా నా సినిమా నిర్మాతలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను. గతంలో నేను సి.కళ్యాణ్‌తో కలిసి 'పరమవీరచక్ర' సినిమా చేశాను. ఆ సినిమాను నేషనల్ ఇంటిగ్రిటీ అవార్డు కూడా వచ్చింది. ఇప్పుడు 'జై సింహా' మంచి సక్సెస్‌ను సాధించింది. ఈ సక్సెస్‌తో చిత్ర బృందం ఆనందంగా ఉంది. నాకు రికార్డులు ముఖ్యం కాదు. ఇండస్ట్రీ బావుండాలి. అందరి బాగోగులను దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తాను. ఈ చిత్రంలో మంచి పాటలు, మాటలు, సంగీతం ఇలా అన్నీ చక్కగా కుదిరాయి. అందుకే ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు''అని అన్నారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''ఇంత గొప్ప సినిమాను నిర్మించడం గౌరవంగా భావిస్తున్నాను. పది రోజుల్లో 'జై సింహా' 50 కోట్లను వసూలు చేసింది. అందరి సహకారం వల్లే ఈ విజయాన్ని అందుకోగలిగాము''అని చెప్పారు. కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ ''అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తున్న ఈ చిత్రం ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం 100 కోట్లను సాధిస్తుందన్న నమ్మకముంది''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు పార్థసారధి రెడ్డి, శివారెడ్డి, ఫణి, రమేష్, విజయ్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొని సినిమా సక్సెస్ పట్ల తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు.


విజయ్‌చందర్, విక్రమ్, తమన్నా, డి.సురేష్‌బాబు

పాత విక్రమ్ వచ్చారని అంటున్నారు

విక్రమ్ కథానాయకుడిగా విజయ్‌చందర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'స్కెచ్'. తమన్నా కథానాయికగా నటించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. డి.సురేష్‌బాబు తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో విక్రమ్ మాట్లాడుతూ ''ఈ చిత్రం తమిళంలో పెద్ద హిట్ అయింది. తెలుగులో కూడా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. డి.సురేష్‌బాబు ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉంది. నేను ఎప్పుడూ విభిన్నమైన సినిమాలు చేస్తుంటాననే సంగతి తెలిసిందే. దాదాపు 15 ఏళ్ల తర్వాత ఈ కమర్షియల్ మూవీ చేశాను. ఈ సినిమాతో పాత విక్రమ్ వచ్చారని అందరూ అంటున్నారు. అలాగని ఇది రెగ్యులర్ కమర్షియల్ మూవీ కాదు. యదార్థ సంఘటనలతో తెరకెక్కించిన కమర్షియల్ మూవీ ఇది. దర్శకుడు విజయ్‌చందర్ సినిమాను చక్కగా తెరకెక్కించాడు. ప్రేక్షకులను ఎంతగానో అలరించే థ్రిల్లర్ మూవీ ఈ చిత్రం. ఇందులో రొమాన్స్ సీన్స్ అందరినీ ఆకట్టుకుంటాయి. చిన్న సందేశం కూడా ఉంటుంది''అని అన్నారు. తమన్నా మాట్లాడుతూ ''నాకు 'స్కెచ్' ప్రత్యేకమైన సినిమా. విక్రమ్‌తో కలిసి నటించాలన్న కోరిక ఈ చిత్రంతో తీరింది. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులకు సినిమా నచ్చుతుంది''అని తెలిపారు. విజయ్‌చందర్ మాట్లాడుతూ ''తమిళంలో స్కెచ్ చిత్రం ఘన విజయం సాధించింది. తెలుగులో కూడా పెద్ద సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను''అని పేర్కొన్నారు. డి.సురేష్‌బాబు మాట్లాడుతూ ''సెన్సార్ పూర్తి కాగానే సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాము. విక్రమ్ నాకు చాలా మంచి స్నేహితుడు. తను చిన్న రేంజ్ నుండి పెద్ద స్టార్‌గా ఎదిగారు. 25 ఏళ్ల క్రితం తనను కలిసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలాగే ఉన్నారు. ఈ చిత్రానికి తమన్ మంచి మ్యూజిక్ అందించారు. సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు.

సింపుల్ లవ్ స్టోరీ
మనసుకు నచ్చింది

ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ద్వారా మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం ఇటీవల సెన్సార్ పూర్తిచేసుకొని ఫిబ్రవరి 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యేందుకు సన్నద్ధమవుతోంది. హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర కథానాయిక అమైరా దస్తూర్ మాట్లాడుతూ ''సింపుల్ లవ్ స్టోరీ ఇది. గత సంవత్సరం దర్శకురాలు మంజుల నన్ను సంప్రదించారు. సినిమా కథ ఎంతగానో నచ్చి ఈ సినిమా చేశాను. ఈ క్యారెక్టర్ నాకు సరిగ్గా సరిపోతుంది. యోగా టీచర్‌గా నటించాను. ఫ్రెష్, రొమాంటిక్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ప్రేక్షకులకు ఒక మంచి సినిమా చూశామనే భావన కలుగుతుంది. దర్శకురాలు సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. తప్పకుండా సినిమా మంచి విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకముంది. ఈ చిత్రంతో తెలుగులో హీరోయిన్‌గా రాణిస్తాను''అని అన్నారు.


అమైరా దస్తూర్

గజదొంగ బయోపిక్‌లో రానా?


రానా

హిస్టారికల్ అయినా ఫాంటసీ అయినా లేదా డిఫరెంట్ జోనర్ అయినా అందరికీ రానానే బెస్ట్ ఛాయిస్‌గా మారుతున్నాడు. తాజాగా అలాంటి మరో సబ్జెక్ట్‌ను రానా ఓకే చేసినట్టు తెలిసింది. 70వ దశకంలో తన దొంగతనాలతో తెలుగు రాష్ట్రాన్ని వణికించిన గజదొంగ టైగర్ నాగేశ్వరరావు బయోపిక్‌లో నటించేందుకు రానా సిద్ధమయ్యాడని సమాచారం. స్టువర్టుపురం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు ఇళ్లు, దుకాణాలను చాకచక్యంగా లూటీ చేయడంలో ప్రసిద్ధిగాంచాడు. ఆ కాలంలోనే తిరుపతి, వైజాగ్, కాళహస్తి, హైదరాబాద్ వంటి పట్టణాల్లో నాగేశ్వరరావుపై లెక్కలేనన్ని కేసులు ఉండేవట. 1987లో జరిగిన ఒక పోలీస్ ఎన్‌కౌంటర్‌లో టైగర్ నాగేశ్వరరావు మరణించాడు. ఇప్పుడు ఈ కథతోనే రానా హీరోగా సినిమా రాబోతుందని టాక్. వంశీకృష్ణ దర్శకత్వంలో అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించనున్నాడని తెలిసింది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుందని సమాచారం.

సొంత బిడ్డలాగా చూసుకున్నారు


సమంత

'మిగిలిన అన్ని రంగాలలాగానే సినిమా కూడా చాలా మంచి ప్రొఫెషన్. కానీ కొందరు ఈ రంగాన్ని చిన్న చూపు చూస్తుంటారు. అలాంటివారిని గురించి విన్నప్పుడు నాకు చాలా బాధగా ఉంటుంది' అని చెప్పింది సమంత. ఈ ఈ అందాల తార మాట్లాడుతూ 'దర్శకులు, నటీనటులు తమ వృత్తిని గౌరవిస్తారు. షూటింగ్ స్పాట్‌లో ప్రతి ఒక్కరూ తాము చేస్తున్న సినిమా పట్ల అంకిత భావంతో మెలుగుతుంటారు. నేనిప్పటిదాకా పనిచేసిన ప్రతి సినిమా యూనిట్ సభ్యులు నన్ను సొంత బిడ్డలాగా చూసుకున్నారు. అందుకేనేమో షూటింగ్ స్పాట్‌లో నాకు అమ్మానాన్నలు గుర్తుకు రారు. 'షూటింగ్‌కు మీరెందుకు మీ తల్లిదండ్రులను వెంటబెట్టుకొని రారు' అని చాలా మంది అడుగుతుంటారు. అలాంటివారికి నేను చెప్పే సమాధానం ఒకటే. ఆఫీసులకు వెళ్లే అమ్మాయిలు వాళ్ల తల్లిదండ్రులను తోడుగా తీసుకెళ్తారా? మరి వారి విషయంలో లేనిది నటీమణుల విషయంలో ఎందుకు? కొంతమంది నాయికలు వాళ్ల అమ్మలతో షూటింగ్‌లకు వస్తుంటారు. అంతమాత్రాన నేను కూడా వారిని అనుసరించాల్సిన పని లేదు కదా''అని సమంత చెప్పింది.

ఆ ధోరణికి నేను వ్యతిరేకం

గ్లామర్ రంగంలో తమ సౌందర్యాన్ని కాపాడుకోవడానికి చాలా మంది తారలు ఆహారం విషయంలో అనేక నియమాలు పాటిస్తుంటారు. కొవ్వు పదార్థాలు, స్వీట్స్, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉంటున్నామని కొందరు అందాల భామలు చెబుతుంటారు. స్లిమ్‌గా మారేందుకు కడుపు మాడ్చుకుంటారు. కానీ ఈ ధోరణికి తాను పూర్తిగా వ్యతిరేకమని చెబుతోంది పంజాబీ సొగసరి తాప్సీ. స్వతహాగా భోజన ప్రియురాలైన ఈ సుందరి తనకు నచ్చిన ఫుడ్ కనిపిస్తే వెంటనే లాగించేస్తుందట. ఆహారం విషయంలో తనకు ఎలాంటి పట్టింపులు లేవని చెబుతోంది. ''ఆహార పదార్థాలను చూస్తూ నోరు కట్టేసుకొని కూర్చోవడం నాకు నచ్చదు. అదే నా బలహీనత. డైటింగ్‌కు నేను చాలా దూరంగా ఉంటాను. ఇండియన్, వెస్ట్రన్‌తో పాటు ప్రతి ఫుడ్ ఐటమ్‌ను ఇష్టంగా తింటాను. అందాన్ని కాపాడుకోవడానికి వ్యాయామాల పైనే ఆధారపడతాను. తినడం ఇష్టమే అయినా వంట మాత్రం అస్సలు రాదు. 12 ఏళ్ల వయసులో మొదటిసారి పాకశాస్త్రంలో నా పరిజ్ఞానాన్ని ఉపయోగించి టీ తయారు చేశాను. కానీ టీ అస్సలు బాగా లేకపోవడంతో మళ్లీ కిచెన్‌లో అడుగుపెట్టలేదు. ఇటీవలే అమ్మ మార్గదర్శకత్వంలో రజ్మా చావల్ తయారు చేయడం నేర్చుకున్నాను. అందులో ప్రావీణ్యాన్ని సంపాదించాను'' అని తాప్సీ చెప్పింది.


తాప్సీ

కొత్త మార్గాన్ని ఎంచుకోవాల్సిందే

పోర్న్‌స్టార్ అనే ముద్ర నుంచి బయటకొచ్చి బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన తార సన్నీలియోన్. ప్రస్తుతం ఈ భామ బాలీవుడ్‌లో తన బ్రాండ్ మార్చుకునే ప్రయత్నం చేస్తోందట. అందుకే తన వద్దకు వస్తున్న రొటీన్ అవకాశాలను సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు సమాచారం. దీనిపై సన్నీలియోన్ మాట్లాడుతూ ''జీవితంలో విజయాన్ని అందుకోవాలంటే ఖచ్చితంగా మూస ధోరణిలో కాకుండా కొత్త మార్గాన్ని ఎంచుకోవాల్సిందే. అంతేకాకుండా వ్యాపార రంగమైనా, వినోద రంగమైనా విజయాలను అందుకోవాలంటే తప్పకుండా రొటీన్‌కు భిన్నంగా అడుగులు వేసి మన పరిధిని విస్తరించుకోవాలి. నేను సినీ రంగంలోకి అనుకోకుండా వచ్చాను. సినిమాలు నాకు శాశ్వతం కాదు. జీవితాంతం చిత్ర పరిశ్రమలో ఉండలేను''అని పేర్కొంది. ఈ విషయంలో ఆమె కేవలం మాటల్లోనే కాదు... చేతల్లోకి కూడా దిగింది. ఇప్పటికే కొత్త రంగంలోకి అడుగుపెట్టిన సన్నీలియోన్ 'లస్ట్' పేరుతో సొంత పర్ఫ్యూమ్ బ్రాండ్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. మరి సన్నీలియోన్ భవిష్యత్‌లో ఇంకెన్ని రంగాల్లో తనదైన ముద్ర వేస్తుందో చూడాలి.


సన్నీలియోన్


కాజల్ అగర్వాల్

మన వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు

ప్రేమలో విఫలమైతే బాధపడకూడదు అని అంటోంది కాజల్ అగర్వాల్. తన వ్యక్తిగత అనుభవమో ఏమోకానీ ఈ భామ ప్రేమ గురించి చాలానే చెప్పింది. ''ఈ తరం యువత ప్రేమలో పడడం సర్వసాధారణంగా మారింది. అయితే అందరి ప్రేమ సక్సెస్ కావడం లేదు. అలాగని ప్రేమలో విఫలమైన వారు ఇక జీవితమే లేదని బాధపడకూడదు... అది కరెక్ట్ కాదు. అలాంటి మానసిక వేదన నుంచి బయటపడాలి. ప్రేమించడం... ప్రేమించబడడం సహజం. ప్రేమించుకున్న వాళ్లందరూ పెళ్లి పీటలెక్కడం లేదు. సామాజికపరమైన అంశాలు, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వంటి అంశాలు కొందరి విషయంలో ఆటంకంగా మారుతున్నాయి. ప్రేమలో పడడంలాగే ప్రేమలో విఫలమవడం కూడా సాధారణ విషయమే. ప్రేమలో పడ్డా కూడా మనం ఏమిటన్నది మరచిపోకూడదు... మన వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు. మన ప్రాధాన్యతను ప్రేమ తగ్గించకూడదు. ప్రేమించిన వ్యక్తే జీవితం అనే స్థాయికి వెళ్లరాదు. ఒక వేళ ప్రేమలో విఫలమైనా అందుకు బాధపడకూడదు. దాని నుంచి వెంటనే బయటపడవచ్చు''అని చెబుతోంది కాజల్.

మన తెలంగాణ
9
హైదరాబాద్
బుధవారం
24, జనవరి 2018
www.manatelangana.news



రైస్ ఫండ్ బోర్డులో చేరిన ఆనంద్ మహీంద్రా

న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా 'ద రైజ్ ఫండ్' బోర్డులో చేరారు. గ్రోత్ ద్వారా నిర్వహించే 2 బిలియన్ డాలర్ల గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను టిపిజి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందన్నారు. ప్రధాని నరేంద్రమోడీపై ప్రశంసల జల్లు కురిపించారు. సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు చేసినప్పటికీ.. ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటోందని ఆయన పేర్కొన్నారు. దాదాపు 20ఏళ్ల తర్వాత(దావోస్) మోడీ ఇక్కడికి వస్తున్నారు. ఆయన చాలా తెలివైన వారు. భారత్ సత్తా ఏమిటో తెలియజెప్పేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక వంటి మంచి అవకాశాన్ని మోడీ వదులుకోవాలని అనుకోవడం లేదని ఆయన వెల్లడించారు. ఓ వ్యాపారవేత్తగా చెబుతున్నాను, ఇది చాలా మంచి ఆలోచన. కొన్ని రోజుల తర్వాత ప్రజలు వెనక్కి తిరిగి చూసుకుంటే.. మోడీనే కరెక్ట్ అని అంటారని మహీంద్రా పేర్కొన్నారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో భారత్‌కు చెందిన పలువురు సిఇఒలు పాల్గొంటున్నారు. భారత్ ఒక బహిరంగ ఆర్థిక వ్యవస్థ అని డబ్ల్యూఈఎఫ్‌కు అర్థమయ్యేలా సంకేతాలు పంపాల్సిన అవసరం ఉందని బ్యాంకర్ ఉదయ్ కొటక్ అన్నారు. సరికొత్త భారత్‌ను నిర్మిస్తున్నామని చెప్పడానికి మన దేశానికి ఇది ఒక గొప్ప అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు.

భారత్ అంటే బిజినెస్





- అపారమైన అవకాశాలు ఉన్నాయి
- అంతర్జాతీయ సిఇఒలతో ప్రధాని మోడీ

దావోస్ : భారత్ అంటే బిజినెస్.. అంతర్జాతీయ వాణిజ్యానికి తమ దేశంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని దావోస్‌లో నిర్వహించిన సిఇఒల సదస్సులో ప్రధాని మోడీ పేర్కొన్నారు. విందుకు ముందు 'ఇండియా మీన్స్ బిజినెస్' అనే ట్యాగ్‌లైన్‌తో నిర్వహించిన రౌండ్ టేండ్ సమావేశంలో మోడీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని.. భారత్ విజయ గాథను వివరించారు. మోడీ వెంట విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి విజయ్ గోఖలే, విదేశాంగ కార్యదర్శి జైశంకర్, డిఐపిపి(పరిశ్రమ పాలసీ, ప్రోత్సాహక విభాగం) కార్యదర్శి రమేష్ అభిషేక్‌తో సహా అనేకమంది ప్రభుత్వ అధికారులు ఉన్నారు. ఇండియా మీన్స్ బిజినెస్(భారత్ అంటే బిజినెస్) అనే పేరుతో నిర్వహించిన సిఇఒల సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొన్నారని.. భారత్ చేపట్టిన కార్యక్రమాలు, విజయాల గురించి వివరించారని అధికార ప్రతినిధి రవీష్ కుమార్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. భారత్‌లో అంతర్జాతీయ వ్యాపారానికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని మోడీ అన్నారు. 20 ఏళ్ల తర్వాత తొలిసారిగా భారత్ నుంచి ప్రధాని నరేంద్ర మోడీ దావోస్‌లో డబ్ల్యుఇఎఫ్(వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్)లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ, ఎయిర్‌బస్ సిఇఒ డిర్క్ హోక్ సహా 40 అంతర్జాతీయ కంపెనీలు, 20 భారతీయ కంపెనీల నుంచి ఉన్నతాధికారులు మోడీ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోడీ.. భారత్‌లో సులభతర వ్యాపారానికి చేపట్టిన సంస్కరణల గురించి వివరించారు. భారత్‌లో వ్యాపారం సరళతరం చేసేందుకు ఎన్నో విధానాలు చేపట్టామని, ప్రభుత్వంతో పనులు తొందరగా పూర్తయ్యే విధానంపై తాను దృష్టి పెట్టానని ప్రధాని పేర్కొన్నారు. సోమవారం ప్రధాని స్విస్ ప్రెసిడెంట్ అలైన్ బర్సెట్‌ను కూడా కలిశారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ప్రధాని మోడీ ప్రసంగంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. తీవ్రవాదం, స్వదేశీ వస్తు రక్షణ విధానంలో అందులో ఉన్నాయి.



కాగా దావోస్‌లో డబ్ల్యుఇఎఫ్(వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్) సదస్సుకు ముందు ప్రపంచ ఆర్థిక దృక్పథంపై ఐఎంఎఫ్ నివేదిక విడుదల చేసింది. 2018 సంవత్సరంలో భారత్ జిడిపి వృద్ధి రేటు 7.4 శాతం ఉంటుందని ఐఎంఎఫ్(అంతర్జాతీయ ద్రవ్య నిధి) అంచనా వేసింది. నోట్ల రద్దు, జిఎస్‌టి కారణంగా గత ఏడాదిలో వృద్ధి మందగించినా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ముందుందని వెల్లడించింది. భారత్ జిడిపి వృద్ధి రేటు 2018లో 7.4 శాతం, 2019 7.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇదే సమయంలో చైనా వృద్ధి రేటు 2018లో 6.8 శాతం, 2019లో 6.4 శాతంగా ఉంటుందని పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న ఆసియా వృద్ధి 2018–19లో 6.5 శాతంగా ఉండనుందని, 2017లో ఇదే రీతిలో వృద్ధి ఉందని ఐఎంఎఫ్ వెల్లడించింది. ప్రస్తుతం భారత్‌లో మందగమనం తాత్కాలికమేనని, ఆ తర్వాత వృద్ధిలో భారత్ అగ్రస్థానంలో ఉండనుందని ఐఎంఎఫ్ ప్రతినిధి అన్నారు. దావోస్‌లో డబ్ల్యుఇఎఫ్ వేడుకకు భారత్ నుంచి పలు కంపెనీల సిఇఒలు హాజరయ్యారు. కోటక్ మహీంద్రా బ్యాంక్ సిఎండి ఉదయ్ కోటక్ మాట్లాడుతూ, దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌కు హాజరైన ఆయన భారత్‌ను విక్రేతగానే కాదు.. రాజనీతిజ్ఞుడిగా చూపాలని అన్నారు.

భారత్ గురించి తెలియజేయడం ద్వారా అంతర్జాతీయంగా ప్రాధాన్యత పెరగనుందని అన్నారు. దావోస్‌లో భారత్ గొప్ప స్టోరీని చేప్పనుందని, ఇది చెప్పడానికి ప్రధాని నరేంద్ర మోడీ కంటే గొప్పవాళ్లెవరు ఉంటారని అన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ అన్నింటా అభివృద్ధిని సాధిస్తోందని దావోస్ ఐసిఐసిఐ బ్యాంక్ సిఇఒ చందా కొచ్చర్ అన్నారు. అన్ని రంగాల్లో వృద్ధి పథాన భారత్ ముందుకు సాగుతోందని, 2018 ద్వితీయార్థంలో భారత్ 7 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2018 సంవత్సరం భారత్ మరింత వృద్ధిని అందివ్వనుందని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. దావోస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి భారత్ నుంచి అనేక మంది ప్రతినిధులు హాజరయ్యారు. బిజినెస్, పాలిటిక్స్, కళలు, విద్య, పౌర సమాజం నుంచి 3 వేల మంది ప్రపంచ నేతలు 48వ డబ్ల్యుఇఎఫ్(వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్)కు హాజరయ్యారు.

10 శాతం వృద్ధిని సాధించే సామర్థ్యం భారత్‌కు ఉంది



న్యూయార్క్: పది శాతం వృద్ధి రేటును సాధించగలిగే సామర్థ్యం భారత్‌కు ఉందని నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్లలో భారత్ ఆర్థిక వృద్ధి 7.5 శాతం నమోదైందని, అయితే రెండు కీలక సంస్కరణలు నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు వల్ల వృద్ధి రేటు మందగించిందని ఆయన అన్నారు. న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ 10 శాతం వృద్ధి రేటును సాధించాలంటే అందుకు కార్మిక చట్టాలు, భూసేకరణ చట్టాల్లో ప్రధాన సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి భారత్ 6.5శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. 8 శాతం వృద్ధి రేటును భారత్ సాధించనుందనడంలో ఎటువంటి అనుమానం లేదని, ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకుంటోందనే విషయంలో సందేహం లేదని అన్నారు. రెండంకెల వృద్ధిని సాధించాలంటే కార్మిక, భూసేకరణ చట్టాల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, చైనా వృద్ధి రేటు ఐదు శాతానికి పడిపోతుందని పనగారియా తెలిపారు. బడ్జెట్ గురించి ప్రస్తావిస్తూ.. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో చాలా తేడాలు ఉంటాయని, ఇది సంస్కరణల ఆధారిత బడ్జెట్ అని అన్నారు. ప్రధాని మోడీ ఎన్నికలకు ముందు ప్రజాకర్షక మార్గాన్ని అనసరించవద్దని ఆయన సూచించారు.

త్వరలో సామ్‌సంగ్ గెలాక్సీ జె8(2018)

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ నుంచి సరికొత్త ఫోన్ గెలాక్సీ జె8 (2018) త్వరలో మార్కెట్లోకి రానుంది. కొన్ని వెబ్‌సైట్లలో ఈ కొత్త ఫోన్ స్పెసిఫికేషన్‌ల గురించి ఊహాగానాలు వెలువడ్డాయి. దీని ధర వివరాలను ఇంకా వెల్లడించలేదు. అయితే కొన్ని వెబ్‌సెట్ల సమాచారం ప్రకారం, దీనిలో 5.5 ఇంచ్ హెచ్‌డి తెర, ఆక్టాకోర్ ప్రాసెసర్, 4జిబి ర్యామ్, 32జిబి స్టోరేజ్, 256 జిబి ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, బ్లూటూత్ 4.2, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, డ్యుయల్ సిమ్, 13, 8 మెగాపిక్సల్ బ్యాక్, ఫ్రంట్ కెమెరాలు, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జి విఒఎల్‌టిఇ, 3000 ఎంఎహెచ్ బ్యాటరీ సామర్థ్యం వంటివి ఉన్నాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	36139.98	341.97	(0.96%)
నిఫ్టీ	11083.70	117.50	(1.07%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28820	30823.53	0.14%
ముంబై	29500	31550.80	– 0.03%
ఢిల్లీ	29100	31122.99	0%
కోల్‌కతా	29610	31668.45	0.41%
కేరళ	27850	29786.10	0%
బెంగళూరు	28200	30160.43	–0.11%
హైదరాబాద్	28860	30866.31	0.28%
గల్ఫ్	1418.86	1517.50	0.17%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	42000.00	42000.00	0.00
ముంబై	42000.00	42000.00	0.00
ఢిల్లీ	42000.00	42000.00	0.00
కోల్‌కతా	42000.00	42000.00	0.00
హైదరాబాద్	42000.00	42000.00	0.00




కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	412
వరంగల్	404	చిత్తూరు	403
విజయవాడ	412	చెన్నై	410
గోదావరి	412	బెంగళూరు	408

నిఫ్టీ@11000



- 340 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్



న్యూఢిల్లీ : దలాల్ స్ట్రీట్ ఆనందానికి అవధుల్లేవు.. భారత్ ఈక్విటీ మార్కెట్లు మరోసారి సరికొత్త శిక్షరాలకు చేరి చరిత్ర సృష్టించాయి. మెటల్స్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ స్టాక్స్ కౌంటర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో మార్కెట్ సూచీలు పరుగులు పెట్టాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ సూచీ 36,000 మార్క్, నిఫ్టీ 11,000 పాయింట్ల మార్క్‌ను దాటి జీవితకాల గరిష్టాన్ని చేరుకున్నాయి. వచ్చే వారం కేంద్ర బడ్జెట్‌పై సానుకూల ఆశలు, ఐఎంఎఫ్(అంతర్జాతీయ ద్రవ్య నిధి) అంచనాలు భారత్‌కు అనుకూలంగా ఉండడంతో సహా కార్పొరేట్ ఫలితాలు మెరుగ్గా ఉండడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 341.97 పాయింట్లు లాభపడి 36,140 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 117 పాయింట్లు లాభపడి 11,083 పాయింట్లను చేరుకుంది. నిఫ్టీ 10,995–11,093 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. నిఫ్టీలో మీడియా రంగ సూచీ తప్ప ప్రధాన సూచీలన్నీ లాభాల్లో ముగియగా, నిఫ్టీ మెటల్ సూచీ 4 శాతానికి పైగా ర్యాలీ చేసింది. కీలకమైన నిఫ్టీ బ్యాంక్ 27,422.05 పాయింట్లతో ఆల్‌టైం గరిష్టానికి చేరి 27,390 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇలో వేదాంతా లిమిటెడ్, గెయిల్, ఎస్‌బిఐ, హిందాల్కో, టాటాస్టీల్ షేర్లు 3 నుంచి 4 శాతం మేరకు లాభపడ్డాయి. ఐషర్ మోటార్స్, అంబుజా సిమెంట్, జి ఎంటర్‌టైన్‌మెంట్స్, విప్రో, భారతీ ఇన్‌ఫ్రాటెల్ షేర్లు నష్టపోయాయి.

మెటల్, పీఎస్‌యూ బ్యాంక్స్ జోరు : మెటల్, పిఎస్‌యు బ్యాంక్స్ భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఐటి, ఫార్మా, ప్రైవేట్ బ్యాంక్స్ 1.2 శాతం మేరకు బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో వేదాంతా, గెయిల్, ఎస్‌బిఐ, హిందాల్కో, టాటా స్టీల్, సిప్లా, ఒఎన్‌జిసి, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్, ఐసిఐసిఐ 5.23 శాతం మధ్య ఎగశాయి. మార్కెట్ల బాటలో బిఎస్‌ఇలో మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం ఎగసింది. ట్రేడైన మొత్తం షేర్లలో 1349 లాభపడగా, మిగతా 1539 షేర్లు నష్టపోయాయి. నగదు విభాగంలో సోమవారం ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) రూ. 1567 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టగా, దేశీ ఫండ్స్(డిఐఐ) రూ.462 కోట్ల విలువైన స్టాక్స్ సేల్ చేశాయి.

జియో రిపబ్లిక్ డే ఆఫర్

ముంబయి : రెండు వారాల్లో రెండోసారి రిలయన్స్ జియో టారిఫ్ ప్లాన్లను సవరించింది. ఎయిర్‌టెల్ ఇటీవల ప్రకటించిన ఆఫర్లకు పోటీగా అదనంగా 500 ఎంబి డేటాను అందించే ఆఫర్‌ను ప్రకటించింది. అన్ని ప్యాక్‌లపై 50 శాతం ఎక్కువ డేటా లభించనుంది. రిపబ్లిక్ డే నుంచి ఈ ప్లాన్లు అందుబాటులోకి రానున్నాయి. రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటించిన ఆఫర్లలో రూ.98తో జియో కొత్త ప్యాక్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త ప్యాక్‌పై అపరిమిత కాలింగ్‌ను, 2జిబి డేటాను 28 రోజుల పాటు అందించనున్నట్టు ప్రకటించింది. అంతేకాక సమీక్షించిన ప్లాన్లపై రోజుకు 1జిబి డేటా బదులు 1.5 జిబి డేటాను, 1.5 జిబి డేటా ప్యాక్స్‌పై 2 జిబి డేటాను ఆఫర్ చేయనున్నట్టు తెలిపింది. దీంతో రూ.149,రూ.349,రూ.399,రూ.449ప్యాక్‌లపై42జిబి, 105 జిబి, 126జిబి, 136జిబి డేటాను అందివ్వనుండగా, ఇవి వరుసగా 28 రోజులు, 70 రోజులు, 84 రోజులు, 91 రోజుల వ్యాలిడిటీ ఉండనున్నాయి. ఈ ప్యాక్‌లపై అంతకముందు రోజు కు 1 జిబి డేటానే ఉండేది. ప్రస్తుతం 1.5జిబి డేటాను జియో ఆఫర్ చేయనుంది. అంతేకాక 1.5జిబి డేటా ప్యాక్‌లైన రూ. 198, రూ. 398, రూ.448, రూ.498 ప్యాక్‌లపై రోజుకు 2జిబి చొప్పున 56జిబి, 140జిబి, 168జిబి, 182జిబి డేటా లభించనుంది.



ఎంపిసి పనితీరు భేష్

- వడ్డీ రేట్లపై ఉర్జిత్ నిర్ణయాలు సరైనవే
- ఉర్జిత్‌కు రఘురాం రాజన్ ప్రశంసలు

న్యూఢిల్లీ : ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ)ని మాజీ ఆర్‌బిఐ గవర్నర్ రఘురాం రాజన్ ప్రశంసించారు. వడ్డీ రేట్లను గరిష్ఠ స్థాయిలోనే కొనసాగించ వల్ల ప్రభుత్వ సలహాదారుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న ఎంపిసి పట్ల ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఉర్జిత్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ప్యానెల్ ఉత్తమ పనితీరును ప్రదర్శిస్తోందని, ద్రవ్యోల్బణం విషయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటోందని మంగళవారం బ్లూమ్‌బర్గ్ టీవీ ఇంటర్వ్యూ లో ఆయన అన్నారు. అత్యధిక ద్రవ్యోల్బణ ఒత్తిడితో బాధపడుతున్న దేశాలకు ధరల లక్ష్యాలు వినియోగకరమని అన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సాయం లేకుండా ముందుకెళ్లలేమన్న విషయాన్ని పాశ్చాత్య దేశాలు గుర్తించాలని రాజన్ అన్నారు. ఏ దేశాన్ని నేరుగా ప్రస్తావించకుండా పాశ్చాత్య విధానాలపై డబ్ల్యుఇఎఫ్(వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్) సదస్సుకు హాజరైన రాజన్ ప్రసంగించారు. పాశ్చాత్య దేశాల ఉత్పత్తులకు అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచే డిమాండ్ ఎక్కువగా ఉంటుందని గమనించాలని, అభివృద్ధి చెందుతున్న దేశాల అండ లేకుండా పాశ్చాత్య దేశాలు ఎంతోకాలం మనుగడ సాధించలేని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు సాధించే ప్రయోజనాలను కూడా వర్ధమాన దేశాలతో పంచుకోవాలని, పాశ్చాత్య దేశాల దృక్ప థం వీలైనంత త్వరగా మంచిగా మారాలని, లేదంటే ఈ ముక్కలైన ప్రపంచంలో ఏర్పడే సమస్యలను ఎవరూ పరిష్కరించలేరని రాజన్ అన్నారు. ఆదాయ అసమానతల వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి సింగపూర్ లాంటి దేశాలు కొన్ని చర్యలు చేపడుతున్నాయని రాజన్ తెలిపారు.

టాప్ గెయినర్స్ (+)


కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
పిఎన్‌బి	187.70	175.55	185.90	175.80	10.10	5.75
హావెల్ ఇండియా	587.80	563.65	583.25	552.15	31.10	5.63
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	299.10	278.45	293.55	278.80	14.75	5.29
వేదాంత	349.90	328.50	342.90	326.60	16.30	4.99
బ్యాంక్ ఆఫ్ బరోడా	173.90	164.60	173.15	165.00	8.15	4.94
సాయిల్	98.45	92.65	96.60	92.35	4.25	4.60
ఎం&ఎం ఫైనాన్షియల్	511.20	489.00	507.85	488.35	19.50	3.99
ఎస్‌బిఐ	319.95	306.25	318.00	306.25	11.75	3.84
హిందాల్కో	270.65	256.25	264.80	255.10	9.70	3.80
టాటా స్టీటల్	786.85	752.90	780.05	752.10	27.95	3.72

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
జీ ఎంటర్‌టైన్	606.00	589.95	593.80	609.15	15.35	2.52
అంబుజా సిమెంట్	268.85	262.50	263.00	268.80	5.80	2.16
కెడిలా హెల్త్	441.60	426.30	430.30	439.35	9.05	2.06
ఐషర్ మోటార్	27,725.10	27,075.00	27,112.90	27,652.00	539.10	1.95
ఎసిసి	1,830.00	1,787.00	1,793.95	1,829.10	35.15	1.92
విప్రో	322.75	313.95	315.10	320.80	5.70	1.78
అపోలో ఆసుపత్రి	1,169.85	1,140.70	1,147.35	1,164.90	17.55	1.51
హెచ్‌పిసిఎల్	405.40	392.10	395.70	401.75	6.05	1.51
కోల్గేట్	1,174.00	1,148.95	1,154.70	1,171.30	16.60	1.42
కంటెయినర్ కార్ప్	1,495.85	1,460.00	1,467.05	1,487.95	20.90	1.40

మన తెలంగాణ
10
హైదరాబాద్
బుధవారం
24, జనవరి 2018
www.manatelangana.news

జమిలి ఎన్నికలకు చాలా సమయం పడుతుంది : కొత్త సిఇసి రావత్



న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలకు చట్టబద్ధమైన ప్రక్రియ అవసరమని, అది సిద్ధమయ్యేందుకు చాలా సమయం పడుతుందని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్(సిఇసి) ఓమ్ ప్రకాశ్ రావత్ అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలు, లోక్‌సభకు ఏకకాల ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నో లాభాలుంటాయని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే సిఇసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2019లో జమిలి ఎన్నికలు నిర్వహించబోతున్నామా, లేదా? అన్నదానిపై స్పష్టమైన ప్రకటన చేయడానికి తాను సరియైన వ్యక్తిని కాదని అన్నారు. మంగళవారంనాడిక్కడ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం రావత్ మీడియాతో మాట్లాడారు. 'బండికి ముందు గుర్రాన్ని కట్టలేం. చట్టానికి రూపకల్పన జరగనంత వరకు మేం ఏమీ మాట్లాడలేం. చట్టం చేయడానికి కూడా చాలా సమయం పడుతుంది. అందుకోసం రాజ్యాంగ సవరణ అవశ్యం. ఇదంతా జరగడానికి సమయం తప్పదు' అని వ్యాఖ్యానించారు. ఒక్కసారి చట్టానికి రూపకల్పన జరిగితే ఇసి కూడా తన అభిప్రాయన్ని చెబుతుందన్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని జమిలి ఎన్నికలపై అభిప్రాయాన్ని కోరిందన్నారు. అయితే రాజ్యాంగ, ఎన్నికల చట్టాలకు సవరణ అవసరమని ఇసి అప్పుడే చెప్పిందన్నారు. ఇవిఎంలు, నిధులతో పాటు సరంజామాను సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు.

హైకోర్టుకు ఆప్ ఎంఎల్‌ఎలు

న్యూఢిల్లీ : లాభదాయకమైన పదవుల్లో కొనసాగి అనర్హతకు గురైన 20 మంది ఆప్ ఎంఎల్‌ఎలు మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. తమపై అనర్హత వేటును సవాల్ చేస్తూ, అత్యవసరంగా విచారించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, ఎ.కె.చావ్లాలతో కూడిన ధర్మాసనం ఎదుట ఉంచారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రానుంది. ఢిల్లీ శాసన సభ్యులు 20 మందిపై అనర్హత వేటు వేస్తూ జారీ అయిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ అత్యవసరం విచారించాల్సివున్నందున అడ్వకేట్ మనీష్ వశిష్ట్ విచారణ చేపట్టనున్నారు. జాతీయ రాజధాని ఢిల్లీ ప్రభుత్వం కింద ఎంఎల్ఎలుగా ఉన్న తమను లాభదాయక పదవులు పొందారని అనర్హులుగా ప్రకటిస్తూ రాష్ట్రపతి జారీ చేసిన నోటిఫికేషన్‌పై స్టే విధించాలని, ఆ ఉత్వర్వులను రద్దు చేయాలని ఎంఎల్‌ఎలు ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ప్రభుత్వ మెప్పుకోసమే రాష్ట్రపతికి ఇసి సిఫార్సు : సిపిఐ

న్యూఢిల్లీ : ఎన్‌డిఎ ప్రభుత్వం మెప్పు పొందేందుకే లాభదాయక పదవుల్లో ఉన్నారని ఆప్ ఎంఎల్‌ఎలపై చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్రపతికి మాజీ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇసి) సిఫార్సు చేశారని సిపిఐ విమర్శించింది. ఎన్నికల సంఘం, ప్రత్యేకించి సిఇసి ఎ.కె.జోతి ఎన్‌డిఎ ప్రభుత్వ మన్నన కోసం రాజకీయకోణంలో ఎంఎల్‌ఎలపై అనర్హత వేటు వేయాలని సిఫార్సు చేశారని సిపిఐ నేడొక ప్రకటనలో పేర్కొంది. ఆప్ ఎంఎల్‌ల వాదనను వినడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఎన్నికల సంఘం వ్యవహరించిందని, వారిని అనర్హులుగా ప్రకటించాలంటూ ఏకపక్షంగా, హడావుడిగా తీసుకున్న నిర్ణయమని విమర్శించింది. సిఇసి పదవీ విరమణకు ఒక రోజు ముందు ఎంతో హడావుడిగా ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపింది.

గవర్నర్‌గా ఆనందిబెన్ ప్రమాణం



భోపాల్ : సీనియర్ బిజెపి నేత ఆనందిబెన్ పటేల్ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. మంగళవారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆనందిబెన్‌తో రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ హెమంత్ గుప్తా ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్రమంత్రులు, ఇతర నాయకులు హాజరయ్యారు. అంతకుముందు చీఫ్ సెక్రెటరీ బసంత్ ప్రతాప్ సింగ్ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఆనందిబెన్‌ను నియమిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జారీ చేసిన ఉత్తర్వులను చదివి వినిపించారు. ఆనందిబెన్ గుజరాత్ ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. ఇక మీదట ఎంపి గవర్నర్‌గా పూర్తి సమయం పనిచేయనున్నారు.


'పద్మావత్'పై స్టేకు నిరాకరణ

న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో బాలీవుడ్ చిత్రం 'పద్మావత్'ను విడుదల చేయాలన్న తన ఉత్తర్వులను సవరించేందుకు మంగళవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను ప్రజలు అర్థం చేసుకుని దానికి కట్టుబడి ఉండాలని పేర్కొంది. జనవరి 18న రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో చిత్రం విడుదలపై ఉన్న నిషేధాన్నిఎత్తివేసిన కోర్టు దేశ వ్యాప్తంగా చిత్రం విడుదలకు మార్గం సుగమం చేసింది. ఇందుకు సంబంధించి రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఎఎం ఖాన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. తమ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రాలు నడుచుకోవాలని, ఆ తర్వాత సమస్యలేమైనా ఉంటే తమను సంప్రదించే స్వేచ్ఛ ఉందని న్యాయస్థానం పేర్కొంది. చిత్రం నిషేధంపై శ్రీ రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన, అఖిల భారతీయ క్షత్రియ మహాసభల పిటిషన్లను కూడా అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయొద్దు

కొహిమా: ఫిబ్రవరి 27న జరిగే నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు పోటీ చేయొద్దని, ముందు తీవ్రవాదానికి పరిష్కారం కనుగొనాలని నాగా మదర్స్ అసోసియేషన్(ఎన్ఎంఎ) మంగళవారం వినతి చేసింది. నాగా ప్రజలకు తీవ్రవాదానికి పరిష్కారం కావాలే కానీ ఎన్నికలు కాదని ఎన్ఎంఎ కార్యదర్శి లోచంబేని హంత్సో అన్నారు. నాగా స్టూడెంట్స్ ఫెడరేషన్ నిర్వహించిన ర్యాలీలో ఆమె ఈ విషయాన్ని చెప్పారు. శాశ్వత శాంతి అనేది మార్పును, ఐక్యతను తెస్తుందని... నాగా మాతృమూర్తులు దీనినే కోరుకుంటున్నారని ఆమె అన్నారు. ఎన్నికలకు నాగా ప్రజలు వ్యతిరేకం అని, ఎన్నికలను వాయిదా వేయాలని ఎన్ఎంఎ మెమొరాండం కూడా సమర్పించిందన్నారు.

పురుషులను శిక్షించే ఎత్తుగడ : ఒవైసి



ఔరంగాబాద్: ముస్లిం వ్యతిరేక కుట్రలో భాగమే ట్రిపుల్ తలాఖ్ బిల్లు అని, ఈ వర్గానికి చెందిన పురుషులను శిక్షించేందుకేనని ఎఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మహిళలను రోడ్లపైకి తీసుకొచ్చి, పురుషులను జైల్లో పెట్టాలనే ఎత్తుగడ అని ఔరంగాబాద్‌లో సోమవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ఆరోపించారు. పద్మావత్ చిత్రం వివాద పరిష్కారినికి కమిటీ వేసి, ట్రిపుల్ తలాఖ్‌పై ఎందుకు వేయలేదని కేంద్ర ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విడాకులిచ్చేందుకు తక్షణ ట్రిపుల్ తలాఖ్ మార్గాన్ని ఎంచుకునే వారిని సమాజం నుంచి బహిష్కరించాలని ముస్లింను కోరారు. బడ్జెట్‌లో ముస్లిం మహిళ సంక్షేమానికి రూ. 2 వేల కోట్లు కేటాయించాలన్నారు. ముస్లింలు లేని భారత్‌దేశాన్ని బిజెపి కోరుకుం టోందని, అది జరగదని ఒవైసీ పేర్కొన్నారు. ఇప్పటికైనా ముస్లింలు, దళితులు మేల్కొని అన్యాయానికి వ్యతిరేకం గళమెత్తాలని ఆయన కోరారు. ఇతరులు చేసిన అభివృద్ధిని తనదిగా చెప్పుకోవడం తప్ప ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి చేసిందేమీలేదన్నారు.

పశ్చిమాసియాపై ప్రధాని మోడీ దృష్టి

న్యూఢిల్లీ: ఆసియాన్ దేశాలకు ఆతిథ్యమిచ్చిన తర్వాత ప్రధాని మోడీ పశ్చిమాసియాపై దృష్టిసారించారు. ఫిబ్రవరి రెండోవారంలో ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, పాలస్తీనాలో పర్యటించనున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొనేందుకు దావోస్‌కు వచ్చిన ప్రధాని, తన పర్యటనలో భాగంగా భద్రత, వాణిజ్య వ్యూహాత్మక రంగాలలో సహకారంపై చర్చించే అవకాశం ఉంది. ఫిబ్రవరి 10న మోడీ పాలస్తీనాలో పర్యటించే అవకాశం ఉంది. ఇజ్రాయెల్ ప్రధాని భారత్‌లో పర్యటించిన నెల రోజులలోపే ఆయన పాలస్తీనాలో పర్యటించబోతున్నారు. పాలస్తీనా సమస్యపై ఇజ్రాయెల్ ప్రధానితో మోడీ చర్చించారు. ఈ సమావేశం అనంతరం భారత విదేశాంగ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి విజయ్ గోఖలే మాట్లాడుతూ ఏదో ఒక సమస్య ఇరు దేశాల మధ్య సంబంధాలను నిర్ణయించలేవని పేర్కొన్నారు.

బిజెపితో శివసేన కటీఫ్

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి : ఉద్ధవ్



ముంబయి : తన సుదీర్ఘ మిత్రపక్షమైన బిజెపికి శివసేన రాంరాం చెప్పింది. కేంద్రంలో, మహారాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వంలో సంకీర్ణ భాగస్వామిగా ఉన్న శివసేన.. బిజెపితో దోస్తీకి కటీఫ్ చెప్పాలని నిశ్చయించింది. మంగళవారం జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ భేటీలో ఈ మేరకు తీర్మానం చేసింది. 2019 లోక్‌సభ, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని శివసేన నిర్ణయించుకుంది. బిజెపితో ఎలాంటి పొత్తు లేకుండానే బరిలోకి దిగాలని, హిందువుల ఓట్లు చీలిపోకుండా ఉండడానికి రాష్ట్రం వెలుపల పోటీ చేయరాదని కూడా నిర్ణయించుకుంది. హిందువుల ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు ఇతర రాష్ట్రాల్లో పోటీకి దూరంగా ఉంటున్నామని, భవిష్యత్‌లో అన్ని శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తామని పార్టీ అధినేత ఉద్ధవ్ థాక్రే తెలిపారు. జమ్మూకశ్మీర్ అంశంపై దృష్టిని కేంద్రీకరించకుండా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి ప్రధాని మోడీ గాలిపటాలు ఎగురవేశారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కేవలం ప్రకటనలపైనే ఖర్చుపెడుతోందని, ఈ వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరముందని చెప్పారు. వచ్చే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని ప్రతిపాదిస్తూ శివసేన ఎంపి సంజయ్ రౌత్ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. తమ పార్టీ కనీసం 25 లోకసభ సీట్లను, 150 అసెంబ్లీ స్థానాలను గెల్చుకుంటుందని రావత్ ధీమా వ్యక్తం చేశారు.

కొత్త అధ్యక్షుడిగా మళ్లీ ఉద్ధవ్ థాక్రే

పార్టీ వ్యవస్థాపకులు బాల్ థాక్రే జయంతి సందర్భంగా పార్టీ కొత్త అధ్యక్షుడు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు మంగళవారం అంతర్గత ఎన్నికలు నిర్వహించారు. శివసేన అధ్యక్షునిగా ఉద్ధవ్ థాక్రే మళ్లీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనగర్‌లో గాలిపటాలకు బదులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తే జాతికి గర్విస్తుందని ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి విమర్శించారు. 'ఇజ్రాయెల్ ప్రధానిని అహ్మదాబాద్‌కు ఎందుకు తీసుకొచ్చారు? దీనివెనుక ఉన్న ఉద్దేశ్యమేమిటి? అతనిని (నెతన్యాహు) శ్రీనగర్ లేదా లాల్‌చౌక్‌కు తీసుకువచ్చి త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయించి ఉంటే జాతి గర్వపడేది' అని అన్నారు. పథకాల అమలుపై కాకుండా వాటికి ప్రచారంపైనే ప్రభుత్వం పెద్దమొత్తంలో వ్యయం చేస్తుందని, దీన్ని తగ్గించాలని సూచించారు.

'గో హత్య నేరం కాబట్టి దాన్ని నిషేధించారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం కూడా పాపంగా భావించి, ఆపేయాలి' అని అన్నారు. గుజరాత్ ఎన్నికల్లో సరిహద్దు పాకిస్థాన్ జోక్యం చేసుకుందని, ఈ పరిస్థితుల్లో ఇప్పుడు దేశం ముందుకు వెళ్తుందో, వెనుకకు పోతుందో తెలియడం లేదని విమర్శించారు. పాకిస్థాన్‌తో చర్చలు జరడం కాదు, దానికి గుణపాఠం చెప్పేందుకు సరైన చర్య తీసుకోవాలని ఆయన సూచించారు.


సిజెఐ అభిశంసనకు చర్చిస్తున్నాం : ఏచూరి

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ దీపక్ మిశ్రా అభిశంసనపై ఇతర పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నామని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లోసిజెఐపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు వివిధ పార్టీలతో చర్చిస్తున్నామన్నారు. కేసుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ సిజెఐపై నలుగురు సీనియర్ సుప్రీం న్యాయమూర్తులు ఆరోపించిన నేపథ్యంలో ఏచూరి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రెబెల్ జడ్జీలు లేవనెత్తిన అంశాలపై విచారణ చేపట్టాలని ఇప్పటికే కాంగ్రెస్, సిపిఐ(ఎం) డిమాండ్ చేశాయి. కాగా ఈనెల 29 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న 2018–19 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఆ తరువాత మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు రెండో విడత పార్లమెంటు సమావేశం కానుంది.

త్రిపుర బరిలో 12 కొత్త ముఖాలు

అగర్తల : త్వరలో జరుగనున్న త్రిపుర శాసనసభ ఎన్నికల్లో అధికార లెఫ్ట్ ఫ్రంట్ నుంచి 12 కొత్త ముఖాలు, పలువురు సిట్టింగ్ మంత్రులు బరిలోకి దిగనున్నారు. ఈ రాష్ట్రంలో ఫిబ్రవరి 18న ఎన్నికలు జరుగనున్నాయి. ఫలితాలు మార్చి 3న వెలువడతాయి. అధికార లెఫ్ట్ ఫ్రంట్ జాబితాలో ఈ 12 కొత్త ముఖాలు మినహాయిస్తే మిగతా వారిలో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించడం లేదు. ఇందులో చాలా మంది గతంలో పోటీ చేసిన వారే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే వారి జాబితాను అధికార లెఫ్ట్ ఫ్రంట్ మంగళవారం ప్రకటించింది. అధికార లెఫ్ట్ ఫ్రంట్‌లో ఆర్ఎస్‌పి, సిపిఐ, ఫార్వార్డ్ బ్లాక్ కీలక భాగస్వాములు. ఈ పార్టీలకు గతంలో రెండేసి చొప్పున సీట్లను కేటాయించగా, ఇప్పుడు కేవలం ఒక్కోటి మాత్రమే కేటాయించింది. అధికార లెఫ్ట్ ఫ్రంట్ కొత్త కన్వీనర్, సిపిఐ(ఎం) రాష్ట్ర శాఖ కార్యదర్శి బిజన్ ధర్ నిత్యం ప్రజలతో మమేకమవుతున్న వారినే ఈ జాబితాలో అవకాశం కల్పించారు. 'ఈసారి మొత్తం 7గురు మహిళలు ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. గతంలో ఇద్దరే పోటీ చేశారు' అని ధర్ తెలిపారు. ఒక్క మంత్రిని కూడా బరి నుంచి తప్పించలేదని, ప్రస్తుతం వారున్న స్థానం నుంచే వారంతా పోటీలోకి దిగుతారని ఆయన చెప్పారు.

ముంబయిలో పెట్రోల్ రూ.80



న్యూఢిల్లీ : పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ భగ్గుమయ్యాయి. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చాక భారీగా పెరగడం ఇదే మొదటిసారి. ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.72.38 పైసలుకు చేరింది. డిసెంబరు మధ్యకాలంలో ముంబైలో ధర లీటరుకు రూ.3.31పైసలు పెరిగి, రూ.80లకు చేరింది. దేశంలోనే ఇది ఎక్కువ ధర. అమ్మకం పన్ను, వ్యాట్ ఎక్కువగా ఉన్న ముంబైలో డీజిల్ ధర లీటరుకు 67.30లకు చేరింది. డిసెంబరు మధ్యలో డీజిల్ ధర రూ.4.86లు పెరిగింది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండడంతో దేశంలో పెట్రో ధరలపై ఆ ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే వారంలో పార్లమెంటులో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 2018–19 బడ్జెట్‌లో ఎక్సైజ్ పన్నులను తగ్గించాలని చమురు మంత్రిత్వ శాఖ ఆర్థిక శాఖను కోరింది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పరిశీలన నిమిత్తం సమర్పించిన ప్రీ–బడ్జెట్ మెమోరాండంలో భాగంగా ఈ విజ్ఞప్తిని చేసినట్టు అధికారులు వెల్లడించారు. పరిశ్రమ నుంచి అందిన సిఫార్సులను మంత్రిత్వ శాఖ పంపించిందని చమురు శాఖ కార్యదర్శి కెడి త్రిపాఠి తెలిపారు. అయితే, దీనికి సంబంధించిన వివరాలు అందించేందుకు ఆయన విముఖత చూపారు. కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోల్‌పై రూ.19.48లు, డీజిల్‌పై రూ.15.33లు ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తోంది. ఢిల్లీలో లీటరు పెట్రోల్‌పై వ్యాట్ రూ.15.39లు, డీజిల్‌పై రూ.9.32లుగా ఉంది. ఎన్‌డిఎ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నవంబరు 2014, జనవరి 2016 మధ్య కాలంలో అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నా కూడా తొమ్మిదిసార్లు ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. అయితే, గత ఏడాది అక్టోబరులో ఒక్కసారి కేవలం లీటరుకు రూ.2లు మాత్రమే తగ్గించింది.

అమానుషం

కుటుంబ సభ్యుల ఎదుటే యువతిపై అత్యాచారం



గురుగావ్: హర్యానాలోని గుర్‌గావ్‌లో దారుణం జరిగింది. 22 ఏళ్ల యువతిని కారులో నుంచి బయటకు లాక్కొచ్చి ఆమె కుటుంబ సభ్యుల ముందే అత్యాచారం చేశారు. గురుగావ్‌లోని సెక్టార్ 56లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు ఓ శుభకార్యానికి వెళ్లి ఆమె బావ కారులో తిరిగి వస్తున్నది. ఆమెతో పాటు భర్త, భావ కూడా ఉన్నారు. అయితే విశ్రాంతి కోసం గురుగావ్ సెక్టార్ 56లోని బిజినెస్ పార్కు టవర్ సమీపంలో కారు ఆపి భర్త పక్కకు వెళ్లగా, యువతి, ఆమె బావ కారులోనే ఉన్నారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా రెండు కార్లు వచ్చి వారి కారు వద్ద ఆగాయి. వాటిలో నుంచి నలుగురు వ్యక్తులు బయటకు దిగి కారు ఎందుకు ఇక్కడ ఆపారంటూ వారిని ప్రశ్నించారని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం ఆ నలుగురు యువతిని కారు నుంచి బయటకు లాగి ఒకరు ఆమెపై లైంగిక దాడి చేయగా, మరో ముగ్గురు ఆమె భర్తను, బావను పట్టుకున్నట్లు ఎసిపి, గురుగావ్ పోలీస్ పిఆర్ఒ మనీష్ సెహగల్ తెలిపారు. ఘటన గురించి పోలీసులకు చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బాధితురాలును, ఆమె కుటుంబ సభ్యులను హెచ్చరించి నిందితులు అక్కడి నుంచి పారిపోయారన్నారు. అయితే నిందితుల కారుల్లో ఒక కారునెంబర్‌ను బాధితురాలు భర్త నమోదు చేసుకున్నట్లు ఎసిపి చెప్పారు. ఘటనకు సంబంధించి వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు జరిపి నిందితుడిని జోహల్కా గ్రామంలో అరెస్టు చేసి ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. ఇదిలా ఉండగా, గత నెలలో హర్యానాలో అత్యాచారాలు, లైంగిక దాడులు పెరిపోయాయి. గత పది రోజుల్లోనే పది అత్యాచార ఘటనలు నమోదయ్యాయి.

రక్తాక్షర నివేదన

పిఎం, సిఎంకు రక్తంతో లేఖ

రాయ్‌బరేలి : తనకు తీవ్ర అన్యాయం జరిగిందని, న్యాయం చేయాల్సిందిగా ఓ అత్యాచార బాధితురాలు రక్తంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాసింది. తనకు అన్యాయం జరగడానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ లేఖలో డిమాండ్ చేసింది. నిందితులకు రాజకీయంగా అండదండలు ఉండడం వల్లే పోలీసులు వారిపై చర్యలు తీసుకోవడం లేదని, కేసును ఉపసంహరించుకోవాల్సిందిగా తనపై నిందితులు ఒత్తిడి తెస్తున్నారని ఈనెల 20న పిఎం, సిఎంకు రాసిన లేఖలో అత్యాచార బాధితురాలు పేర్కొంది. తనకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. ఈ విషయంపై ఎఎస్‌పి శశి శేఖర్ సింగ్‌ను సంప్రదించగా, బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు నిందితులు దివ్య పాండే, అంకిత్ వర్మలపై బారబంకిలో మార్చి 24, 2017న ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పారు. కాగా, ఇంజినీరింగ్ చదువుతున్న తన కూతురిపై నిందితులు అత్యాచారం చేశారని, అప్పటి నుంచి ఆమెపై బెదిరింపులకు పాల్పడుతున్నారని బాలిక తండ్రి ఆరోపించారు. అక్టోబర్ 2017లో కూడా ఆ బాలిక పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతాను తెరిచి అందులో అసభ్యకర చిత్రాలను పోస్టు చేయడంతో గుర్తు తెలియని వ్యక్తులపై రాయ్‌బరేలిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని సింగ్ తెలిపారు. అయితే బాధితురాలు రాసిన లేఖపై అడగగా, దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని ఎఎస్‌పి బదులిచ్చారు.

లవ్ జిహాద్ కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: కేరళ 'లవ్ జిహాద్' కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) తన విచారణను కొనసాగించవచ్చని స్పష్టం చేసింది అయితే ఆ జంట వివాహంపై దర్యాప్తు జరపాల్సిన అవసరం లేదని పేర్కొంది. 'ఈ కేసులో మీరు దర్యాప్తు కొనసాగిస్తారా? ఎవరినైనా అరెస్టు చేస్తారా అనేది అప్రస్తుతం. ఈ కేసులో ఏ విషయంపైనైనా మీరు విచారించవచ్చు. కానీ హదియా వివాహ స్థితిని మాత్రం దర్యాప్తు చేయరాదు. హదియా, ఆమె భర్త షఫీన్ జహన్ ఇద్దరూ మేజర్లే. ఈ పెళ్లిని తన ఇష్టపూర్వకంగా చేసుకున్నానని హదియా స్వయంగా కోర్టుకు తెలిపింది' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. 'హదియా పెళ్లిని కేరళ హైకోర్టు రద్దు చేసింది. ఈ తీర్పు సరైనదా కాదా అనే విషయాన్ని మాత్రమే మేం పరిశీలిస్తాం' అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణను ఫిబ్రవరి 22కు వాయిదా వేసింది. కేరళకు చెందిన అఖిల అనే యువతి మ్యాట్రిమొనీలో పరిచయమైన షఫీన్ జహాన్ అనే ముస్లిం యువకుడిని పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత ఇస్లాం మతం స్వీకరించి తన పేరును హదియాగా మార్చుకుంది. అయితే ఈ పెళ్లిని యువతి కుటుంబసభ్యులు అంగీకరించలేదు. తమ కుమార్తెను ప్రలోభపెట్టో, బలవంతపెట్టో ఈ పెళ్లి చేసుకున్నారని.. ఆమెను సిరియాకు తీసుకెళ్తారని యువతి తండ్రి ఆరోపించారు. దీనిపై ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

రూ.2వేలకు మించొద్దు

రాజకీయ పార్టీలకు నగదు విరాళాలపై ఐటి శాఖ షరతు



న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు రూ. 2000కు మించి నగదు విరాళాలివ్వరాదని ఆదాయపు పన్ను శాఖ మంగళవారం ప్రజలను హెచ్చరించింది. ఎన్నికల నిధుల ప్రక్షాళనకుగాను ప్రభుత్వం ఈ ఏడాది 'ఎలక్టోరల్ బాండ్స్'ను ప్రకటించింది. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకున్నవారు ఎస్‌బిఐకు చెందిన నిర్దేశిత శాఖల్లో వీటిని కొనుకోవచ్చు. తాజా నిబంధనల మేరకు రాజకీయ పార్టీలకు ఎవరూ రూ. 2000కు మించి నగదు విరాళాలు ఇచ్చేందుకు అనుమతించరు. నమోదిత ట్రస్ట్, రాజకీయ పార్టీలకు ఏ వ్యక్తి రూ. 2000కు మించి నగదు విరాళాలు ఇవ్వరాదని ఆదాయపు పన్ను శాఖ మంగళవారం ప్రముఖ వార్తా పత్రికల్లో ప్రకటనలు జారీ చేసింది. ఆదాయపు పన్ను శాఖ లేక దాని సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సిబిడిటి) ఇలా ప్రకటించడం ఇదే మొదటిసారి. ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఆదాయపు పన్ను శాఖ ఈ ప్రజా సలహా(పబ్లిక్ అడ్వయిజరీ)ను జారీ చేయడం గమనార్హం. ప్రజలు ఏమేమి చేయకూడదన్నది కూడా ఐటి శాఖ నిర్దేశించింది. ' ఒక రోజుకు ఒక వ్యక్తి నుంచి మొత్తంగా రూ. 2 లక్షలు లేక అంతకు మించి అంగీకరించొద్దు. ఏదేని వేడుక సందర్భంగా కూడా ఒకటికి మించి లావాదేవీలు స్వీకరించకూడదు. చరాస్తుల లావాదేవీల విషయంలో కూడా రూ. 20,000కు మించి నగదును చెల్లించడం, స్వీకరించడం చేయకూడదు. వ్యాపార, వృత్తిపరమైన ఖర్చుల కింద రూ. 10,000కు మించి నగదు చెల్లించరాదు' అని ఐటి శాఖ పేర్కొంది. నిర్దేశించిన పరిమితిని మించి ఎవరైనా నగదు చెల్లిస్తే పన్ను/జరిమాన చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. 'గో క్యాష్‌లెస్, గో క్లీన్' అనే అడ్వర్టయిజ్‌మెంట్‌లో ఈ విషయాలను నొక్కి చెప్పింది. నల్ల ధనం లేక బెనామీ ఆస్తుల లావాదేవీలు, నియమాల ఉల్లంఘనలకు ఎవరైనా పాల్పడుతున్న సంఘటనలు తెలిస్తే blackmoneyinfo@incometax.gov.inకు ఇ–మెయిల్ లేదా తమ పరిధిలోని ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్‌కు తెలుపాలని ఐటి పేర్కొంది. రాజకీయ పార్టీలకు నగదు విరాళాలు ఇవ్వడానికి బదులుగా ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా ఇవ్వాలని సూచించింది. ఈ బాండ్లు ఎస్‌బిఐ నిర్దేశిత శాఖల్లో జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో 10 రోజులపాటు లభ్యమవుతాయి. ఈ బాండ్లు 15 రోజుల వరకు చెల్లుబాటవుతాయి. వాటిపై దాత పేరు ఉండదు. అయితే వాటిని కొనేవారు బ్యాంకుల్లో నో యువర్ కస్టమర్(కెవైసి) ఫారాన్ని పూరించాల్సి ఉంటుంది.

డిఎన్ఎ టెస్ట్‌తో అంతా తేలిపోతుంది



న్యూఢిల్లీ : డిఎన్‌ఎ పరీక్ష చేయడం ద్వారా స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ (నేతాజీ) మరణంపై ఉన్న అనుమానాలన్నింటికి స్వస్తి పలకవచ్చని ఆయన కూతురు అనితా బోస్ అన్నారు. బోస్‌ను ఖననం చేసిన అవశేషాలు మిగిలి ఉంటాయని, వాటి డిఎన్‌ఏను పరీక్షిస్తే అసలు విషయం తేలిపోతుందని అభిప్రాయపడ్డారు. 'లేయిడ్ టు రెస్ట్ : ది కాంట్రవర్సీ ఓవర్ సుభాష్ చంద్ర బోస్ డెత్' అనే పుస్తకంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ మరణంపై ఉన్న అనుమానాల పరంపరను పేర్కొంటూ వస్తున్న ఈ కొత్త పుస్తకాన్ని ఆశీష్ రే రాశారు. సుభాష్ చంద్రబోస్ అవశేషాలను 1945 సెప్టెంబర్ నుంచి టోక్యోలోని రెంకోజి ఆలయంలో భద్రపరుస్తూ వస్తున్నారు. నేడు దేశ వ్యాప్తంగా నేతాజీ 121వ జయంతి వేడుకలు జరిగాయి.

మన తెలంగాణ
11 హైదరాబాద్ బుధవారం 24, జనవరి 2018
www.manatelangana.news

ఎఆర్, విఆర్ విభాగాల్లో టి హబ్‌తో ఫేస్‌బుక్ ఎంఒయు



మన తెలంగాణ/హైదరాబాద్: ఫేస్‌బుక్, టి హబ్ సంయుక్త భాగస్వామ్యంతో 'ఇండియా ఇన్నోవేషన్ హబ్ యాక్సెలేటరీ ప్రొగ్రామ్'ను నగరంలో మంగళవారం జరిగింది. వర్చువల్ రియాలిటి, ఆగ్యుమెంటార్ విభాగాల్లో ఆవిష్కరణలను ఔత్సాహికులను ప్రొత్సహించడానికి రెండూ కలిసి పని చేయనున్నట్లు టి హబ్ సిఈవో జయ్‌కృష్ణన్, ఫేస్ బుక్ ఇండియా సౌత్ ఏసియా పార్ట్‌నర్‌షిప్ హెడ్ సత్యజిత్ సింగ్‌లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం గచ్చిబౌలిలోని టి హబ్‌లో ఈ మేరకు వారు ఎంఒయు పత్రాలపై మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఔత్సాహికులకు పై రెండు రంగాల్లో అవసరమైన మెలకువలను అందించడంతో పాటు శిక్షణ కూడా కల్పించనున్నట్లు తెలిపారు. రానున్న కాలమంతా పై రెండు రంగాలదేనని, సుమారు 76% మేర వృద్ధి చోటుచేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ రంగాల్లో సుమారు 1500 స్టార్టప్ కంపెనీలు ఇటీవలి కాలంలో నమోదయ్యాయిని, ఇందులో 45% అమెరికాలో ఉన్నాయని, గడచిన నాలుగేళ్ళలో సుమారు రెండున్నర బిలియన్ డాలర్ల మేర వ్యాపారం జరిగిందని వివరించారు. భారతదేశంలో మాత్రం సగటున వంద స్టార్టప్ కంపెనీల్లో పై రెండు రంగాలకు చెందినవి కేవలం ఐదు మాత్రమే ఉంటున్నాయని, సరాసరి 15 లక్షల డాలర్ల మేర పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు.

తాలిబన్ నేతలను అరెస్టు చేయండి

- పాక్‌ను ఆదేశించిన అమెరికా

వాషింగ్టన్: ఉగ్రదాడులను జరుపుతున్న తాలిబన్ల నాయకులను తక్షణమే అరెస్టు చేయాల్సిందిగా పాకిస్థాన్‌ను అమెరికా ఆదేశించింది. వారు అఫ్గానిస్థాన్ సరిహద్దుల వెంబడి విస్తరించి ఉన్నట్లు కూడా పేర్కొంది. కాబూల్‌లో విలాసవంతమైన ఒక హోటల్‌పై కొద్ది రోజుల క్రితం ఉగ్రదాడిలో 22 మంది మరణించాక అమెరికా ఈ ఆదేశం ఇచ్చింది. కాబూల్‌లోని ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌పై దాడికి బాధ్యత తమదేనని తాలిబన్ ప్రకటన వెలువడ్డాక వైట్ హౌస్ ప్రకటన వెలువడింది. దాడి తర్వాత సరిహద్దుల వద్ద మోహరించి ఉన్న తాలిబన్‌లను దేశం నుంచి వెళ్లగొట్టాలని లేదా తక్షణమే అరెస్టు చేయాలని ఆ ప్రకటనలో పాక్‌ను అమెరికా ఆదేశించింది. వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ సారా సాండర్స్ ఈ విషయం చెప్పారు. పాక్ తన భూ భాగాల నుంచి టెర్రరిస్టు స్థావరాలను తొలగించాలని కూడా గట్టిగా కోరింది.

అలస్కాలో భారీ భూకంపం



కాడియెక్: అలస్కాలో భారీ భూకంపం సంభవించింది. దాని తీవ్రత రిక్టర్ స్కేలుపై 8.2గా నమోదైంది. దీంతో సునామీ వచ్చే అవకాశం ఉందని అమెరికా సునామీ కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. అయితే తర్వాత ఆ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. ఆగ్నేయ కాడియెక్ ప్రాంతానికి 175 మైళ్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైంది. అలస్కా కాలమానం ప్రకారం మంగళవారం అర్థరాత్రి (మనకు మధ్యాహ్నం) ఆగ్నేయ కాడియెక్ ప్రాంతానికి 175 మైళ్ల దూరంలో 6 మైళ్ల లోతులో భూకంపకేంద్రం నమోదైందని అమెరికన్ జియోలాజికల్ సర్వే తెలిపింది. భూకంప తీవ్రత అధికంగా నమోదైన నేపథ్యంలో ఆగ్నేయ ప్రాంతాలతో పాటు దక్షిణ అలస్కా, అలస్కా ద్వీపకల్పం, అలూటియన్ దీవులు, కెనడాలోని బ్రిటీష్ కొలంబియాకు సునామీ ప్రమాదం పొంచివుందని హెచ్చరికలు జారీచేసింది. అంతేకాదు.. కాలిఫోర్నియా, ఒరెగాన్, వాషింగ్టన్ ప్రాంతాలకూ సునామీ ప్రభావం ఉండొచ్చని అభిప్రాయపడింది.

దావోస్‌లో మెరిసిన షారూక్



దావోస్: ప్రపంచ ఆర్థిక సదస్సు దావోస్‌లో బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్‌కు ప్రత్యేక గౌరవం దక్కింది. బాలలు, మహిళల హక్కుల కోసం షారుక్ చేస్తున్న సేవలకుగాను ఆయన్ను క్రిస్టల్ అవార్డుతో గౌరవించింది. సోమవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో అవార్డును స్వీకరించారు. షారుక్ తన మీర్ ఫౌండేషన్ ద్వారా యాసిడ్ దాడులకు గురైన మహిళలకు సహాయ, సహకారాలు అందిస్తున్నాడు. కేన్సర్ బాధిత చిన్నారులను ఆదుకుంటున్నాడు. తనకు స్ఫూర్తిగా నిలిచిన తల్లి, భార్యకు, పిల్లలకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. హాలీవుడ్ నటి కేట్ బ్లాంచెట్, గాయకుడు ఎల్టన్ జాన్ కూడా ఈ అవార్డులు స్వీకరించారు.

ప్రభుత్వానిది సామ్రాజ్య విష సంస్కృతి




మన తెలంగాణ/ హైదరాబాద్/ హిమాయత్‌నగర్: 20 ఏళ్ల వరంగల్ డిక్లరే షన్ సభపై పోలీసులు తమ ప్రత్యేకతను చాటుకోవాలని అకుంటున్నారని పౌర హక్కుల సంఘం తెలంగాణ ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు ప్రొ. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, విరసం నేత వరవరరావు మాట్లాడారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ సామ్రాజ్యవాద విష సంస్కృతిని అవలంబిస్తుందని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ డిసెంబర్ 27న వరంగల్‌లో ర్యాలీ, బహిరంగ సభను నిర్వహించేందుకు కాకతీయ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌కు డబ్బులు చెల్లించి అనుమతి పత్రాన్ని తీసుకోవడం జరిగిందని, ఆ తరువాత పోలీసులు కళాశాల యాజమాన్యాన్ని బెదిరించి అనుమతి పత్రాన్ని తిరిగి తీసుకునేలా చేశారన్నారు. దీంతో వారు ఇస్లామియా కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించి జనవరి 7,2018కి కార్యక్రమం మార్చుకోగా, అక్కడా ప్రిన్సిపల్‌ను పోలీసులు బెదిరించడంతో రాత పూర్వకంగా ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవడం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత జనవరి 21న విష్ణుప్రియ గార్డెన్స్‌లో సభను నిర్వహించాలని నిర్ణయం తీసుకోగా, అక్కడ ఇదే పరిస్థితి తలెత్తడంతో, అభిరామ్ గార్డెన్స్‌లో నిర్వహించడం జరిగిందన్నారు. ఆరోజు మధ్యాహ్నం 2గంటలకు కాళోజీ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద 50మంది చేరుకుని నివాళులర్పించి ర్యాలీగా వెళ్తుండగా, వారిని అడ్డుకున్నారని ఆరోపించారు. ఈలోగా ప్రజానాట్య మండలి కార్యకర్తలు 15మంది అక్కడికి చేరుకున్నారని తెలిపారు. ముందుగానే 200 మంది పోలీసులు అక్కడకు వచ్చారని, కళాకారులు డ్రస్సుల్లో ఉండటంతో కళా బృందాన్ని టార్గెట్ చేసి దాడిచేసి కొట్టారన్నారు. ఈ సమావేశంలో సమీర్, శిల్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణపై కేసులు ఎత్తివేయాలి

- గవర్నర్‌కు మాదిగ మేధావుల జెఎసి వినతి

మన తెలంగాణ/హైదరాబాద్/సోమాజిగూడ: ఎస్‌సి వర్గీకరణ కోసం శాంతియుతంగా పోరాడుతున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై ప్రభుత్వం వేధింపులు ఆపేలా చర్యలు తీసుకోవాలని మాదిగ మేధావుల జెఎసి మంగళవారం గవర్నర్ నర్సింహన్‌ను కలిసి విన్నవించారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నాయకులు మత్తయ్య, వెంకటనర్సయ్య, తిరుపతిలు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మందకృష్ణపై అక్రమ కేసులు బనాయిస్తుందని, శాంతియుతంగా చేపట్టిన నిరసనలకు సైతం నాన్ బెయిలాబుల్ కేసులు నమోదు చేసి జైల్లో మగ్గేలా చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కుట్రలో భాగంగా మందకృష్ణ అక్రమ అరెస్టు, మాదిగలపై వేధింపులు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వీరస్వామి, చింతస్వామి, చక్రపాణి, శ్రీనివాస్, గౌరి, వేముల అశోక్, నాగారం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



'షట్ డౌన్' నుంచి విముక్తి

- తాత్కాలిక బడ్జెట్ ఎట్టకేలకు ఆమోదం
- ట్రంప్ సంతకంతో చట్టంగా అవతరణ
- వేలాది సిబ్బందికి ఊరట



వాషింగ్టన్: ప్రభుత్వానికి స్వల్పకాలంపాటు నిధుల కల్పనకు ఉద్దేశించిన తాజా బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేయడంతో మూడు రోజుల 'షట్ డౌన్' సంక్షోభానికి తెర పడింది. భవిష్యత్తులో పత్రాలు లేని ఇమ్మిగ్రెంట్ల విషయంలో చర్చలు జరిపేందుకు రిపబ్లికన్లతో ఒప్పందం కుదిరాక తాత్కాలిక బడ్జెట్ బిల్లు తిరిగి డెమొక్రాట్ల ఆమోదం పొందింది. ఈ తాత్కాలిక నిధుల కల్పన ఫిబ్రవరి 8 దాకా సాగుతుంది. 'డ్రీమర్ల'పై రిపబ్లికన్‌ల నుంచి సానుకూలత డెమొక్రాట్లకు చర్చల్లో వ్యకమయ్యాక గత రాత్రి సెనెట్, ప్రజాప్రతినిధుల సభలు రెండు బిల్లులను ఆమోదించాయి. తర్వాత ట్రంప్ సంతకం చేశారు. డ్రీమర్స్ అని పిలిచే వేలాది మంది వలసదారుల పిల్లలు ప్రస్తుతం అక్రమంగా అమెరికాకు తీసుకుని రాబడ్డారు. వారి భవిష్యత్తుకు రిపబ్లికన్లు హామీ ఇచ్చాక ప్రతిపక్ష డెమొక్రాట్లు శాంతించారు. డెమొక్రాట్లతో వివాదంలో గెలిచినట్లు ట్రంప్ దాటు కున్నారు. తర్వాత ఆయన సంతకంతో తాత్కాలిక బడ్జెట్ చట్టంగా రూపొందింది. దీనితో శనివారం నుంచి వేతనాలు, పనిలేని భయంలో ఉన్న వేలాది మంది ఫెడరల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

శాసనమండలిని సందర్శించిన నేపాలీ బృందం



మన తెలంగాణ/హైదరాబాద్: నేపాల్ దేశానికి చెందిన వివిధ స్వచ్ఛంద సంస్థల బృందం మంగళవారం శాసనమండలిని సందర్శించింది. ఈ సందర్భంగా మండలి చైర్మన్ కె.స్వామిగౌడ్, చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డితో విడివిడిగా భేటీ అయింది. ఆస్మాన్ నేపాల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాధా కొయిరాలా ,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవల్ కిషోర్ యాదవ్‌ల ఆధ్వర్యంలోని ఏడుగురితో కూడిన బృందం రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ, ప్రభుత్వ విద్య, పథకాలను తెలుసుకునేందుకు పర్యటనకు వచ్చింది. అందులో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పర్యటన జరిపింది. అనంతరం సోమవారం ఉదయం శాసనమండలికి వచ్చిన ఈ బృందానికి పాతూరి సుధాకర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. అక్కడి నుంచి వారిని మండలి చైర్మన్ స్వామిగౌడ్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ ను మరో 20ఏళ్లలో పూర్తిగా నిర్మూలించి తెలంగాణను దేశంలో నెంబర్‌వన్‌గా నిలుపుతామన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాలు ఉపయోగపడుతున్నాయని వివరించారు. త్వరలోనే నేపాల్‌లో పర్యటించి అక్కడ పరిస్థితులను అధ్యయనం చేస్తామన్నారు. పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో 500 రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభించి దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిచామని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్లో ఒక్కో విద్యార్థిపై రూ. 1.25 లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నేపాలీ బృందం సభ్యులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో త్వరితగతిన అభివృద్ధి ఫలాలు దక్కాలన్న తపన అందరిలో ఉండడాన్ని తాము గమనించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని వారు కితాబిచ్చారు. మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌సి వి. గంగాధర్ గౌడ్ తదితరులున్నారు.

పుస్తకంతోనే విజ్ఞానం

- రచనలు విప్లవానికి నాంది
- పాశ్చాత్య సంస్కృతిని విడనాడుదాం
- హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి



మన తెలంగాణ/ముషీరాబాద్: సమాజం బాగుపడాలంటే విజ్ఞానం కావాలని, అది పుస్తంతోనే లభిస్తుందని హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో కొనసాగుతున్న 31వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను ఆయన మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా సినారె వేదికపై 'ఈ తరం తెలంగాణ సినీ దర్శకులు' సాహితీ సమాలోచనలో ముఖ్య అతిథిగా నాయిని హాజరై మాట్లాడారు. పుస్తకాల్లో చరిత్ర ఉంటుందని, తప్పనిసరిగా అందరూ చదవాలన్నారు. రచనలు విప్లవానికి నాంది పలుకుతాయన్నారు. పాశ్చా త్య సంస్కృతి దేశంలో విపరీతంగా పెరిగిపోతుందని, ఆ సంస్కృతిని విడనాడాలని పిలుపునిచ్చారు. సినీ రంగం బాగుపడితేనే సమాజం కూడా బాగుపడుతుందన్నారు. అనంతరం హెచ్.రమేశ్‌బాబు రచించిన తెలంగాణ తెరకు తొలి వెలుగు బి.నర్సింగరావు జీవిత కళా చలన చిత్ర యాత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు ఎన్.శంకర్, రమేశ్‌కుమార్, వేద కుమార్, సాగర్‌చంద్ర, ఆర్‌కె, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక ప్రదర్శన నిర్వాహకులు గౌరీశంకర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ' పుస్తకావిష్కరణ: కవి యాకుబ్ రచించిన ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ పుస్తకాన్ని సినారె వేదికపై ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుడిపాటి, కాసుల ప్రతాప్‌రెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, లక్ష్మీ నర్సయ్య, ఎకె.ప్రభాకర్ తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. దాంతో పాటు పుస్తక ప్రదర్శనలో ఉన్న బోయ జంగయ్య వేదికపై క్రాంతి రచించిన కలత నిద్దరలో, హైమావతి రచించిన జోలె విలువ, సూర్యచంద్ర రచించిన నిషేదాక్షర స్వప్నం పుస్తకాలను సతీష్‌చందర్, ఎకె.ప్రభాకర్, ప్రొఫెసర్ కాశీం, ఉదయభానులు ఆవిష్కరించారు.

నీలోఫర్‌లో వసతుల లేమిపై హెచ్‌ఆర్‌సిలో ఫిర్యాదు



మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్: చిన్నపిల్లల ఆసుపత్రిగా ఖ్యాతిగాంచిన నీలోఫర్ ఆసుపత్రిలో రోగులు, రోగి సహాయకులకు సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ హెచ్‌ఆర్‌సిలో ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో రోగులు, వారి సహాయకులకు వసతి, మ రుగుదొడ్ల సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయన తన ఫిర్యాదులో హెచ్‌ఆర్‌సిని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతో మంది తమ పిల్లలను వైద్య చికిత్సల నిమిత్తం నీలోఫర్ ఆసుపత్రిలో చేర్పిస్తుంటారని అన్నారు. ఆసుపత్రిలో చేర్పించిన తర్వాత రోగి తల్లిదండ్రులను, సహాయకులను ఆసుపత్రిలో ఉండ నివ్వడం లేదని ఆరోపించారు. రోగులు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతుండగా రోగి సహాయకులు చెట్ల కింద, రేకుల షెడ్ల కింద తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఆసుపత్రి ఆవరణలోనే వంటలు వండుకుని, అక్కడే భుజించి, అక్కడే శయనిస్తూ రోగుల సహాయకులు పడుతున్న వెతలు వర్ణనాతీతంగా మారాయన్నారు. వైద్యం కోసం ఆసుపత్రికి రోగులను తీసుకువచ్చిన రోగి సహాయకులూ అనారోగ్యం పాలవుతున్నారంటే నీలోఫర్ ఆసుపత్రిలో రోగి సహాయకుల దుస్థితి ఎంత అధ్వానంగా తయారైందో ఇట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల సంఖ్యకు సరిపోయే విధంగా మరుగుదొడ్లు నిర్మించాలని, నీలోఫర్ ప్రాంగణంలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, ఆసుపత్రి ఆవరణను అన్నివేళలా పరిశుభ్రంగా ఉంచే విధంగా సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయాలని హెచ్‌ఆర్సీని కోరినట్లు తెలిపారు. న్యాయవాది ఫిర్యాదుతో స్పందించిన హెచ్‌ఆర్సీ ఏప్రిల్ 24వ తేదీలోగా ఈ కేసుకు పంబంధించిన సమగ్ర నివేదికను కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది.

గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు

మన తెలంగాణ/హైదరాబాద్: లైంగిక వేధింపుల కేసులో గాయకుడు గజల్ శ్రీనివాస్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణను నాంపల్లి కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. బెయిల్ మంజూరు చేయాలని గజల్ తరపు న్యాయవాది ఈ నెల 12న కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. గజల్ శ్రీనివాస్ 20 రోజులకు పైగా జైలులో ఉన్నారని..బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు విరుద్ధంగా పోలీసులు తప్పుడు ఐపిసి సెక్షన్లు పెట్టారని ఇప్పటికైనా బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు పిటిషన్ విచారణపై నిర్ణయాన్ని నేటికి వాయిదా వేసింది. అలాగే ఇదే కేసులో రెండో ముద్దాయిగా ఉన్న పార్వతి పెట్టుకున్న ముందస్తు బెయిల్‌పై కూడా విచారణ నేటికి వాయిదా పడింది.

కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం ప్రసక్తే లేదు : ఐరాస

ఐక్యరాజ్యసమితి: కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం జరిపే ప్రసక్తే లేదని ఐక్యరాజ్య సమితి స్పష్టం చేసింది. ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదిరేంత వరకు కశ్మీరు సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం చేసే ప్రసక్తే లేదని ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తెలిపారు. భారత్-పాకిస్థాన్ తమ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఐరాస సెక్రటరీ జనరల్‌కు అధికార ప్రతినిధి స్టెఫానే దుజరిక్ మాట్లాడుతూ సూత్రప్రాయంగా ఐరాస చీఫ్ తాలూకు పలుకుబడి ఎల్లవేళలా మధ్యవర్తి త్వానికి అందుబాటులో ఉంటుందన్నారు. అయితే దీనికి అన్నిపక్షాలూ అంగీకరించాలన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న పరిస్థితులు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల గురించి ప్రశ్నించినపుడు దుజరిక్ మాట్లాడుతూ తమకు ఆ విషయాలు తెలుసునన్నారు. ముఖ్యంగా గత పది రోజుల నుంచి జరుగుతున్న విషయాలను గమనిస్తున్నామని చెప్పారు.

మిషన్‌కాకతీయ మీడియా అవార్డుల ఎంట్రీలకు చివరి తేది

మన తెలంగాణ/హైదరాబాద్: మిషన్‌కాకతీయ మీడియా అవార్డుల కోసం ఎంట్రీలను ఈ నెల 31లోగా పంపించాలని ఇరిగేషన్ మంత్రి ఓఎస్‌డి శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం మూడేళ్ల కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న తరుణంలో దీనికి సహకరించిన జర్నలిస్టులను సత్కరించేందుకు అవార్డులను ప్రకటించనున్నారు. మిషన్‌కాకతీయ గూర్చి అద్భుతంగా కథనాలు రాసిన పత్రికా విలేఖరులు, ప్రసారం చేసిన టివి జర్నలిస్టులు, వార్తా సంస్థలకు తగిన రీతిలో అవార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. 2017 జనవరి 1 నుంచి 2017 డిసెంబర్ 30 వరకు పత్రికల్లో అచ్చుయిన, ఛానళ్లలో ప్రసారమైన కథనాలను ఈ అవార్డుల ఎంపిక కోసం స్వీకరించబడతాయని ఆయన తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఆన్‌లైన్ మీడియా, వీడియో, ఫొటోగ్రాఫర్లు, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు డాక్యుమెంటరీ ఫార్మాట్లలో ఇవ్వాలన్నారు.

అసెంబ్లీ సీట్ల పెంపునకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు : రఘువీరారెడ్డి



మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపునకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని ఎపి పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ఆయన నివాసంలో కలసిన రఘువీరారెడ్డి అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. దాదాపు గంటసేపు ఎపి రాజకీయ పరిస్థితులను గురించి రాహుల్‌తో చర్చించినట్లు చెప్పారు. విభజన హామీలను గాలికొదిలేసి అసెంబ్లీ సీట్ల పెంపుపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దృష్టి సారించారని రఘువీరా రెడ్డి ఆరోపించారు. ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నింటినీ కేంద్రం నెరవేర్చేస్తేనే పార్లమెంటులో తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు ప్రతిపాదనకు సహకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. డ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్ సభలో రూల్ 184 కింద విభజన్హామీల అంశంపై నోటీసు ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరామని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. విభజన హామీల అమలుపై , రూల్ 184 కింద పార్లమెంటులో చర్చ జరుగుతున్నప్పుడు ఢిల్లీలో ఆందోళన చేపట్టాలని రాహుల్ సూచించారని అన్నారు. రాహుల్‌ను కలిసిన వారిలో మాజీ ఎంఎల్‌సి గిడుగు రుద్రరాజు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మైనారిటీ విద్యార్థుల అసంతృప్తి

మన తెలంగాణ/హైదరాబాద్: ఎస్‌సిలతో సమానంగా మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తున్నా ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోందని విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు కాళాశాలల్లో చదివే పేద మైనారిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరులో ప్రభుత్వం కోతలు విధించడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువు కొనసాగిస్తున్న తమకు అధికారుల తీరు ఇబ్బందులు కల్పిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇంటర్, డిగ్రీ విద్యార్థుల విషయంలో ఫీజు చెల్లింపుల్లో భారీగా కోతలు విధించారు. గతంలో ఇంటర్, డిగ్రీ కోర్సులకు మైనారిటీ సంక్షేమ శాఖ గరిష్ఠంగా రూ.10 వేల వరకు ఫీజు రీయింబర్స్ చేస్తుండగా, గతేడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో రూ.2వేల కోత విధించారని, పాలిటెక్నిక్ కోర్సులకు సైతం దీన్ని కొనసాగిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. గత విద్యాసంత్సరానికి సంబంధించిన ఫీజు బకాయిలు ప్రభుత్వం మంజూరు చేసినా ఇప్పటికీ విడుదల చేయలేదని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులతో సమానంగా మైనారిటీ విద్యార్థులకు గతంలోలాగానే ఫీజు చెల్లింపులో సరైన విధానాన్ని అవలంబించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గత ఏడాది ఫీజులతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రి యింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

'బైబిల్ మిషన్' సమ్మేళనానికి ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నాగార్జున సాగర్‌లో జరగనున్న 'బైబిల్ మిషన్' వార్షిక సమ్మేళనానికి ప్రత్యేక రవాణ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రకటించింది. ఇందు కోసం ఈ నె ల26 నుంచి 29వ తేదీ వరకు కాకినాడ పోర్ట్ – గుంటూరు – కాకినాడ పోర్ట్ మధ్య ప్యాసెంజర్ ప్రత్యేక రైళ్ల (నెం. 07223 / 07224) ను నడపనున్నారు. మరోవైపు గుంటూరు – సికింద్రాబాద్ – గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుంటూరు – విశాఖపట్నం – గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు నాగార్జున సాగర్ స్టేషన్ మీదుగా నడిచే అన్ని ప్యాసెంజర్ రైళ్లకు తాత్కాలిక నాగార్జునసాగర్ స్టేషన్‌లో ఆపనున్నారు. దీనితో పాటు పలు గుంటూరు సమీపం వరకు నడిచే 9 ప్యాసెంజర్ రైళ్లను గుంటూరు వరకు 4 రోజులు పొడిగించడంతో పాటు పలు రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ మంగళవారం ఒక ప్రక టనలో వివరించారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
బుధవారం
24, జనవరి 2018
www.manatelangana.news

సింగపూర్‌లో ధోని క్రికెట్ అకాడమీ



దుబాయ్: భారత మాజీ కెప్టెన్ మహేందర్ సింగ్ ధోని తన రెండో క్రికెట్ అకాడమిని సింగపూర్‌లో ఆరంభించారు. ఆయన తన తొలి అకాడమీని దుబాయ్‌లో నెలకొల్పారు. అల్ ఖుఓజ్‌లోని స్ప్రింగ్‌డేల్స్ స్కూల్‌లో నెలకొల్పిన దుబాయ్ క్రికెట్ అకాడమీ పూర్తి స్థాయిలో పనిచేస్తోంది. సింగపూర్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్‌లో సింగపూర్ అకాడమీని నెలకొల్పారు. ఈ అకాడమీలో ఆ స్కూల్‌కు చెందిన 300కు పైగా విద్యార్థులు ఇప్పటికే సంతకాలు చేశారు. తన సింగపూర్ అకాడమీ విషయంలో ధోనీ సింగపూర్ మహిళా టీమ్ కెప్టెన్ జి.కె.దివ్యా, పురుష టీమ్ క్రికెటర్లు చేతన్ సూర్యవంశీ, చమిండా రువాన్‌లతో కలసి పనిచేస్తున్నారు. సింగపూర్ క్రికెట్ అకాడమీకి దుబాయ్ అకాడమీమికి చెందిన అధికారులు మహమూద్ మర్చంట్, విశాల్ సింధు, సుధీర్ త్రిపాఠి హాజరయ్యారు. దుబాయ్ అకాడమీ పనితీరుపై ధోని ఆనందాన్ని వ్యక్తం చేశారని మర్చంట్ చెప్పారు. హాంకాంగ్, దక్షిణాఫ్రికాల్లో కూడా తన అకాడమీలు స్థాపించాలని ధోని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ ధోని అకాడమీల మధ్య ఇంటర్ గ్లోబల్ మ్యాచ్‌లు నిర్వహించాలని కూడా భావిస్తున్నట్లు ధోని తెలిపారు.

దక్షిణాఫ్రికా సిరీస్‌కు మహిళా జట్టు ఎంపిక

ముంబయి: దక్షిణాఫ్రికాతో జరిగే మహిళల టి20 సిరీస్‌కు భారత జట్టును ప్రకటించారు. ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభమయ్యే సిరీస్‌లో టీమిండియా సారథిగా స్టార్ ఆల్‌రౌండర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ఎంపిక చేశారు. స్మృతి మంధానను ఉప సారథిగా నియమించారు. మిథాలీ నాయకత్వంలో వన్డే సిరీస్ ముగిసిన తర్వాత ఈ మ్యాచ్‌లు ప్రారంభం అవుతాయి. టి20 స్పెషలిస్టు అనూజా పాటిల్‌కు 15 మంది సభ్యుల బృందంలో చోటిచ్చారు. అరంగేట్రం క్రీడాకారిణి రాధా యాదవ్, వికెట్ కీపర్ నుజహత్ పర్వీన్‌కు చోటు దక్కింది. అండర్19 టోర్నీలో 163 బంతుల్లో 202 పరుగులు చేసిన జెమీమా రోడ్రిగ్జ్‌కు చోటిచ్చారు. వన్డే జట్టులో ఉన్న మోనా మెష్రమ్, వికెట్ కీపర్ సుష్మ వర్మ, ఏక్తా బిస్త్, పూనమ్‌కు టి20 బృందంలో చోటివ్వలేదు. ఫిబ్రవరి 13న పోషెస్ట్రోమ్, 16న తూర్పు లండన్, 19న జొహానెస్‌బర్గ్, 21న సెంచూరియన్, 24న కేప్‌టౌన్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు.



జట్టు వివరాలు

హర్మన్‌ప్రీత్ కౌర్ (సారథి), స్మృతి మంధాన (ఉప సారథి), మిథాలీ రాజ్, వేద కృష్ణమూర్తి, జెమీమా రోడ్రిగ్జ్, దీప్తి శర్మ, అనూజ పాటిల్, తానియా భాటియా, పర్వీన్, పూనమ్ యాదవ్, రాజేశ్వరీ గైక్వాడ్, జులన్ గోస్వామి, శిఖా పాండే, పూజా వస్త్రకర్, రాధా యాదవ్.

రహానే రాక ఖాయం?

జొహెనెస్‌బర్గ్: వాండరర్స్ స్టేడియంలో బుధవారం డుప్లెసిస్ సేనతో కోహ్లి సేన ఆఖరి టెస్టును ఆడబోతున్నది. ఇటీవల పేలవమైన ఆటతీరుతో అందరి నోట విమర్శలపాలైన టీమిండియా 0–3తో క్లీన్ స్వీప్ అవుతుందా లేక 0–2తో పరువు నిలుపుకుంటుందా అన్న కుతూహలం క్రికెట్ అభిమానుల్లో నెలకొంది. కోహ్లి గత రెండు టెస్టుల్లో రహానెను తప్పించి రోహిత్‌ను ఆడించాడు. ఫామ్‌లో ఉన్న భువిని తప్పించాడు. ఇది పెద్ద దుమారమే రేపింది. తీవ్ర విమర్శలకు దారితీసింది. మ్యాచ్‌కు ముందు ఎన్నో విషయాలు పరిగణనలోకి తీసుకుంటాం అని చెబుతున్నా కోహ్లి, రవిశాస్త్రిపై కచ్చితంగా ఒత్తిడి నెలకొంది. ఈ నేపథ్యంలో వాండరర్స్ మ్యాచ్‌లో రహానె రాక ఖాయమే అన్న సూచనలు కనిపించాయి. రెండు రోజులుగా అతడు నెట్స్‌లో నాలుగు సెషన్ల పాటు కఠోరంగా శ్రమించాడు. సోమవారం భువి, ఇషాంత్, ఉమేశ్, షమీ బౌలింగ్, బ్యాటింగ్ సాధన చేశారు. యువ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యకు చోటు ఇస్తారనే తెలుస్తోంది. ఇప్పటికీ రోహిత్‌ను తప్పించే అవకాశాలు కనిపించడం లేవు. పిచ్ పచ్చికతో కళకళలాడుతున్న నేపథ్యంలో స్పిన్నర్లను ఆడించకుండా రోహిత్‌ను తుది జట్టులోకి తీసుకోవచ్చు. అశ్విన్ బ్యాటింగ్ సాధన చేయకపోవడం ఇందుకు ఊతం ఇస్తోంది. పార్థివ్ పటేల్‌ను తప్పించకపోవచ్చు. ఆరుగురు బ్యాట్స్‌మెన్, నలుగురు పేసర్లు, ఒక ఆల్ రౌండర్‌తో తుదిజట్టు ఉండనుందని ప్రాథమిక సమాచారం. 2006 నుంచి కనీసం ఒక టెస్టైనా గెలవడమో లేదంటే డ్రా చేసుకోవడమో సంప్రదాయంగా వస్తోంది. మూడో టెస్టు జరిగే వాండరర్స్‌లో భారత్ ఓడిపోయిందే లేదు. పిచ్‌పై తగినంత పచ్చిక ఉందని బౌన్స్, పేస్, స్వింగ్‌కు చక్కగా అనుకూలిస్తుందని స్థానిక క్యురేటర్ చెప్తున్నారు.



నాదల్ నిష్క్రమణ



- సెమీస్‌కు మారిన్ సిలిక్
- ప్రపంచ నెం. 1 రాఫెల్ నాదల్ కాలి గాయంతో రిటైర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను రెండోసారి గెలుచుకోవాలనుకున్న ప్రపంచ నెం. 1 టెన్నిస్ క్రీడాకారుడు రాఫెల్ నాదల్ ఆశ నెరవేరకుండా పోయింది. రాడ్ లావర్ అరేనాలో మంగళవారం రాత్రి జరిగిన క్వార్టర్ ఫైనల్ గేమ్ నాలుగో రౌండ్‌లో కుడి కాలి గాయం కారణంగా అర్ధాంతరంగా పోటీ నుంచి నాదల్ నిష్క్రమించాల్సి వచ్చింది. స్పెయిన్‌కు చెందిన నాదల్ నొప్పిని తట్టుకోలేక ఆడలేకపోయాడు. క్రొయేషియాకు చెందిన సిలిక్ అతడిని 3గంటల 47 నిమిషాల పోరులో 3–6, 6–3, 6–7(5/7), 6–2, 2–0తో ఓడించాడు. దీంతో సిలిక్ సెమీఫైనల్‌లోకి ప్రవేశించాడు. టాప్ సీడ్ ఆటగాడు రాఫెల్ నాదల్ నిర్ణయాత్మక సెట్‌లో 0–2తో వెనుకబడిపోయాడు.

గాయం సమస్య తలెత్తనంత వరకు నాదల్, సిలిక్ స్వల్ప తేడాతో హోరాహోరి పోరాడారు. ఇద్దరూ చెలరేగి మరీ గ్రౌండ్ స్ట్రోక్‌లు దంచేశారు. గత ఏడాది కూడా రోజర్ ఫెదరర్ చేతిలో ఫైనల్స్‌లో ఓడిపోయిన నాదల్ నాలుగో సెట్‌లో 1–4 స్కోరు ఉన్నప్పుడు వైద్యున్ని పిలిచాడు. తర్వాత ఆట నుంచి రిటైర్ అయ్యాడు.

ఎడ్మండ్ సంచలన విజయం



ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో మంగళవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో బ్రిటన్‌కు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు కైల్ ఎడ్మండ్ బల్గేరియాకు చెందిన మూడో సీడ్ ఆటగాడు దిమిత్రోవ్‌ను 6–3, 3–6, 6–3, 6–4 తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరాడు. దీంతో అతడు గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి సెమీస్‌కు చేరిన ఘనతను సొంతం చేసుకున్నాడు. కాగా గ్రాండ్‌స్లామ్ ఓపెన్ ఎరాలో సెమీస్‌కు చేరిన ఆరో బ్రిటన్ క్రీడాకారుడిగా గుర్తింపును కూడా సాధించాడు.

సెమీస్‌కు దూసుకెళ్లిన ఎలిస్ మెర్టిన్స్



బెల్జియంకు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి ఎలిస్ మెర్టిన్స్ మంగళవారం క్వార్టర్ ఫైనల్‌లో ఉక్రెయిన్‌కు చెందిన ప్రపంచ నెం. ఎలినా స్వితొలినాను 6–4, 6–0తో ఓడించి తొలిసారి గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. ప్రపంచ 37వ ర్యాంకరైన మెర్టిన్స్ ఇంత వరకు ఏ సెట్ ఓడిపోలేదు. ఈ నెలో మొదట్లో హోబర్ట్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లలో అజేయంగా నిలిచి 2018లో దూసుకెళుతోంది. ఇప్పుడామె టాప్ 20 ర్యాంకుకు మొదటిసారి ఎగబాకపోతున్నది. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ కొత్త ర్యాంకింగ్స్‌లు విడుదల చేశాక అది జరగనున్నది. మెర్టిన్స్ చాలా దూకుడుగా ఆడి స్వితొలినాను ఓడించింది.

కారోలిన్ వోజ్నియాకి గెలుపు



డెన్మార్క్‌కు చెందిన వోజ్నియాకి, స్పెయిన్‌కు చెందిన సురెజ్ నవారోపై మూడు సెట్లలో 6–0, 6–7(3), 6–2తో గెలిచేసింది. దీంతో 2011 తర్వాత తొలిసారి ఆమె సెమీఫైనల్స్‌కు చేరింది. ఈ రెండో సీడ్ క్రీడాకారిణి తదుపరి ఎలిస్ మెర్టిన్స్‌తో తలపడనున్నది.

సైనా ఏషియన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌కు ఆడేనా..?



న్యూఢిల్లీ: ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్‌కు సన్నద్ధమయ్యేందుకుగాను వచ్చే నెల జరగనున్న ఏషియా టీమ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనకూడదనుకుంటుంది స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్. కానీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బిఎఐ) ఆమెను ఒప్పించాలని చూస్తోంది. ఇందులో ఆడితే ప్రతిష్ఠాత్మక ఉబెర్ కప్‌కు అర్హత పొందే అవకాశం ఉంటుంది. ఇటీవల చీలమండ గాయం నుంచి కోలుకుని ఇండోనేషియా మాస్టర్స్ ఆడిన సైనా మలేషియాలోని అలోర్ సెటార్‌లో ఫిబ్రవరి 6 నుంచి 11 వరకు జరిగే ఏషియా ఈవెంట్ పాల్గొనకుండా ఉపసంహరించుకోడానికి అనుమతి కోరుతూ ఆమె బిఎఐకు లేఖ రాశారు. అయితే ఆమెను ఒప్పించే ప్రయత్నం చేస్తోంది బిఎఐ. థామస్ అండ్ ఉబెర్ కప్స్ ఫైనల్స్ బాంకాక్‌లో మే 20 నుంచి 27 వరకు జరగనున్నాయి.

ప్రతిభ చాటిన తెలంగాణ బాలబాలికలు

జాతీయ త్రోబాల్ ఛాంపియన్‌షిప్



హైదరాబాద్: సౌత్‌జోన్ జాతీయ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలబాలికల జట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. బెంగళూరులో జరిగిన ఈ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచి రెండు టైటిళ్లను దక్కించుకున్నాయి. సోమవారం జరిగిన బాలుర టైటిల్ పోరులో కర్ణాటక జట్టు 2521, 2523తో తెలంగాణపై గెలుపొందింది. బాలికల తుదిపోరులోనూ కర్ణాటక 2520, 2522తో తెలంగాణ ను ఓడించింది. బాలుర జట్టు తరఫున బి. వేణుగోపాల్, బాలికల జట్టులో ఆర్. మౌనిక రా థోడ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వీ రిద్దరికీ 'బెస్ట్ అటాకర్' అవార్డులు దక్కాయి.

పరువు కోసం టీమిండియా

- క్లీన్‌స్వీప్‌పై సౌతాఫ్రికా కన్ను
- నేటి నుంచి చివరి టెస్టు



జోహెన్నస్‌బర్గ్: ఇప్పటికే రెండు టెస్టుల్లో ఓటమి పాలై సిరీస్‌ను కోల్పోయిన టీమిండియా కనీసం బుధవారం ప్రారంభమయ్యే చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి కాస్తయిన పరువును కాపాడుకోవాలని భావిస్తోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్‌ను దక్కించుకున్న ఆతిథ్య సౌతాఫ్రికా క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. మూడో మ్యాచ్‌లోనూ గెలిచి భారత్‌ను వైట్‌వాష్ చేయాలనే పట్టుదలతో కనిపిస్తోంది. భారత్ మాత్రం ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఉంది. ఇందులో గెలిచి విమర్శకులకు గట్టి జవాబివ్వాలనే ఉద్దేశంతో టీమిండియా పోరుకు సిద్ధమైంది. స్టార్ ఆటగాడు అజింక్య రహానె ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగతాడా లేదా అన్నది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తున్న అంశం. వరుసగా రెండు మ్యాచుల్లో విఫలమైన రోహిత్ శర్మకు బదులు రహానె తుది జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. కానీ, కెప్టెన్ అతనికి అవకాశం ఇస్తాడా లేక రోహిత్‌నే ఆడిస్తాడా అన్నది తేలలేదు. ఇక, రెండో టెస్టుకు దూరంగా ఉన్న భువనేశ్వర్ కుమార్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. సౌతాఫ్రికా కూడా కొన్ని మార్పులతో బరిలోకి ఛాన్స్ ఉంది.

ఓపెనర్లే కీలకం...

ఇప్పటి వరకు నాలుగు ఇన్నింగ్స్‌లలోనూ భారత్‌కు శుభారంభం అందించడంలో ఓపెనర్లు విఫలమయ్యారు. ఇప్పటి వరకు ఓపెనర్లుగా దిగిన మురళీ విజయ్, శిఖర్ ధావన్, లోకేష్ రాహుల్ ఆశించిన విధంగా రాణించలేక పోయారు. రెండో టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో మురళీ విజయ్ కాస్త మెరుగ్గా రాణించినా రెండో ఇన్నింగ్స్‌లో చేతులెత్తేశాడు. ఇక, ఈ మ్యాచ్‌లో రాహుల్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ చేతులెత్తేశాడు. తొలి టెస్టులో ధావన్ కూడా నిరాశ పరిచాడు. ఈ పరిస్థితుల్లో మూడో టెస్టులో ఓపెనర్లు ఎలా రాణిస్తారనేది అంతు బట్టకుండా మారింది. ఈ మ్యాచ్‌లో రాహుల్‌కు మరో ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే ధావన్ పెవిలియన్‌కే పరిమితం కాక తప్పదు. కాగా, రెండు మ్యాచుల్లో విఫలమైన ఓపెనర్లు ఈసారి ఎలాగైన మెరుగైన ఆరంభాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నారు.

పుజారా ఈసారైనా...

ఇక, సిరీస్‌లో ఘోరంగా విఫలమవుతున్న మిస్టర్ డిపెండబుల్ చటేశ్వర్ పుజారా కనీసం ఆఖరి మ్యాచ్‌లోనైనా తన బ్యాట్‌కు పని చెబుతాడా లేదా అన్నది ఆసక్తిగా మారింది. జట్టు ఎన్నో ఆశలు పెట్టుకున్న పుజారా రెండు టెస్టుల్లోనూ నిరాశ పరిచాడు. అతని వైఫల్యం జట్టును వెంటాడుతోంది. విదేశి పిచ్‌లపై ఎంతో మెరుగైన రికార్డు కలిగిన పుజారా ఈ సిరీస్‌లో పరుగుల కోసం తంటాలు పడుతున్నాడు. సెంచూరియన్ టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను రనౌట్‌గా వెనుదిరిగాడు. చేజేతులా వికెట్‌ను పారేసుకొని ఇంటాబయట విమర్శలు ఎదుర్కొంటున్నాడు. అయితే మూడో టెస్టులో మాత్రం పుజారా తన బ్యాట్‌కు పని చెప్పేందుకు సిద్ధమయ్యాడు. అతను రాణిస్తే భారత్ బ్యాటింగ్ కష్టాలు చాలా వరకు తీరుతాయి. ఇక, ఈ మ్యాచ్‌లో రహానె బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే జరిగితే రోహిత్ వైదొలగడం ఖాయం. రోహిత్ రెండు మ్యాచుల్లోనూ విఫలం కావడంతో అతన్ని పక్కన బెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. కెప్టెన్ కోహ్లి మాత్రం ఇంకా రోహిత్‌పై నమ్మకంతోనే ఉన్నాడు. దీంతో రహానెకు స్థానంపై ఇంకా స్పష్టత దొరకడం లేదు.

కోహ్లికి పరీక్ష...

ఇక, కెప్టెన్ విరాట్ కోహ్లికి ఈ మ్యాచ్ పరీక్ష వంటిదేనని చెప్పాలి. రెండో టెస్టులో కోహ్లి హీరోచిత సెంచరీ సాధించినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేక పోయాడు. అయితే చివరి మ్యాచ్‌లో జట్టును ముందుండి నడిపించడం కోహ్లికి సవాలుగా మారింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన కోహ్లి ఒక్క ఇన్నింగ్స్‌లోనే సత్తా చాటాడు. అతని వైఫల్యం జట్టును తీవ్రంగా వెంటాడుతోంది. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా అతను తన బ్యాట్‌కు పని చెప్పాల్సి ఉంది. సొంతగడ్డపై వరుస సెంచరీలతో హోరెత్తించిన కోహ్లి దక్షిణాఫ్రికా గడ్డపైఆ జోరును కొనసాగించలేక పోయాడు. ఒక్క సెంచరీతోనే అతను సరిపెట్టుకున్నాడు. అయితే చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లకు తన బ్యాట్ పవర్ చూపించేందుకు తహతహలాడుతున్నాడు. అంతేగాక వరుస ఓటములతో తనపై వస్తున్న విమర్శలకు జవాబివ్వాల్సిన బాధ్యత కోహ్లిపై ఉంది. అందులో అతను ఎంత వరకు సఫలం అవుతాడో వేచిచూడక తప్పదు. ఇక, ఈ మ్యాచ్‌లో వికెట్ కీపర్‌గా పార్థివ్‌కు బదులు దినేష్ కార్తీక్‌ను దించడం ఖాయంగా కనిపిస్తోంది. రెండో టెస్టులో పార్థివ్ విఫలం కావడంతో అతనికి మరో ఛాన్స్ దొక్కడం కష్టంగా మారింది. ఇప్పటికే ప్రధాన వికెట్ కీపర్ సాహా గాయం వల్ల సిరీస్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో కార్తీక్ జట్టులోకి వచ్చాడు. అతనికి చివరి మ్యాచ్‌లో చోటు కల్పించేందుకు కెప్టెన్ సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. ఇక, బౌలింగ్‌లో మాత్రం భారత్‌కు ఎలాంటి ఇబ్బంది లేదనే చెప్పాలి. కొత్తగా శార్దూల్ ఠాకూర్, నవ్‌దీప్ సైనిని పిలిపించడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. అయితే ఇషాంత్, షమి, భువనేశ్వర్, బుమ్రా, అశ్విన్, ఉమేశ్, జడేజాలతో బౌలింగ్ చాలా బలంగా ఉంది. వీరిలో ఎవరిని ఎంపిక చేసినా జట్టుకు ఇబ్బంది లేదు. ఇప్పటివరకు ప్రతి బౌలర్ మెరుగ్గానే బౌలింగ్ చేయడమే దీనికి కారణం.

జోరుమీదున్నారు...

ఇప్పటికే సిరీస్‌ను దక్కించుకున్న దక్షిణాఫ్రికా చివరి మ్యాచ్‌కు సమరోత్సాహంతో సిద్ధమైంది. ఈ టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో దక్షిణాఫ్రికా బలంగా కనిపిస్తోంది. రెండో టెస్టులో రాణించిన ఎంగిడిపై జట్టు భారీ ఆశలు పెట్టుకొంది. మోర్కెల్, రబడా, ఫిలాండర్‌లతో బౌలింగ్ చాలా బలంగా ఉంది. అంతేగాక, ఎల్గర్, మార్క్రాం, డివిలియర్స్, డుప్లెసిస్, డికాక్ తదితరులతో బ్యాటింగ్ కూడా పటిష్టంగా ఉంది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ సౌతాఫ్రికా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

జట్ల వివరాలు (అంచనా):

భారత్: విరాట్ కోహ్లి (సారథి), శిఖర్ ధావన్, మురళీ విజయ్,కె.ఎల్ రాహుల్, ఛెతేశ్వర్ పుజారా, అజింక్య రహానె, రోహిత్ శర్మ, వృద్ధిమాన్ సాహా, హార్దిక్ పాండ్య, అశ్విన్, జడేజా, భువనేశ్వర్, ఇషాంత్, ఉమేశ్, షమీ, బుమ్రా, పార్థివ్ పటేల్.

దక్షిణాఫ్రికా: డుప్లెసిస్ (సారథి), డీన్ ఎల్గర్, అయిడెన్ మార్క్రమ్, హాషీమ్ ఆమ్లా, డి బ్రూన్, క్వింటన్ డికాక్, కేశవ్ మహారాజ్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, వెర్నాన్ ఫిలాండర్, రబాడ, అండిలె ఫెహ్లుక్‌వాయో, లుంగి ఎంగిడి, డానీ ఒలివర్.



మధ్యాహ్నం 1:30 గంటల నుంచి మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.